# Jhen~Hkxor

# ipjRu

¼ rsyx ½

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ప్రహ్లాద చరిత్ర (సప్తమ స్కంధము) | 15 |
| 2. | గజేంద్రమోక్షణ కథ (అష్టమ స్కంధము) | 65 |
| 3. | వామనచరిత్ర | 89 |
| 4. | రుక్మిణీ కల్యాణము | 137 |
| 5. | కుచేలోపాఖ్యానము | 163 |


## భాగవత భక్తితత్త్వము


| | | |
|---|---|---|
| 1. | అంబరీషుడు | 177 |
| 2. | శ్రీశుకవాణి - భక్తిమార్గము (ద్వితీయ స్కంధము) | 191 |
| 3. | ధ్రువస్తుతి | 199 |
| 4. | రుద్రగీత | 204 |
| 5. | గోపికల శ్రీకృష్ణప్రేమ | 209 |
| 6. | అక్రూరస్తుతి | 216 |
| 7. | కపిలబోధ | 218 |
| 8. | ఋషభదేవుని బోధ | 223 |
| 9. | ఋషభపుత్రుల బోధ | 226 |
| 10. | శ్రీకృష్ణ బోధ | 230 |
| | బ్రహ్మాదికృత దేవకీ గర్భగత విష్ణు స్తుతిః | 239 |

ఓం శ్రీ పరమాత్మనే నమః

# శ్రీమద్ భాగవత పంచరత్నములు

## (అనుబంధము - భాగవత భక్తితత్త్వము)

ఒకనాడు బ్రహ్మమానసపుత్రులైన సనక సనందాదులు త్రిభువనములు సంచరించుచు, ఐదారేండ్ల బాలకులరూపమున వైకుంఠములోని శ్రీహరి నివాసమందిరమున ప్రవేశించుచుండగా అచ్చట ద్వారపాలకులైన జయవిజయులనబడు విష్ణుసేవకులు వారినడ్డగించి, అవమానించగా, ఆ బాలఋషులు కోపగించుకొని ఇట్లు శపించిరి: "మీ వంటి దుశ్శీలురు వైకుంఠమున నుండనర్హులు కారు గనుక నారాయణ చరణ సన్నిధికి దూరులై అసురులై జన్మింతురుగాక!" అప్పుడు ఆ ద్వారపాలకులు తమ తప్పిదమును తెలుసుకొని మొఱపెట్టగా, ఆ ఋషిశ్రేష్ఠులు కరుణించి, "మూడు జన్మల విష్ణు వైరమనంతరం, మరల విష్ణుసాన్నిధ్యమును పొందగలరని అనుగ్రహించిరి. ఆ ప్రకారము వారు మొదట హిరణ్యాక్ష హిరణ్యకశిపులుగను, రెండవ జన్మలో రావణ కుంభకర్ణులుగను, చివరి జన్మలో శిశుపాల దంతవక్త్రులుగను జన్మించి, విష్ణుద్వేషులై శ్రీహరిచే సంహరింపబడి శాపవిమోచనులైరి.

హిరణ్యాక్షుడు తన భుజబల గర్వమదాంధుడై, తన్నెదుర్కొనిపోరగల నీరాధివీరుడెవడైనా కలడాయని, భూలోకమును, వరుణలోకమును, స్వర్గలోక వైకుంఠములను వెదకి వెదకి, యెవ్వరినీ గానక వైకుంఠుడొక్కడే తనతో పోరగలవాడని విని, అతడప్పటికి పాతాళ లోకమునకు వెళ్లి యుండెనని తెలుసుకొని, క్రోధావేశుడై పాతాళమునకు పోయెను. అచ్చట శ్రీహరి వరాహరూపమున భూమిని తన కోరలపై నిడుకొని సముద్ర ఉపరితలమునకు కొనిపోవుచుండెను. హిరణ్యాక్షుడా వరాహరూప శ్రీహరి నెదుర్కొని నానా దుర్భాలషలతో వదురుచూ, యుద్ధమునకు రమ్మనెను. శ్రీహరి భూమిని నీటిపై స్థిరముగా నిలిపి, రాక్షసునితో యుద్ధము చేసెను. ఆ ఘోరయుద్ధములో హిరణ్యాక్షుడు శ్రీహరి చక్రాయుధమునకు బలి అయ్యెను. సోదరుని సంహరించిన శ్రీహరిపై హిరణ్యకశిపుడు, ద్వేషము, శత్రుత్వములను పెంచుకొని, తన అనుచరులను విష్ణువుయొక్క ఉనికి గురించి తెలుసుకొని రమ్మనెను. ఆ విష్ణువు, విప్రులుండే చోట్లలోనో, యజ్ఞస్థలములలోనో,

తపోవనములలోనో ఉండునని, వాటిని ధ్వంసము చేసినచో అతడు నశించునని, కనిపించిన దేవతలను, మునులను, బ్రాహ్మణులను, గోవులను హతమార్చవలెనని ఆదేశించెను. ఆ రాకాసి మూకలు ముల్లోకములలోను విధ్వంసక కాండను కొనసాగిస్తూ బీభత్సమును సృష్టించిరి. దేవతలకు నిలువనీడలేక ఇంద్రునితో సహా, ఎక్కడెక్కడికో పారిపోయిరి. హిరణ్యకశిపుడు మృత్యువును జయించునుద్దేశముతో నెవ్వరును చేసియుండనట్టి ఘోరతపస్సు నాచరించెను. ఆ తపశ్శక్తి యొక్క ఉగ్రతచే లోకములు తల్లడిల్లెను. సముద్రములు అల్లకల్లోలమయ్యెను. గ్రహతారకలు గతులు తప్పెను. దేవతలు భీతిజెంది, యీ ఉపద్రవమును నివారింపుమని బ్రహ్మదేవుని వేడుకొనిరి. బ్రహ్మ హిరణ్యకశిపుని, తపస్సు చాలించవలసినదిగా కోరెను. హిరణ్యకశిపుడు ఒక అద్భుతమైన వరము కోరుకొనెను. ఈ ముల్లోకములలో తానెక్కడికి వెళ్లినను విజయమే కలుగవలెను, బ్రహ్మచే సృష్టింపబడిన ఏ ప్రాణిచేతనైనను తనకు మరణం కలుగకూడదు. గాలిలోనుగాని, నీటిలోగాని, నింగిలోగాని, నిప్పులోగాని, నేలపైగాని, ఇంటా బయటా గాని, చీకటి వెలుగులలోగాని, అస్త్ర శస్త్రాలవలనగాని, దేవదానవ నర జంతునాగుల వలనగాని తనకు మరణం కలుగకూడదనట్టివరము కోరుకొనెను. అట్టి అపూర్వమైన వరమును దుర్వినియోగ పరచవద్దని హెచ్చరించి బ్రహ్మదేవుడు తథాస్తు చెప్పెను. వరమును పొందిన హిరణ్యకశిపుని అహంకారమునకు అవధులు లేకుండెను. మూడు లోకములలోని ప్రాణులను హింసింపసాగెను. దిక్పాలకులను తరిమివేసి వారి రాజధానుల నాక్రమించెను. దేవేంద్రుడు భయముతో పారిపోయెను. ఇంద్రుని సింహాసనమును, రాజమందిరమును ఆక్రమించెను. దేవతలు భయపడి, అతని ఆజ్ఞలను పాటింపసాగిరి. అతడు పెట్టు బాధలను భరింపలేక దేవతలు, శ్రీహరితో మొఱపెట్టుకొనిరి. అప్పుడు శ్రీహరి వాక్కు ఇలాగ వినబడినది: "దేవతలారా! భయపడవలదు. ధర్మము తప్పినవాడు, నన్ను, వేదములను నిందించువాడు, సాధుసజ్జనులను, గోవులను, హింసించువాడు, అచిరకాలములోనే పతనమైపోవును. సకల సద్గుణభూషణుడు, నా భక్తుడు అయిన ప్రహ్లాదునికి మితిమీరిన హింసలను పెట్టునప్పుడు ఆ దానవుని అంతమాసన్నమైనట్లు గ్రహించుడు. అంతవరకు ధైర్యము వహించుడు" అని వినిపించెను.

## 1. ప్రహ్లాద చరిత్ర (సప్తమ స్కంధము)

యుధిష్ఠిరునిచే చేయింపబడిన రాజసూయ యాగమునకు వచ్చిన నారదమహర్షి ధర్మనందనునకీ ప్రహ్లాదచరిత్ర నీవిధముగ చెప్పెను :

రాజా! హిరణ్యకశిపునకు నలుగురు పుత్రులుండిరి. వారిలో ప్రథముడు ప్రహ్లాదుడు. అతడు సాటిలేని హరిభక్తుడు, పరమభాగవతుడు, నారాయణ తత్త్వమును బాగుగ నెఱిగియున్నవాడు. ఇంకా ఎలాంటి వాడంటే -

సీ. తనయందు నఖిలభూతములందు నొకభంగి
సమహితత్వంబున జరగువాఁడు
పెద్దలఁ బొడగన్న భృత్యునికైవడిఁ
జేరి నమస్కృతుల్ సేయువాఁడు
కన్నుదోయికి నన్యకాంత లడ్డంబైన
మాతృభావము సేసి మరలువాఁడు
తల్లిదండ్రులభంగి ధర్మవత్సలతను
దీనులఁ గావఁ జింతించువాఁడు.

తే. సఖులయెడ సోదరస్థితిజరుపు వాఁడు
దైవతము లంచు గురువులఁ దలఁచువాఁడు
లీలలందును బొంకులు లేనివాఁడు
లలితమర్యాదుఁడైన ప్రహ్లాదుఁ డధిప.

రాజా! ప్రహ్లాదుడు సమస్తప్రాణులు, తనవంటివేనని వానియందు సమసుహృద్భావమును కలిగియుండెను. పెద్దలెదురైనచో సేవకునివలె నమస్కరించు వినయశీలి, పరస్త్రీ లెదురైనచో మాతృభావముతో తొలగిపోవు శీలవంతుడు, దీనులను తల్లిదండ్రులవలె ధర్మవత్సలతతోఆదరించ దలచువాడు, సాటివారిని సోదరభావముతో చూచు సహృదయుడు. గురువులను దైవ సమానులుగా భావించువాడు. వినోదము కొఱకైనను అసత్యము లాడనివాడు, ఇటువంటి ఉత్తమ సత్త్వగుణ సంపన్నుఁ డీ ప్రహ్లాదుడు

సుమా! అతడు సుందరాకారుడును, చక్రవర్తి తనయుడును, విద్యావంతుడును, శ్రేష్ఠుడును అయి యున్నప్పటికినీ, గర్వాహంకారములకు లోనుగానివాడు. సకలవిషయ భోగభాగ్యముల మధ్య మసలుచున్నను, ఇంద్రియముల ప్రభావమునకు వశముకానట్టివాడు. యౌవన బలోపేతుడైనను కామక్రోధాదులను దరిజేరనివ్వనివాడు. స్త్రీ సంపర్కావకాశము లెంత సులభమైనను వానియందు ఆపేక్ష జూపనివాడు. ప్రాపంచిక శబ్దస్పర్శాది విషయముల యందెట్టి వాంఛయు లేనివాడు. రాజా! ఈ దైత్యకుమారుడన్యమేమీ యెఱుంగక శ్రీహరి చింతనా మగ్నుడై యుండెను.

ఆ. సద్గుణంబు లెల్ల సంఘంబులై వచ్చి
యసుర రాజతనయునందు నిలిచి
పాసి చనవు విష్ణుఁ బాయనివిధమున
నెమ్మి దగిలి యుండు నిర్మలాత్మ.

ఓ నిర్మలాత్మా! ధర్మనందనా! ఈ అసురరాజపుత్రునియందు, సద్గుణములన్నీ సమూహముగ వచ్చి నిలిచిపోయినట్లున్నవి. అవి, విష్ణువును విడిచిపోలేని భక్తులవలె, ప్రహ్లాదునియందే ప్రీతితోడ విడిచివెళ్లకుండ నిలిచిపోయినవి. అసుర శత్రువులైన ఇంద్రాది దేవతలు కూడ తమ సభలలో, 'ప్రహ్లాదునితో సమమైన సుగుణోపేతులను మేమెన్నడు నెఱిగియుండము" అని కవిశ్రేష్ఠులవలె పొగుడుచుండగా, ఓ మహారాజా! మీవంటి ఉత్తమ భగవద్భక్తులా రాక్షస రాకుమారుని కీర్తింపకుండ నుండగలరా? గుణనిధియైన ఆ ప్రహ్లాదుని గుణగణము లనేకములు కలవు. వాటిని లెక్కించుటకు వెయ్యితలల ఆదిశేషువునకు గాని దేవగురువైన బృహస్పతికిగాని, వాణీపతియైన బ్రహ్మదేవునికిగాని ఎంతకాలము ప్రయత్నించినా సాధ్యపడదు. ఇటువంటి సద్గుణభూషణుడైన ప్రహ్లాదునియందు వాసుదేవుని యెడల సహజభక్తి, నిరంతర ధ్యానరతి మెండుగనుండెను.

అట్టి ధ్యానమగ్నుడైయుండు తరుణమున, శ్రీహరి తన్నుజేరినట్లైన, తాను తన - స్నేహితులను చేరమఱచును, శ్రీహరి తనతో నాటలాడునట్లైన, తాను

తన స్నేహితులతో ఆటలాడ మఱచును. భక్తవత్సలుడైన శ్రీహరి తనతో సంభాషించి నట్లైన, తాను ఇతరుల మాటలకు బదులు చెప్పమఱచును. శ్రీహరి తన హృదయములోనికి చూచినట్లైన తాను సమస్తమును జూడమఱచును. శ్రీహరి పాదపద్మముల యందు చింతనామృతముచే నంతరంగము నిండినట్లైన అతడు ఆనందపూర్ణుడై సర్వమును మఱచి జడత్వములేని జడునివలె నుండును. మఱియును,

శా. పానీయంబులు ద్రావుచుం గుడుచుచున్ భాషించుచున్ హాసలీ
లానిద్రాదులు సేయుచుం దిరుగుచున్ లక్షించుచున్ సంతత
శ్రీనారాయణపాదపద్మ యుగళీచింతామృతాస్వాదసం
ధానుండై మఱచెన్ సురారిసుతుఁ డేతద్విశ్వమున్ భూవరా

ఓ భూమీశా! ఆ ప్రహ్లాదుడు అన్నపానము లారగించుచున్నప్పుడును, వినోదించునప్పుడును, నిద్రకుపక్రమించునప్పుడును, తిరుగుచున్నప్పుడును, చూచుచున్నప్పుడును, శ్రీహరియొక్క పాదపద్మముల చింతనామృతమును, నిరంతరము గ్రోలుచున్నవాడై ఈ విశ్వమునే మఱచిపోవుచుండును.

సీ. వైకుంఠ చింతా వివర్జిత చేష్టుఁడై యొక్కఁడు నేడుచు నొక్కచోట
నశ్రాంతహరిభావనారూఢచిత్తుఁడై యుద్ధతుఁడై పాడు నొక్కచోట
విష్ణుఁ డింతియ కాని వేఱొండు లేదని యొత్తిలి నగుచుండు నొక్కచోట
నలినాక్షుఁడను నిధానముఁ గంటి నేనని యుబ్బి గంతులు వైచు నొక్కచోటఁ

ఆ. బలుకు నొక్కచోటఁ బరమేశుఁ గేశవుఁ
బ్రణయహర్ష జనితబాష్పసలిల
మిళితపులకుఁడై నిమీలితనేత్రుఁడై
యొక్కచోట నిలిచి యూరకుండు.

ఆ ప్రహ్లాదుడు విష్ణుమూర్తి చింతనలో మునిగి చేష్టలుడిగినవాడై, ఒక్కచోట ఒక్కడూ కూర్చొని ఏడ్చేవాడు. నిర్విరామమైన శ్రీహరి చింతనతో నిండిన మనస్సుతో గొంతెత్తి గానము చేసేవాడు వేఱొకచోట. అంతా విష్ణుమయమేగాని వేఱేమియును లేదని నొక్కివక్కాణించుచు నవ్వెడి

వాడింకొకచోట. "పద్మాక్షుడనే పెన్నిధిని కనుగొంటినేను" అని పొంగి గంతులు వేయును వేఱొకచోట. పరమేశ్వరుడైన కేశవునితో స్వగతముగ మాట్లాడు నొకచోట. ప్రేమపూరిత భక్తిపారవశ్యములో మైమరచి ఆనందబాష్పములు రాల్చుచు పులకిత శరీరుడై నిమీలితనేత్రుడై నిల్చొనియుండు నింకొకచోట.

ఈ విధముగ పూర్వజన్మలయందు సంప్రాప్తమైన పరమభాగవతుల సాంగత్యముచే లభించిన ముకుంద చరణారవింద సేవానిరతిచే వికసించిన మోక్షకాంక్షను పెంపొందించుకొనుచు, అసుర సంపర్కముచే, తన చిత్తమును అన్యాక్రాంతము కాకుండ నదుపు నందుంచుకొనుచు, సంసారబంధమును తొలగించుకొనుచునుండు బుధజనవిధేయుడును, సుగుణ మణిశ్రేష్ఠుడును, పరమభాగవతోత్తముడును, పవిత్రుడును అయిన సుపుత్రునితో శత్రుత్వము వహించి, రాక్షసరాజు కొంచెమైనను కరుణలేక చంపింప బూనుకొనెను - అని చెప్పిన నారదునితో ధర్మజు డిట్లనెను :

"నారదమునీంద్రా! పుత్రులు (తాము చెప్పెడి బుద్ధులను) నేర్చినను, నేర్వకున్నను తండ్రులు వారినెల్లప్పుడును పోషింపవలెను, మఱియు వారికి స్నేహభావముతో బుద్ధిజెప్పి చెడు ప్రవర్తనను నివారింపవలెనేగాని, యెన్నడును శత్రుత్వమును వహింపరాదుకదా! మరి యీ సౌజన్యరత్నాకరుడును, లోకపవిత్రుడును అయిన పుత్రుని బాధలుపెట్టుటకు ఆతండ్రి యెట్లు పూనుకొనెనో! శ్రీహరిపాదపద్మ చింతనలోనే రమించువాడును, కృపాళువు, గురువులకు, సాధువులకు తలవంచి నమస్కరించు వినయశీలుడును, సజ్జనులచే నుతింపబడువాడును, మోహమును తొలగించుకొన్నవాడును, విశాలమైన కీర్తిగలవాడును అయిన ఆ బాలుని ఏ కారణముచేత తండ్రి చంపించదలచెనో నాకు చెప్పుడు" అనిన నారదుడిట్లు చెప్పెను:

ఒకనాడు హిరణ్యాకశిపుడు తన పుత్రుని గురించి యిట్లు తలపోసెను. "వీడు నాకు లభ్యమైన సురలోకాధిపత్యమును గురించి లక్ష్యపెట్టుటలేదు (గుర్తించుటలేదు). ఎల్లప్పుడును గృహమందే స్తబ్ధుడై బలహీనునివలె జడునివలె నుంటున్నాడు. వీనిని విద్యాభ్యాసమునందు నియోగించినగాని వీని మతి చుఱుకు అవదు - అని తలంచి పుత్రుని దగ్గర చేర్చుకొని యిట్లనెను:

"నాయనా! చదువులేని వాడజ్ఞానియై యుండును. చదువుకున్నచో సదసత్ (మంచిచెడుల) వివేకము, చతురత కలుగును. అందుచేత అందరూ చదువుకొనవలెను. నిన్ను పెద్దలవద్ద చదివించెదను. చదువుకొనుము తండ్రీ! అని చెప్పి, అసురుల పురోహితుడైన శుక్రాచార్యుని పుత్రులైన చండామార్కులను రావించి, వారితో ఇట్లనెను: ఓ గురువర్యులారా! ఈ బాలుడంధునివలె ఉంటున్నాడు, మంచి వాక్కులేవీ చెప్పడు. (విద్యాగంధము లేని జడునివలె నున్నాడు). నా యొక్క శౌర్యప్రతాపముల ప్రభావమాతనిపై నేమియును లేదు. మీరు గురువులు, కరుణాచిత్తులు, గౌరవనీయులు, మా మాట మన్నించి, యీ బాలునకు చదువుచెప్పి, నీతులు నేర్పి, గ్రంథములు చదివించి, రక్షింపుడు అని పలికి, వారికి ప్రహ్లాదుని అప్పగించినంతనే, వారాబాలుని తోడ్కొనిపోయి, సమవయస్కులగు ఇతర బాలురతో చేర్చి, అతనికి మిక్కిలి శ్రద్ధతో పాఠ్యయోగ్యములైన అనేకశాస్త్రములను చదివింపించిరి. ఆ బాలుడు వాటినన్నిటినీ నిశ్చలమైన విష్ణుభక్తిగలవాడై నేర్చుకొనెను. గురువులేవిధమున నేర్పించిన, నా విధముగనే, యెట్టి అడ్డ ప్రశ్నలను వేయకుండ, అవియన్నియు మిథ్యాపాఠములే యని తెలిసియుండియు నేర్చుకొనెను. అంత, కొన్ని దినములపిదప, ఆ దానవ రాజు, పుత్రునికి గురువులేమేమి నేర్పిరో, బాలుడేమి నేర్చుకొనెనో, నెఱుంగగోరి రాజమహాసౌధములో ఆసీనుడై, మిక్కిలి సంతోషముతో ప్రహ్లాదకుమారుని పిలుపనంపెను. ఆ బాలుడు, ఎట్టివాడన - సంసారమహాసాగరమును తరింపజేయువాడును, కామక్రోధాది అరిషడ్వర్గమును రూపుమాపువాడును, పాపములనెడి అరణ్యమును నరికివేయు గొడ్డలివంటివాడును, అగు ఆ శ్రీహరిని గురించి కఠోరమైన ధ్యానమగ్నుడై హరి చింతనామృతము ఆస్వాదించుచుండువాడు. ప్రహ్లాదుడు వచ్చి చెంత జేరగానే వత్సా! రమ్మని దగ్గరకు చేరదీసి, సంపూర్ణమైన వాత్సల్యముతో తొడపై కూర్చుండబెట్టుకొని, దానవప్రభువు అత్యంత కుతూహలముతో పుత్రుని యిట్లడిగెను. "నాయనా! నీవు, గురువులనుండి, ఉత్సాహము, పట్టుదలతో కృషిచేసి, నేర్చుకొని, ప్రభుమంత్ర శక్తియుతుడవై జ్ఞానసంపన్నుడవైతివా? వేదములు శాస్త్రములు చదివితివా? నాయనా! పుత్రులతో సంభాషణములు, దినదినమూ ఉత్పన్నమగుచుండు కర్మజనిత శ్రమలు, తాపములు,

దుఃఖములను శోషింపజేయునవి, సంతోషము కలుగజేయునవి, తండ్రులకు కర్ణభూషణము లగును కదా! నాయనా! నీకు ఏది మిక్కిలి శ్రేష్ఠమనిపించు చున్నదో దాని గురించి నాకు జెప్పుమయ్యా! అని ప్రేమతో తండ్రి యడిగిన ప్రశ్నకు ప్రియనందను డిట్లు చెప్పెను:

ఓ దైత్యశ్రేష్ఠా! "ఇల్లు' యనబడు చీకటి నూతిలో పడి కొట్టుకొనకుండ, మీరు, మేము, అను భ్రమలోను, భేదభావముతోను ప్రవర్తింపక, సర్వమూ ఆ శ్రీహరియొక్క దివ్యలీలామయమనీ, యాతనిని మనస్సులో నిలుపుకొని, తాము అడవియందుండుట, శరీరధారులకు శ్రేష్ఠమైన మార్గమని నేను భావింతును తండ్రీ!

అని, కుమారుడాడిన శత్రుప్రశంసను విని, దానవేంద్రుడు పుత్రుని యొక్క జ్ఞానహీనతకు కోపగించుకొనక చిరునవ్వుతో నిట్లనియె :

శా. నాకుం జూడఁగఁ జోద్య మయ్యెడిఁగదా నా తండ్రి యీ బుద్ధి దా
నీకున్ లోపలఁ దోఁచెనో పరులు దుర్నీతుల్ పఠింపించిరో
యేకాంతంబున భార్గవుల్ పలికిరో యీ దానవశ్రేణికిన్
వైకుంఠుండు కృతాపరాధుఁ డతనిన్ వర్ణింప నీకేటికిన్.

నాయనా! ఆలోచించి చూడగా, నీ మాటలు నాకు మరీ విడ్డూరముగా నున్నవి. ఈ బుద్ధి నీకే మనస్సులో దోచెనా? లేక దుర్మార్గులైన పరులెవ్వరైన నేర్పించిరా? లేదా, నీ గురువులైన భార్గవులే నీకు రహస్యముగా ఈ వక్రబుద్ధినెక్కించిరా? తండ్రీ! నీకు తెలియదేమో, వైకుంఠుడు మనపట్ల అపరాధము చేసినవాడు. అతనిని వర్ణింపవలసిన అవసరము నీకేమున్నది?

మ. సురలం దోలుటయో సుధాధిపతులన్ స్రుక్కించుటో సిద్ధులం
బరివేధించుట యో ముని ప్రవరులన్ బాధించుటో యక్షకి
న్నరగంధర్వవిహంగనాగపతులన్ నాశంబు నొందించుటో
హరి యంచున్ గిరి యంచు నేల చెడ మోహాంధుండవై పుత్రకా

పుత్రా! (మనకు కొన్ని కర్తవ్యములున్నవి. నీవు తెలుసుకొనుట మంచిది) సురలను తరిమివేయుటయో, సురశ్రేష్ఠులను నలిపి పారవేయుటయో, సిద్ధుల

ననేకవిధముల వేధించుటయో, మునిశ్రేష్ఠులను బాధించుటయో, యక్ష, కిన్నర, గంధర్వ, విహంగ (పక్షులను) నాగ శ్రేష్ఠులను నాశనము చేయుట మొదలైన కార్యములు చేయవలయును గాని, హరి, గిరి యనుకుంటూ మోహాంధుడవై చెడిపోరాదు.

అని తండ్రి చెప్పగా ఆ ప్రహ్లాదుడు, గురువువంక చూచుచు నిట్లనియె: ఎవ్వనియందు సంపూర్ణముగ మనస్సు నిల్పుకొనినచో యెఱుక గలిగి, తనవారు, పరులు యనెడి మాయాజనిత మిథ్యాభావములు కలుగక మోహనాశమగునో యట్టి పరమేశ్వరునకు నమస్కరించెదను.

అందరి యందు ఆత్మరూపునిగ వెలసియుండు సర్వాత్మకుని, కేవల ప్రజ్ఞద్వారానే తెలియబడు జ్ఞానస్వరూపుని కొందరు అజ్ఞానులు, "మేము, వారు" అను భేదభావముచే మాయావశులై, శుష్కవాద ప్రతివాదములచే నిరూపింప దలచువారు మూఢులు. ఏలనన, బ్రహ్మాదివేదవేత్తలే ఆ పరమాత్ముడైన విష్ణువును దర్శింపజాలరైరి, మరియితరుల కది సాధ్యపడునా?

బ్రాహ్మణోత్తమా, గురుదేవా! ఇనుము అయస్కాంతము సన్నిధిలో నేవిధముగ ఆకర్షితమై భ్రాంతమగునో, యీ విధముగనే దైవయోగముచేత నా మనస్సు ఆ శ్రీహరి చెంత ఆకర్షితమై ద్రవించిపోవుచున్నది. ఎట్లన -

సీ. మందారమకరందమాధుర్యమునఁ దేలు మధుపంబు వోవునే మదనములకు
నిర్మలమందాకినీవీచికలఁ దూఁగు రాయంచ సనునె తరంగిణులకు
లలితరసాలపల్లవఖాదియై చొక్కు కోయిల సేరునే కుటజములకు
బూర్ణేందుచంద్రికాస్ఫురితచకోరకం బరుగునే సాంద్రనీహారములకు

తే. నంబుజోదరదివ్యపాదారవింద
చింతనామృతపానవిశేషమత్త
చిత్తమేరీతి నితరంబుఁ జేరనేర్చు
వినుతగుణశీల మాటలు వేయునేల

గురువర్యా! మందార పుష్ప తేనెల మాధుర్యములో తేలియాడే తేనెటీగ (తుమ్మెద) ఉమ్మెత్త చెట్ల చెంతకు జేరునా? నిర్మల మందగమన గంగానదీ

చిరు అలలపై తూగుచుండు రాజహంస, వడిగా ప్రవహించు నదుల వైపుకు వెళ్లునా? లేలేత మామిడి చిగుళ్లను ఆరగిస్తూ పరవశించే కోయిల, కొండమల్లె తుప్పలవైపు వెళ్లునా? నిండు పున్నమి వెన్నెలలో పరవశించి విహరించే చకోరపక్షి దట్టమైన పొగ మంచులో ప్రవేశించునా? లేదు, అట్లు చేయలేవు కదా! ఆ విధముగనే పద్మనాభుని దివ్యపాదపద్మ ధ్యానామృతమును గ్రోలి, మత్తెక్కిన నా చిత్తమెట్లు ఇతర విషయములపైకి పోగలదు? అది అసంభవము కనుక ఓ సుగుణశీలశ్రేష్ఠా! ఈ విషయముపై నింక వెయ్యిమాటలెందుకు?

అనిన విని, రాజసేవకుడైన పురోహితుడు (గురువు) కోపము తెచ్చుకొని, తిరస్కార భావముతో ప్రహ్లాదునితో నిట్లనెను :

ఓరీ బాలకా! ఐదేండ్ల వయస్సు వాడవు "ఇంత" అయినా లేవు. కాని తర్కభాష్యములు చేయుచుంటివి. మేము నీకు నేర్పిన అనేకమైన శాస్త్రములలోని ఒకించుకైనను చెప్పకుండా దానవేంద్రుని యెదుట మాకు తలవంపులు తెచ్చితివి. శత్రుప్రశంసలు చేస్తున్న నీవు వంశదూషణుడవు!

వీడు దానవ ప్రభువుకు పుత్రుడు గాడు, శత్రువు. దానవ చందనవనము నందుపుట్టిన ముళ్లమొక్కవలె పుట్టినవాడు. ఎల్లప్పుడును రాక్షససంహారియైన ఆ హరినే ప్రశంసించుచున్నాడు. తీవ్రమైన దండనములకుగాని సామాన్యమైన శిక్షలకు భయపడడు. వీనిని పట్టుకొని కఠినముగ కొట్టుడు అని రాజుతో నిట్లనెను : ఓ దానవేశ్వరా! నీ పాదముల సాక్షిగా నీ బాలుని చదివించెదము. ఇంకను ఎక్కువ నైపుణ్యముతో చదివించెదము. మేమితనిపై మిక్కిలిగా కోపించెదము, దండించెదము. నీవు మాపై కోపింపవలదు ప్రభో! అని చెప్పి, బాలకుని అనేకవిధముల బెదిరించుచు, అక్కడినుండి తోడ్కొనిపోయెను. గురువు, శిష్యునకు సామ దాన భేద దండోపాయములన్నియును బోధించి, అతడు నీతి కోవిదుడయ్యెనని నమ్మి, నిశ్చయించి, తల్లికి వెఱింగించి, ఆమెచే బాలుని చక్కగ నలంకరింపజేసి, బాలుని ఇట్లు వేడుకొనెను:

నాయనా, ప్రహ్లాదకుమారా! మేము నేర్పిన త్రివర్గపాఠములను తప్పులేకుండా చెప్పుమయ్యా నీ తండ్రికి. మేము చెప్పినట్లే ఏమీ మార్చకుండా నీతులను ఒప్పజెప్పుము నాయనా! నేడు నేను మన దానవచక్రవర్తి వద్దకుపోయి, నీ

చదువుగురించి నివేదించెదను. కుమారా! అక్కడ నీవు శత్రుప్రశంసమాత్రము చేయకు సుమా! దుష్టములైన ఆ విష్ణుచరిత్ర గాథల గురించి ఏమీ ప్రసంగించవద్దు అని బ్రతిమాలి, బుజ్జగించి, బాలుని, దానవేంద్రుని సన్నిధికి కొనిపోయెను.

ఆ బాలుండెట్టి వాడనగా - అడుగడుగునా మాధవానుచింతన సుధామాధుర్యమును గ్రోలి మేను మఱచువాడు. పద్మసంభవుడైన బ్రహ్మదేవుడు కూడ అభ్యసింపలేనట్టి హరిభక్తిభావము గలవాడు. మాతృగర్భములో ప్రవేశించినది మొదలుగా శ్రీహరియందే చిత్తమును నిలుపువాడు. ప్రపంచమంతా విష్ణుమయమే యని తనలోనే మననము చేసుకొనువాడు, వినయము, కరుణ, వివేకము, మొదలైన దైవగుణములకు నివాసస్థానమైనవాడు. బుద్ధిమంతులచే గౌరవింపబడునట్టి ఆ ఉత్తమ శిష్యుడైన ప్రహ్లాదుని, గురువు తోడ్కొని వచ్చి రాజు యెదుట నిలిపి తండ్రికి నమస్కరింపుమని ముందుకు త్రోసెను.

మఱియు, రాజుతో నిట్లనెను : ఓ రాక్షసవంశప్రభూ! నీ కుమారునికి చక్కని శిక్షణ నిచ్చితిమి. ఇక నీతడు విరోధి పక్షపు మాటలాడడు. నీతిపారగుడయ్యెను. ఇతని విద్యాబలమును పరీక్షింపుము. అనిన విని, తనకు ప్రణామము చేసి నిలుచున్న పుత్రుని దీవించి, రాక్షసరాజు, చేతులు చాచి, ఆలింగనము చేసి, తొడపై కూర్చుండబెట్టుకొని చెక్కిలి ముద్దాడి, ప్రేమాతిశయముచే బాష్పములు రాల్చి, మధురాలాపనతో నిట్లనెను : వత్సా!

శా. చోద్యం బయ్యెడి నింతకాల మరిగెన్ శోధించి యేమేమి సం
వేద్యాంశంబులు సెప్పిరో గురువు లేవెంటం బఠింపించిరో
విద్యాసార మెఱుంగఁగోరెద భవద్విజ్ఞాతశాస్త్రంబులోఁ
బద్యం బొక్కటి సెప్పి సార్థముగఁ దాత్పర్యంబు భాషింపుమా

నాయనా! ఆశ్చర్యముగా నున్నదే! నీవు చదువు ప్రారంభించి యింతకాలమైనది కదా! నీవు నేర్వవలసిన ఏయే యంశములను నీ గురువులు ఏర్చికూర్చి చెప్పిరో, ఏవిధముగ బోధించిరో, ఆ విద్యాసారమును నేనెఱుంగ గోరుచుంటిని. నీవు నేర్చుకొన్న శాస్త్రములలోని ఒక పద్యము జెప్పి దాని

అర్థతాత్పర్యములు చెప్పుమయ్యా! అని యడిగిన తండ్రికి ప్రియనందను డిట్లు చెప్పెను.

క. చదివించిరి నను గురువులు
చదివితి ధర్మార్థముఖరశాస్త్రంబులు నేఁ
జదివినవి గలవు పెక్కులు
చదువులలో మర్మమెల్లఁ జదివితిఁ దండ్రీ! 428

తండ్రీ! గురువులు నాచే చక్కగా చదివించిరి. నేను ధర్మశాస్త్రము, అర్థశాస్త్రము, మొదలైన ముఖ్యశాస్త్రములను చదివితిని. నేను చదివినవి యనేకములున్నవి. చదువులలో సారమంతా చదివితిని తండ్రీ! అదేమనగా-

మ. తనుహృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా
ర్చనముల్ సేవయు నాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్ చింతనం
బనునీతొమ్మిదిభక్తిమార్గముల సర్వాత్మున్ హరిన్ నమ్మి స
జ్జనుఁడై యుండుట భద్రమంచుఁ దలఁతున్ సత్యంబు దైత్యోత్తమా!

దైత్యోత్తమా! శరీర హృదయ వాక్కుల యేకత్వము (త్రికరణశుద్ధి), భగవత్కథా శ్రవణము, భగవంతునియందు దాసభావము, భగవంతునికి పూజార్చనా వందనసంకీర్తనము లాచరించుట, భగవంతుని పరిచర్య (సేవ) చేయుట, ఆత్మలో నెఱుక (భగవంతుడే సర్వస్వమని సతతము గుర్తుంచు కొనుట) ఆత్మనివేదనము (ఆత్మార్పణము), చింతనము, అను నీ తొమ్మిది భక్తిమార్గములచే ఆ సర్వాత్ముడైన హరిని నమ్మి సజ్జనుడై యుండుటయే సత్యముగా శ్రేయస్కరమని భావింతును తండ్రీ! మఱియును, శ్రీహరియందు భక్తిలేనివారి బ్రతుకులెట్టివియన - అంధునకు పూర్ణచంద్రోదయము, చెవిటివానికి శంఖారావము, మూగవానికి సద్గ్రంథపఠనము నేర్పజూచుట, నపుంసకునికి భార్యాకాంక్షను కలిగింపజూచుట, కృతఘ్నులతో బంధుత్వము నెఱపుట, బూడిదలో నెయ్యి వేయుట, పరమలోభికి ద్రవ్యము లభించుట, పందిని సుగంధములను వాసన చూడమనుట వంటి వ్యర్థపు, నిరర్థకపు శూన్యపుబ్రతుకులే కదా!

సీ. కమలాక్షు నర్చించుకరములు కరములు శ్రీనాథు వర్ణించుజిహ్వజిహ్వ
సురరక్షకునిఁ జూచుచూడ్కులు చూడ్కులు శేషశాయికి మ్రొక్కుశిరము శిరము
విష్ణు నాకర్ణించువీనులు వీనులు మధువైరిఁ దవిలినమనము మనము
భగవంతు వలగొనుపదములు పదములు పురుషోత్తమునిమీఁదిబుద్ధి బుద్ధి

తే. దేవదేవునిఁ జింతించుదినము దినము
చక్రహస్తుని బ్రకటించుచదువు చదువు
కుంభినీధవుఁ జెప్పెడిగురుఁడు గురుఁడు
దండ్రి! హరిఁజేరుమనియెడితండ్రి తండ్రి. 431

ఇంకనూ, తండ్రీ! శ్రీహరిని పూజించే చేతులే చేతులు, శ్రీనాథుని వర్ణించే నాలుకే నాలుక, శ్రీపతిని జూచే చూపులే చూపులు, శేషశాయికి మ్రొక్కే శిరస్సే శిరస్సు, విష్ణుకథలను వినే చెవులే చెవులు; మధుసూదనుని తలంచే మనస్సే మనస్సు. భగవంతుని ప్రదక్షిణలు చేసే పాదములే పాదములు, పురుషోత్తముని యందు నిలిచే బుద్ధియే బుద్ధి; దేవదేవుని గురించి ఆలోచించే దినమే దినము, చక్రధారిని గురించి తెలియజేసే చదువే చదువు, గోవిందుని గురించి బోధించే గురువే గురువు; శ్రీహరినే చేరవలెనని చెప్పే తండ్రియే తండ్రి సుమా, దానవేంద్రా! ఏలనన, ప్రభూ!

సీ. కంజాక్షునకుఁ గానికాయంబు కాయమే? పవనగుంభితచర్మభస్త్రి గాక
వైకుంఠుఁ బొగడనివక్త్రంబు వక్త్రమే? ఢమఢమధ్వనితోడిఢక్క గాక
హరిపూజనము లేనిహస్తంబుహస్తమే? తరుశాఖనిర్మితదర్వి గాక
కమలేశుఁ జూడనికన్నులు కన్నులే? తనుకుడ్యజాలరంధ్రములు గాక

ఆ. చక్రిచింతలేని జన్మంబు జన్మమే?
తరళసలిలబుద్బుదంబు గాక
విష్ణుభక్తిలేని విబుధుండు విబుధుఁడే?
పాదయుగముతోడిపశువు గాక. 432

శ్రీహరికి అంకితము కాని శరీరము కేవలము గాలితో నిండిన కొలిమితిత్తిగాని, శరీరమవుతుందా! వైకుంఠుని స్తుతింపని నోరు, కేవలము

డమడమ ధ్వనిచేసే ఢక్కగాని, నోరు అవుతుందా? హరిపూజ చెయ్యని చెయ్యి కేవలము కర్రతో చేయబడిన తెడ్డుగాని చెయ్యి అవుతుందా? కమలేశుని జూడని కన్నులు కేవలము శరీరమనే గోడలో నున్న రంధ్రములేగాని కన్నులవుతాయా? చక్రధారిని గురించి యాలోచింపని జన్మ కదులుచున్న నీటిలోని బుడగగాని జన్మ అవుతుందా? విష్ణుభక్తిలేని పండితుడు కేవలము రెండు కాళ్లున్న పశువేగాని పండితుడగునా! ఇంకా చెప్పాలంటే -

సీ. సంసారజీమూతసంఘంబు విచ్చునే చక్రి దాస్యప్రభంజనము లేక
తాపత్రయాభీలదావాగ్ని లాఱునే విష్ణుసేవామృతవృష్టి లేక
సర్వంకషాఘౌఘజల రాసు లింకునే హరిమనీషాబడబాగ్ని లేక
ఘనవిపద్గాఢాంధ కారంబు లడఁగునే పద్మాక్షనుతిరవి ప్రభలు లేక

తే. నిరుపమానపునరావృత్తినిష్కళంక
ముక్తినిధిఁ గానవచ్చునే ముఖ్యమైన
శార్ఙ్గికోదండచింతనాంజనము లేక
తామరసగర్భునకునైన దానవేంద్ర

సంసారమనే కారుమేఘ సమూహములు చక్రధరుని సేవలనే పెనుగాలులు వీచకుండా తొలగిపోవునా? తాపత్రయములనబడే దావాగ్నులు విష్ణుసేవామృత వర్షధారలు కురియకుండా చల్లారునా? అంతటా నిండియున్న పాపపు జలరాసులు హరిచింతనయనే బడబాగ్ని లేనిదే యింకిపోవునా? ఘోరవిపత్తులనే గాఢాంధకారములు కేశవుని కీర్తనలనబడే సూర్యకిరణములు లేనిదే మాయమగునా? నిరుపమానమైన పునర్జన్మలేని నిష్కళంకమైన ముక్తినిధిని కనుగొనుటకు విష్ణుచింతనమనే అంజనము లేనిదే ఆ బ్రహ్మ దేవునకైనా శక్యమగునా? ఆ శ్రీహరి యందు నిర్మల నిరుపమాన భక్తిలేనిదే యీ సంసారబంధము వీడదు, మోక్షము సిద్ధింపదు, దానవేంద్రా!

ఈవిధముగా బిడియము, భయములేకుండ బాలుడిచ్చిన భాషణము దానవేంద్రుని చెవులకు ములుకులవలె బాధింపగా నతడు గురువువంక క్రోధముతో జూచుచు నిట్లనెను :

"ఓయీ గురుపుత్రా! నీ వీ బాలుని సకల నీతిశాస్త్ర పారంగతునిగా చేసెదనని గొనిపోయి, వానికి నేర్వరాని శత్రుశాస్త్రములను కుటిలబుద్ధితో నేర్పితివి. నీవు ప్రసిద్ధమైన భృగువంశజుడవని నిన్ను నమ్మితిని. కటకటా! నీవు బ్రాహ్మణాకృతిలో నుంటివిగాని, నిజముగ బ్రాహ్మణుడవేనా?

ఓ బ్రాహ్మణుడా! అధర్మవర్తనులును, దుష్టబుద్ధులును అయిన వారి పాపములు కల్మష కర్మ్ములు పొందునట్టి గుప్తరోగములకు పాల్పడజేయును సుమా!" అనిన రాజునకు పురోహితుడు (గురువు) ఇట్లనెను:

"ఓ దానవనాథా! మా వలన తప్పేమియును లేదు. మేమెన్నడును ఈ బాలునకు విరోధిశాస్త్రములు చెప్పలేదు. పరులెవ్వరూ చెప్పరు. నీ పాదములయాన! మీ బాలునకు ఈ భావములు సహజముగ వచ్చుచున్న వేమో! దీనికి ప్రతిక్రియను మీరే నేర్పుతో ఆలోచించవలెను. మేము పురోహితులము. అందరి మేలు కోరువారము. మీ కృపకు పాత్రులము, మీదు మిక్కిలి భార్గవవంశజులము. నీ పుత్రునీవిధముగ చెరచుటకు మేము నీ శత్రువులమా? దైత్యనాథా ఆలోచింపుము" అని గురువు పలుకగా, రాజు, వారిపై కోపము మాని, కుమారునితో నిట్లనెను:

"బాలకా! గురువులు నేర్పని యీ బుద్ధి నీకు మఱి యెవ్వరు చెప్పిరో పేర్కొనుమయ్యా!" అనిన తండ్రికి ప్రహ్లాదు డిట్లనెను.

ఉ. అచ్చపుఁజీఁకటిం బడి గృహవ్రతులై విషయప్రవిష్టులై
చచ్చుచుఁ బుట్టుచున్ మరలఁ జర్వితచర్వణులైనవారికిం
జెచ్చెరఁ బుట్టునే పరులు సెప్పిననైన నిజేచ్ఛనైన నే
మిచ్చిననైనఁ గానలకు నేఁగిననైన హరిప్రబోధముల్

గాఢాంధకారములో పడి గృహవ్యవహారములలో చిక్కుకొని, విషయ భోగములలో మునిగినవారై చచ్చుచు, పుట్టుచు, మఱల మఱల చచ్చుచు, పుట్టుచుండువారికి, స్వతహాగా గాని, ఇతరు లెవరైన చెప్పినగాని, యేమిచ్చినగాని, సన్న్యసించి యడవులకు పోయినగాని, అంత సులువుగా శ్రీహరిని గురించి బోధలు విని తెలుసుకొనుట బుద్ధిపుట్టునా?

ఉ. కాననివాని నూఁతగొని కాననివాఁడు విశిష్టవస్తువుల్
గాననిభంగిఁ గర్మములు గైకొని కొందఱు కర్మబద్ధులై
కానరు విష్ణుఁ గొంద ఱటఁ గందు రకించనవైష్ణవాంఘ్రిసం
స్థానరజో భిషిక్తులగు సంహృతకర్ములు దానవేశ్వరా

దానవేశ్వరా! ఒక అంధుడు వేఱొక యంధుని ఊతతీసుకొని యేమియును గాంచలేనట్లు, కర్మలను చేపట్టి, కర్మలయందే మునిగియుండువారు కర్మబద్ధులై విష్ణువును గాంచలేరు. కాని, కర్మలను నశింపజేసుకొను కొందరు మాత్రమే విష్ణుపాదరజమును పొందినవారై విష్ణువును పొందగలరు. (అనగా, కర్మమార్గము కంటె భక్తిమార్గము ద్వారానే భగవంతుని పొందనగును అని భావము).

శా. శోధింపంబడె సర్వశాస్త్రములు రక్షోనాథ వే యేటికిన్
గాథల్ మాధవ శేముషీతరణిసాంగత్యంబునంగాక దు
ర్మేధన్ దాఁటఁగ వచ్చునే సుతవధూమీనో గ్రవాంఛామద
క్రోధోల్లోల విశాల సంసృతి మహాఘోరామితాంభోనిధిన్

రక్షోనాథా! అనేకమైన శాస్త్రములు, మాధవు చరిత్రలు, బుద్ధిమంతులచే శోధింపబడినవి. సంసారసాగరమును దాటుట సజ్జన సాంగత్యమువలననే సాధ్యమగునుగాని, దుర్మేధ (విపరీత, వక్ర బుద్ధి)చే సాధ్యమగునా? భార్యాపుత్రాదులయందు తీవ్ర మమకార, వాంఛలు, మదము, క్రోధము మొదలైన అలలతోకూడి యున్న ఈ విశాలమైన ఘోర సంసారసాగరము దాటనగునా తండ్రీ!

అని పలికిన పుత్రుని ధిక్కరించి, తన తొడలపై నుండి క్రిందికి త్రోసివేసి, కన్నులలో రోషజ్వాలలు చెలరేగగ రాజు తన మంత్రులతో నిట్లనెను:

"పినతండ్రిని చంపినవాడని ఆ హరిపై కొంచెమైనను మనస్సులో క్రోధము వహించకుండా, వీడు ఎట్టి సంకోచము లేకుండ నా శత్రువుకు బంటు వలె, భక్తుడై, నిర్భయుడై ఊపిరి పీల్చుచు బ్రతుకుచున్నాడు. నాతో వైరము బూనియున్న యీ పితృద్రోహిని చూడుడు. ఐదేండ్ల వాడైన వీడు, తండ్రినైన నన్ను నిందించి, కొంచెమైనను భయములేక నా శత్రువైన విష్ణుని

కీర్తించుచున్నాడు. వలదని యెంత చెప్పినను మానడు. పుత్రరూపమున, వీడు శరీరములో నొక తీవ్రమైన వ్యాధివలె, మాకు జన్మించెను. రాక్షసవీరులారా, మీరు మీ శక్తినంతయు జూపి, వీనిని వధించి రండు. శరీరాంగములలో నేదో యొక అంగము రోగముతో చెడిపోయినట్లైన, చికిత్సకుడు దానిని ఖండించి, ఇతర అంగములను కాపాడునట్లు, ఈ కులద్రోహిని, మూర్ఖుని, దుష్టసాంగత్యుని, అధముని, కేశవపక్షపాతిని జంపించి, కులమును దోషరహితముగజేసి గొప్పవీరుడనను ఖ్యాతిని బొందెదను. రాక్షసవీరులారా! వీడు నిశ్చయముగ జంపదగినవాడు, పునరాలోచించుటకుగాని, రక్షింపబడుటకుగాని తగనివాడు, యమ సదనమునకు నిక్కముగ చేరవలసినవాడు, పసిబాలుడని జాలిచెందక వీనిని వధించి రండు" అని దానవేంద్రు డాజ్ఞాపించగా, వాడి కోరలుగల పెక్కుమంది రాక్షసులు శూలముపట్టుకొని, నాలుకలు నోళ్ల చాచి, ఉత్సాహముతో కేకలువేస్తూ, పొగతో కూడిన యగ్ని జ్వాలలవలె కనిపించు కేశములు మెఱయ, కోలాహలము చేయుచు, ఆ పసిబాలునిపై బడిరి. అయ్యో! పాపము, సుకుమారుడైన రాజకుమారుడు, దయాశీలుడు, సాధుసత్తముడు, లోకులందరు మెచ్చుకొను సద్గుణములు గలవాడు, చంపదగనివాడీ బాలుడు అని యేమాత్రమూ సంకోచము లేకుండ ఆ రాకాసి మూకలు శూలముతో నతని యంగములను చితుకగొట్టిరి. అయినను, రాజు చాలునని, వారిని వారించలేదు. పలువురు రాక్షసులు శూలములతో పొడిచినను, బాలుని దేహము లేశమాత్రమైనను నలగలేదు. లోపల రక్తము గూడుకట్టదు, కండరములుబ్బవు, చర్మము కందదు, ఎముకలు నలిగి చూర్ణమవలేదు, అతని ఆకారము వికారము కాలేదు, ముఖచంద్రము మెఱుగు తగ్గలేదు, అలసట జెందలేదు, దీనభావము నొందలేదు.

ఉ. తన్ను నిశాచరుల్ పొడువ దైత్యకుమారుఁడు మాటిమాటి కో
పన్న గశాయి యో దనుజభంజన యో జగదీశ యో మహో
పన్న శరణ్య యో నిఖిలపావన యంచు నుతించుఁగాని తాఁ
గన్నుల నీరు దేఁడు భయకంప సమేతుఁడు గాఁడు భూవరా

(నారదుడు యుధిష్ఠిరునితో) ఓ ధర్మనందనా! ఆ ప్రహ్లాద కుమారుడు, తనను ఆ రాక్షసులు రెచ్చిపోయి పొడుచుచు చిత్రహింసలు చేస్తుంటే, మాటిమాటికి "ఓ పన్నగశాయీ, ఓ దనుజ భంజనా, ఓ జగదీశా, ఓ దీనశరణ్యా, ఓ పరమపావనా!" యని యా భగవంతుని స్తుతించేవాడేగాని, కన్నులనీరు తెచ్చుకోడు, భయకంపితుడు కాడు, ఇంకా

ఉ. పాఱఁడు లేచి దిక్కులకు బాహువు లొడ్డఁడు బంధు రాజిలోఁ
దూఱఁడు ఘోరకృత్యమని దూఱఁడు తండ్రిని మిత్రవర్గముం
జీరఁడు మాతృసంఘము వసించు సువర్ణ గృహంబులోనికిం
దాఱఁడు కావరే యనఁడు తాపము నొందఁడు కంటగింపఁడున్.

రాక్షసులు పొడుచుచుండగా లేచి యిటునటు దిక్కులకు పాఱిపోడు. చేతులతోనైన అడ్డుకొనడు, ఇది చాలా ఘోరకృత్యము సుమా యని తండ్రిని దూషింపడు. మిత్రులను పిలువడు, తల్లి, యితర స్త్రీజనులు నివసించే సువర్ణ యంతఃపురములోనికి పోయి తలదాచుకొనడు, నన్ను కాపాడరా యని కోరడు, పరితాపము, కోపము చెందడు, యెవ్వరిపైననూ మనస్సు కష్టపెట్టుకొనడు, యెవ్వరినీ ద్వేషింపడు.

ఈ విధముగా, సర్వాత్మకుడును, యిట్టిదట్టిదని నిర్దేశింప నలవిగాని బ్రహ్మంబును తానేయైన యా మహావిష్ణువునందు చిత్తమును చేర్చి తన్మయుడై పరమానందమును పొందియున్న ప్రహ్లాదుని యందు రాక్షస ప్రభువు చేయించుచున్న మారణ కర్మలన్నియు నెట్టి హానియు చేయలేకుండుట కేమి హేతువో యని విస్మితుడై ఆతడు యిట్లు తలపోసెను.

రాక్షసభటులు శూలములతో నిస్సంకోచముగ, కర్కశముగ దేహమును పొడుచుచుండగా బాలుడు నేలపై బడడు, పాఱిపోడు, చావడు, తండ్రినైన నా వద్దకు వచ్చి, హరిభక్తిని మానితిని అనుచు నా పాదములపై తన ఫాలము నాన్చి మ్రొక్కడు, మరి యిట్లు సురక్షితముగ నుండుట కేమి హేతువో! అని యోచించినవాడై, హిరణ్యకశిపుడు, మిక్కిలి యాగ్రహముతో నొకసారి దిగ్గజముల గుంపును బాలుని త్రొక్కించుటకు పంపించును. ఒక్కొక్కసారి భయంకరమైన విషసర్పములచే నాతనిని కఱిపింప బంపించును. వేఱొకమారు

ఘోరమైన యగ్నిజ్వాలలలో పడవేయించును. ఇంకొకసారి, బాగుగ మొత్తించి సముద్రములో పడవేయించును, విషము పెట్టించును. పెద్ద పర్వతములనుండి త్రోయించును, బాగుగా చీల్చివేయుడని ఆజ్ఞాపించును, బంధించి బాధించుడని భటులకు ఆజ్ఞాపించును. ఒకప్పుడు అభిచార హోమము (చంపించు నుద్దేశముతో చేయు హోమము) చేయించును. ఇంకొకప్పుడు మండుటెండల లోను, మంచుపైనను నిల్చుండబెట్టును, పెనుగాలులలోనికి త్రోయించును. ఒక్కొక్కప్పు డు నవరంధ్రములను మూయించి హింసించును. మాయాప్రయో గములు చేసి భయపెట్టును. ఒక్కొక్కసారి భూమిలో పాతిపెట్టించును. కొన్నిసార్లు అన్నము, నీరుపెట్టకుండ నలమటింపజేయును. గదలచే మొత్తించును, బండరాళ్లను అతనిపైకి ఱువ్వింపచేయును, బాణములచే కొట్టించును, ఇంకెన్నెన్ని విధములుగనో ఆ చిన్నారి బాలుని చిత్రహింసలకు పాల్పడజేసెడివా డా రాక్షసరాజు. ఏమి చేసినా, ఎన్ని చేసినా, యా బాలుని రూపుమాపుటకు సాధ్యపడక, చింతాక్రాంతుడై యా రాక్షసేంద్రుడు తన మనంబున నిట్లు తలపోసెను.

ఉ. ముంచితి వార్ధులన్ గదల మొ త్తితి శైలతటంబులందు ద్రో
బ్బించితి శస్త్రరాజిఁ బొడిపించితి మీఁద నిభేంద్రపం క్తి ఁదొ
ప్పించితి ధిక్కరించితి శపించితి ఘోరదవాగ్నులందుఁ ద్రో
యించితిఁ బెక్కు పాట్ల నలయించితిఁ జావఁ డి దేమి చిత్రమో.

ఈ డింభకుని సముద్రములలో ముంపించితిని, గదలచే మొత్తింపించితిని, కొండ శిఖరములనుండి త్రోయించితిని, గొప్పగొప్ప శస్త్రములచే పొడిపించితిని, యేనుగుల బారును మీదనెక్కించి త్రొక్కించితిని, చంపెదనని ధిక్కరించితిని, శపించితిని, ఘోరమైన దావాగ్నులయందు పడవేయించితిని, యింకా ననేకమైన చిత్రహింసలు చేయించి బాధలు పెట్టించితిని. ఐనను వీడు చావడు. ఇదేమి చిత్రమో మరి!

చ. ఎఱుఁగడు జీవనౌషధము లెవ్వరు భర్తలు లేరు బాధలన్
దరలఁడు నైజతేజమునఁ దథ్యము జాడ్యము లేదు మిక్కిలిన్

మెఱయుచునున్న వాఁ డొక నిమేషము దైన్యము నొందఁ డింకనే
తెఱఁగునఁ ద్రుంతు వేసరితి దివ్యము వీని ప్రభావమెట్టిదో! 442

అయితే, వీడెటువంటి సంజీవనౌషధము లెఱుంగడు కదా! మఱి, వీనిని రక్షించి, ఆదుకొనే ప్రభువులు కూడ నెవ్వరులేరే. ఎన్నిబాధలు పెట్టినా చలింపడు, జంకడు. తనయొక్క శరీర తేజస్సు నిజముగా ఏమాత్రమును తగ్గలేదు సరికదా! ఇంకను మిక్కిలి ప్రకాశించుచున్నది. ఇన్ని బాధలు పడుచున్నను నొక్క నిముషమైన దైన్యత జెందడు. ఇక నేనేవిధముగ వీని నంతము చేయగలను? నేనలసిపోయితిని. నిజముగ వీనిలో నేదో యొక దివ్యప్రభావమున్నదేమో! నేను కోపముతో చేసిన దండనముల నెన్నడును పరులతో దండనములని చెప్పడు. వాటిని అనుగ్రహములుగ తలచును, మనస్సులోనైన కష్టపెట్టుకొనడు. అందుచేత నతడు మహాతపః సంపన్నుడు. వీనికి ఎచ్చటను భయములేదు. వీనితో విరోధము మంచిదికాదు. నాకు మృత్యువు సిద్ధించును. అని దిగులుపడి వ్యాకులుడైన రాజుతో చండామార్కులు (గురువులు) ఇట్లనిరి:

ఓ దైత్యేంద్రా! నీ ఖ్యాతి మచ్చలేనిది, నీ శోభ అత్యద్భుతమైనట్టిది. యుద్ధములందు కోపముతో నీ యొక్క భృకుటి కదలికలచేతనే దిక్పాలకు లందరినీ భయభ్రాంతులుగ చేసి విశ్వమును ఏలిన ప్రభువువు నీవు. ఈ బాలుడే పాటివాడు! గుణదోషములతో కూడియున్న వీని పొల్లుమాటలకు నీవింతగా చింతించవలెనా! వక్రమార్గము పట్టిన వ్యక్తి వృద్ధుల, గురువుల, సేవచేసి, వయస్సుతోపాటు వచ్చిన అనుభవ జ్ఞానముచే ప్రకాశించును. కావున రాజా! నీ కోపమును మాని, ఈ బాలునికి ఇంద్రద్వేషమును తలకెక్కించినచో శుక్రాచార్యుడు తిరిగివచ్చుసరి కీతడు సుశీలుడగును. అని గురు పుత్రులు చెప్పగా సరేనని, బాలుని కొనిపోయి, గృహస్థులైన రాజులకు నుపదేశింప దగిన ధర్మార్థ కామములను బోధింపుడని రాజు ఆదేశించెను. గురువులు ప్రహ్లాదునకు ధర్మార్థ కామముల గురించి యుపదేశింపగా నా బాలుడు, రాగద్వేషములతో కూడియున్న విషయాసక్తులకు, వ్యవహారములు నడుపుటకు ఆ శాస్త్రము లవసరమేమోగాని ఆత్మయందెట్టి భేదభావమును చూడని తనకు, అవి

అవసరము లేదనియు, అర్థము లేని విషయములయందు అర్థము కల్పించుటవలన భ్రమలు కలుగునని తలంచినవాడై వాటిని గ్రహింపక, గురువులు తమ గృహకర్తవ్యములలో మగ్నులై యున్న తరుణమున ఆటలకు పోదము రమ్మని రాక్షసబాలురు పిలిచినప్పుడు, వారితో గూడి వారికి జ్ఞానబోధ చేయుటకై యా రాజకుమారు డిట్లనియె:

ఉ. బాలకులార రండు మన ప్రాయపు బాలురు గొందఱుర్విపైఁ
గూలుట గంటిరే గురుఁడు క్రూరుఁ డనర్థచయంబునందు దు
శ్శీలత నర్థకల్పనముఁ జేసెడి గ్రాహ్యము గాదు శాస్త్ర మే
మే లెఱిఁగించెదన్ వినిన మీకు నిరంతరభద్ర మయ్యెడిన్

బాలకులారా! రండు, వినుడు. మన ప్రాయపుబాలురు కొందరు నేలగూలి చనిపోవుట మనము చూచుచుంటిమి కదా! దాని అర్థమేమిటో మనకు మన గురువు చెప్పకుండా, అర్థములేని పనికిమాలిన విషయాలకు ఏవేవో యర్థములను కల్పించి చెప్పుచుండును. అతడు చెప్పు శాస్త్రములు మనము నేర్చుకోనవసరము లేనట్టివి. మనకు మేలు కలిగించు విషయముల గురించి నేను చెప్పెదను. వాటిని విన్నచో మీకు సర్వదా క్షేమము కలుగును.

వినుడు : సృష్టిలోని అన్ని జన్మలలోను, ధర్మార్థాచరణ యోగ్యమైన మానవజన్మ అతి దుర్లభము. అందు, పురుషజన్మ ఇంకను దుర్లభము. అది, వంద సంవత్సరముల పరిమితితో లభించును. దానిలో సగభాగము రాత్రియందు నిద్రాది వ్యవహారములలో నిరర్థకమై గడిచిపోవును. మిగిలిన ఏబది వర్షములలో నిరువది వర్షములు బాల్యకిశోరాది లీలలలో గడిచిపోవును. మిగిలిన ముప్పది వత్సరము లెట్లు గడుచుననగా - ఇంద్రియములచేత పట్టువడి, కామక్రోధ లోభ మోహ మద మత్సరములను పాశములచే కట్టబడి, విడివడుటకు శక్తిలేక, తృష్ణకు లోనై, సేవక, వాణిజ్య, చౌర్య కర్మలలో ప్రాణహానినైనా లెక్కచేయక, వస్తుసంచయము చేసుకొనుచు, సంభోగ, సౌందర్య, చాతుర్య నిధులైన భార్యలను, మంజుల మధురాలాపములు చేయు బిడ్డలను, రూపలావణ్యలగు పుత్రికలను, వివేక విద్యావంతులైన పుత్రులను, భ్రాతలను, ప్రేమ మమతలను జూపు తలిదండ్రులను, బంధువులను, ధనకనక

వస్తువాహన, గృహాది సంపదలను, సేవకులు, పశువులు, పాడిపంటలును, వంశపారంపర్యముగా వచ్చు ఆస్తులను, విడువలేక, సంసారమునుండి బయటపడునుపాయము గానక, గృహస్థుడు స్వయంకృత కర్మబద్ధుడై, కుటుంబపోషణ వ్యామోహములో పడి, విరక్తిమార్గము తెలియజాలక, తన, పర, యను భేదభావమును పెంపొందించుకొని యంధకూపమున ప్రవేశించి బయట పడలేకుండును, కావున, కౌమారదశలోనే సజ్జనశ్రేష్ఠుడై పరమభాగవతధర్మముల ననుసరింపవలెను. దుఃఖములు, కోరకున్నను వచ్చిచేరునట్లు, సుఖములును కాలానుసారముగ లభించును. కావున వృధాగా కోరికలను తీర్చుకొనుటకు ప్రయాసపడి, ఆయువును వ్యర్థము చేసుకొనరాదు. హరిభజన వలన మోక్షము సిద్ధించును. విష్ణువు సర్వభూతాంతరాత్ముడు. ప్రియుడు, ముముక్షువైన మానవునకు దేహావసాన పర్యంతము, నారాయణ చరణారవింద సేవనమే కర్తవ్యము.

మిత్రులారా! చూచితిరా! ఘనులైన మనవారు, గృహస్థులై, విఫలురై పొందిన వెఱ్ఱితనము? భద్రతను పొందగోరినను, దానిని పొందలేరు. సంసారపు చిక్కులో నిరుకుకొని, రక్త రజస్సులతో నున్న యోనులలో పడి, గర్భాది యవస్థలలో దేహమును ధరించి, పుట్టుచుందురు. తన్ను తానెఱుంగరు. కర్మతంత్రులై వందలాది జన్మలు ఎత్తినా ఈ సంసారపు అంతమును జేరలేరు. దీని యందు శుభములేదు. దివ్యకీర్తియును లేదు. జగతిలో పుట్టి పుట్టి చచ్చి చచ్చి, కొట్టుకొననేల? మనకు చావు పుట్టుకలు లేని మార్గమును వెదకు కొనుటయే శ్రేయస్కరము.

మహావిద్వాంసుడైనను, మదగర్వాంధుడై కాంతయొక్క శృంగార చూడ్కులకు లేడిపిల్లనలె వశుడై హీనస్థితిని చెందును. విషయాసక్తులైన వారితో మనకు చెలిమి వద్దు. పిన్ననాటినుండి, సంగదోషములేని సజ్జనులతో గూడి, ముక్తి కాంక్షతో ఆదిదేవుడైన యా విష్ణువునే ఆశ్రయించుదము. విషయములలో చిక్కుకున్న రాక్షసులకు హరిభజన సేయుటకు సాధ్యపడదు. సర్వభూతాత్మకుడును, కాలాతీత, త్రిగుణాతీతుడును, సర్వవ్యాపి, సర్వాంతర్యామియునైన, భగవంతుడు, పరమాత్మ, కేవలము అనుభవైక

వేద్యుడు. ఆయనకు రూపముగాని గుణములుగాని ఉండవు. కాని, తన మాయాశక్తిచే అనేకరూపాలలో గోచరించును. అందుచేత మనము అసుర భావమును విడిచి, సర్వభూతములయందును, దయ, సుహృద్భావములను కలిగియుండుట మన కర్తవ్యము. శ్రీహరి సంతసించును. అప్పుడు మనకు లభించని దేదీయుండదు. మనము కోరకుండానే జ్ఞానముదయించును. స్వపర భేదములు నశించును. సర్వము స్వప్నతుల్యములుగను, మిథ్యగను తెలియును. ఈ తత్త్వజ్ఞానమును, మొదట, నారాయణుడు నరునకును, పిమ్మట నారదాది మునులకును బోధించెను. హరిభక్తుల పాదరజము యొక్క పవిత్ర మాహాత్మ్యమును, నారాయణ తత్త్వమును, ఏకాంతభక్తులు, సర్వసంగ పరిత్యాగులు, పరతత్త్వజ్ఞులు మాత్రమే ఎఱుంగగలరు. నేను దివ్యదృష్టిగల నారదమహాముని వలన, యీ జ్ఞానమును, భాగవత ధర్మమును వినియుంటిని అని చెప్పగా నా దైత్యబాలు రాశ్చర్యచకితులై యిట్లనిరి : మిత్రమా! మనమందరము కలిసి చిన్ననాటినుండియు భార్గవ పుత్రులవద్దనే యనేక శాస్త్రములను వింటిమి. మనకు వేఱొక గురువెవ్వడును లేకుండెను. ఈ రాజప్రాసాదములోనికి ప్రవేశించుటకుగాని, ప్రవేశించి బైటపడుటకుగాని త్రినేత్రునకైనను సాధ్యపడదు కదా! మఱి నీకు నిరాటంకముగ బోధించుట కెవరికి ఎట్లు సాధ్యపడెనో చెప్పుమా! మేము నిన్నే మా రాజుగా భావింతుము, నిన్నే సేవింతుము, గౌరవింతుము కదా! నీకీ జ్ఞానమెట్లబ్బెనో మాకు చెప్పుము, అని యా బాలురడుగగా, నారదబోధలను మననము చేసుకుంటూ ప్రహ్లాదుడు వారికిట్లు బోధించెను:

పూర్వము నా తండ్రి మందర పర్వతముపై ఉగ్రతపస్సు చేయుచుండగా దేవతలు యుద్ధభేరీ దుందుభాదులైన రణగౌణ ధ్వనులతో రాక్షసులపై దండెత్తి వెళ్లగా, వారి పటాటోపములచూచి రాక్షసులు భయపడి భార్యాబిడ్డలను విడిచి పాఱిపోయిరి. దేవతలు రాజవాసము చేరి క్రూరులై, సమస్తమును కొల్లగొట్టి ధనరత్నరాసులను దోచుకొనిరి. ఇంద్రుడు అంతఃపురములో దూరి ఎట్టి సంకోచమును లేక మా తల్లిని చెఱపట్ట నుద్యుక్తుడయ్యెను, ఆమె భయవిహ్వలయై విలపించుచున్నను ఆమెను యీడ్చుకొని పోవుచుండ

దైవయోగమున ఆమె ఆర్తనాదము నారదమునీంద్రునికి వినిపించగా ఆయన వచ్చి యింద్రునితో నిట్లనెను :

"ఓ స్వర్గాధినాథా! సురశ్రేష్ఠా! దేవతలలో పుణ్యమూర్తివి, నీతిమంతుడవు, ఈ మానవతి నేల గొనిపోవుచుంటివి? ఈమె గర్భిణి, మిక్కిలి ఆర్తిచే కంపించుచున్నది. నిర్మల మానసురాలు. రాక్షసరాజుపై నీకున్న దుర్భరవైరమును, కోపమును, నిలిపి యీమెను విడువుము" అనగా ఇంద్రుడు నారదునితో నిట్లనెను. "ఓ మహాత్మా! నారదా! ఈమె యొక్క గర్భమందు దేవతల పరమశత్రువు యొక్క బీజము వృద్ధిచెందుచున్నది. కావున నీమెను బందీచేసియుంచి యీమె ప్రసవించగనే బిడ్డడిని నా వజ్రాయుధమునకు బలిచేసి, నిశ్చింతుడనైన పిదప నీ దానవరాజపత్నిని విడిచిపెట్టెదను." అనిన నారదమహర్షి యిట్లనెను:

"దేవరాజా! ఈ దానవసాధ్వి గర్భమునందున్న బిడ్డడు ప్రశస్తమైన భాగవతుడు, ఎవ్వరికిని శత్రువుకాడు, ఎవ్వరికిని భయకారకుడు కాడు, జన్మజన్మాంతరాలలో శ్రీహరియొక్క శ్రేష్ఠమైన పాదభక్తుడు, ఈ బాలకుడు ఎట్టి ఉపాయములచే నైనను చంపబడడు సుమా!" అని చెప్పిన నారదవాక్యములను మన్నించి తానును హరిభక్తుడే గావున, ఇంద్రుడు, మా అమ్మను విడిచి, ప్రదక్షిణచేసి సురలోకమునకు బోయెను. నారదమునీంద్రుడు మా తల్లియందు పుత్రికా వాత్సల్యముతో నామె నూరడించి, తన యాశ్రమమునకు గొనిపోయి యిట్లనెను: తల్లీ! నీవు పతివ్రతవు. నీ గర్భమునందొక పరమభాగవతుడైన జీవుడున్నాడు. నీ భర్త తపోమహిమచే కృతార్థుడై యింటికి రాగలడు. అంతవరకు నీ విచ్చటనే యుండవచ్చును" అని చెప్పగా నామె సమ్మతించెను.

నారీ రత్నమైన మా తల్లి, మా తండ్రి రాకను నిరీక్షించుచు, ఎట్టిభయమును లేకుండ, ఎట్టిదోషము సోకకుండ మిక్కిలి సౌశీల్యముతో నారదమునీంద్రుని శుశ్రూషలు చేయుచు, గర్భరక్షణ చేసుకొనుచుండెను.

ఇట్లు తనకు పరిచర్యలు చేయుచున్న దానవరాజ పత్నికి నారదమహర్షి యభయమిచ్చి, గర్భమునందున్న నన్ను ఉద్దేశించి, ధర్మతత్త్వమును,

నిర్మలజ్ఞానమును యుపదేశించెను. నారదముని యనుగ్రహముచే, దైవయోగముచే, నేను జన్మించినప్పటినుండి, మునియొక్క ఉపదేశమంతయు, మఱుపులేకుండ నా మనస్సునందు ముద్రితమైయున్నది. మిత్రులారా! వినుడు. మీరు నా మాటలయందు విశ్వాసముంచినచో, స్త్రీలకైనను, బాలురకైనను, ఋషులచే చెప్పబడిన ఈ దేహేంద్రియ మనోబుద్ధ్యహంకారములను ఖండించు సాధన తెలియవచ్చును అని చెప్పి, నారదుడు బోధించిన తత్త్వజ్ఞానము నీవిధముగా దానవబాలురకు చెప్పెను:

దేహమునకే గాని, షడ్భావవికారము లాత్మకు లేవు. ఆత్మనిత్యుడు, క్షయములేనివాడు, శుద్ధుడు, క్షేత్రజ్ఞుడు, ఆకాశాది పంచభూతములకు ఆశ్రయుడు, క్రియాశూన్యుడు, స్వప్రకాశకుడు, సృష్టిహేతువు, సర్వవ్యాపకుడు, నిస్సంగుడు, పరిపూర్ణుడు, ఏకము అయినవాడు, ఈ పన్నెండు ఆత్మలక్షణముల నెఱుంగుచు, దేహాదులందు మోహమును కలిగించు అహంకార మమకారములను విడిచి, కార్యకారణముల నెఱింగెడి నేర్పరి బ్రహ్మభావమును పొందును. మూలప్రకృతి, మహదహంకారములు, పంచతన్మాత్రలు, ఇవి అష్టప్రకృతులు. సత్త్వరజస్తమములు ప్రకృతియొక్క త్రిగుణములనియు, వాక్పాణిపాద పాయూపస్థలను కర్మేంద్రియములనియు, శ్రవణ నయన రసన త్వక్ ఘ్రాణములు జ్ఞానేంద్రియములనియు, మనస్సు, మహీసలిలతేజఃగగనవాయువులు, స్థూలభూతములు. ఇవియన్నీ పదునాఱు వికారములనియు, కపిలాది పూర్వాచార్యులచే చెప్పబడినవి. ఈ యిరువది యేడు తత్త్వములతో సాక్షిగా ఆత్మయుండును.

గురుశుశ్రూష, సర్వసమర్పణము, సజ్జన సాధుసాంగత్యము, ఈశ్వర ప్రతిమార్చనము, హరికథాసక్తి, వాసుదేవునియందు ప్రేమ, నారాయణ గుణకర్మ నామకీర్తనము వైకుంఠ చరణకమల ధ్యానము, మొదలైన విజ్ఞాన వైరాగ్య సాధనములైన భాగవత ధర్మములపై రతి గలిగి, సర్వభూతములందు భగవంతుడు గలడని గౌరవించుచు, కామక్రోధాదులను జయించి, ఇంద్రియ వర్గమును బంధించి, భక్తి సేయుచుండ, విష్ణుదేవునియందు గతి సిద్ధించును. శ్రీహరియొక్క లీలావతార గాథలందలి శౌర్యకర్మలు, సద్గుణముల గురించి

విని భక్తుడైనవాడు, ఆనందముతో పులకించును, కన్నులనుండి ఆనంద బాష్పములు రాలుచుండ, కమలాక్ష వైకుంఠ, వరద, నారాయణ, వాసుదేవ, యనుచు గొంతెత్తి పాడును, ఆడును, ఏడ్చును, నవ్వును, చింతనము చేయును, మోహము చెందును, తనలో తాను మాట్లాడుకొనును, దేవత పూనిన వానివలె తిరుగును, బంధములు పోగొట్టుకొని, అజ్ఞాన సముదాయమును తొలగించు కొని చివరకు భక్తివివశుడై విష్ణువును పొందును. కావున రాగద్వేషములతో కూడియున్న మనస్సుగల జీవునకు సంసార చక్రనివర్తకమైన హరిచింతనయే, బ్రహ్మనిర్వాణ సుఖదాయకమని జ్ఞానులు తెలుసుకొందురు. హరిభజన కష్టసాధ్యముగాదు. హరి సకలప్రాణుల హృదయములయందును అంతర్యామియై ఆకాశమువలె వ్యాపించియుండును. విషయ సముపార్జనద్వారా ఇది సాధ్యపడదు, క్షణభంగుర ప్రాణులైన మానవులకు, మమకారమును కలిగించు అశాశ్వతములైన పుత్ర, మిత్ర, కళత్ర, బంధు, భృత్య, పశు, రాజ్య, కోశ, మణి, మందిర, మంత్రి, మాతంగ (ఏనుగులు) భూమి, మొదలైన వైభవములు నిరర్థకములు (ఎందుకూ పనికిరానివి). యాగములు, యోగముల నాచరించి పుణ్యమార్జించినచో ఆ పుణ్యము క్షీణించువరకు స్వర్గాది లోకములలో భోగములననుభవించవచ్చు. తదుపరి మళ్లీ జన్మలు కలుగును. మానవుడు శాస్త్రజ్ఞుడనని గర్వించి, కర్మలాచరించి, వాటి విపరీత ఫలమును పొందును. కర్మములు ఎట్టి కోరికలు లేకుండ చేయవలెను. కోరికలతో కర్మలు చేసిన దుఃఖములు ప్రాప్తించును. మానవుడు దేహము కొఱకు భోగముల నపేక్షించును. దేహము నిత్యము కాదు, మన తోడ రాదు, మృతుల దేహములను శునకాదులు భక్షించును. మనిషి కర్మలనాచరించి, కర్మబద్ధుడై, కర్మానుకూల దేహముల దాల్చును. అజ్ఞానముచే కర్మదేహములను విస్తరించును. ధర్మార్థకామములు అజ్ఞాన జనితములు. జ్ఞాన లభ్యమే మోక్షము. మోక్ష ప్రదాతయుగు శ్రీహరి సకలభూతములకు నాత్మేశ్వరుడు, ప్రియుడు. నిష్కాములై హృదయగతుడైన శ్రీహరిని నిజభక్తిచే భజింపవలెను.

మానవ దానవ దైత్య గంధర్వ భుజంగము, సుర సంఘములలో నెవ్వరైనను శ్రీహరి చరణ కమలముల ధ్యానముచే, ధన్యత నొందగలరు.

క. చిక్కఁడు వ్రతములఁ గ్రతువులఁ
జిక్కఁడు దానముల శౌచశీలతపములం
జిక్కఁడు యుక్తిని భక్తిని
జిక్కిన క్రియ నచ్యుతుండు సిద్ధము సుండీ

మిత్రులారా! శ్రీహరి వ్రతములద్వారా గాని, క్రతువులద్వారాగాని, దానములు, శౌచములు, సత్శీలములవలనగాని తపములద్వారా గాని, యుక్తి తర్కములచేగాని, భక్తిద్వారా చిక్కినంత సులభముగా చిక్కడు. (భగవంతుని భక్తిద్వారానే సులభముగ పొందవచ్చును). శ్రీహరిని మెప్పించుటకు భక్తి చాలినంతగా బ్రాహ్మణత్వ విద్యాప్రక్రియలుగాని, దేవతల దివ్యత్వముగాని, యోగుల ప్రశాంత సాధనలుగాని చాలవు (సరిపడవు) (భక్తియే సర్వశ్రేష్ఠ సాధనము) దనుజులుగాని, దైత్యులుగాని, యక్షులుగాని, మృగములుగాని, సర్పములుగాని, పక్షులుగాని, స్త్రీలు గాని, గొల్లలుగాని, శూద్రులుగాని, శబరులుగాని, ఏ పాపజీవులైనగాని, సకలలోకములలో నెవ్వరైనా గాని శ్రీహరిని తలచినచో ముక్తికి పోవుదురు.

మన గురువులెప్పుడును, తమ కనువైన పద్ధతులనే చెప్పెదరుగాని, శ్రీహరి దివ్యపదమును చేరు మార్గములను చెప్పరు. అజ్ఞానాంధకారములో సాంసారిక విషయజ్ఞాన భారమును మనపై గురువులు పెంచనేల? మిత్రులారా!

మీ పుస్తకములను తెండు, గురువుల కిచ్చివేద్దాం. నావద్దకు రండు, ఏకైక నాథుని గురించి చెప్పెదను. ఇష్టములేనివారు కర్మఫలముల ననుభవించుటకు పొండు. రండు, మనమూ శ్రీహరియందు భక్తిప్రేమలను పెంచుకొందము, విష్ణువుయొక్క కీర్తిగాథలను, రక్షక చరిత్రలను పాడుకొందము. అసురసాంగత్యమును వీడుదము. గోవిందుని భక్తకోటిలో నూటిగ చేరుదము.

ధనము సంసారబంధమును కలిగించుపనిముట్టు. కామక్రోధాది శత్రు వర్గమును పారద్రోలుదము. మనచిత్తములను శ్రీహరికి సమర్పించుదము నిర్వాణ పథము నందు ప్రవేశించెదము. ఇట్లు చేసినచో మనకు శుభమగును.

ఈవిధముగ ప్రహ్లాదుడు రహస్యముగ సమయము చిక్కినప్పుడెల్ల రాక్షస బాలురకు మోక్షమార్గము గుఱించి బోధింపగా, వారు, గురువులు నేర్పిన

చదువులను మానివేసి, నారాయణభక్తిని మనస్సులలో నింపుకొనుటను చూచి గురువు వారి భక్తిభావమును తెలుసుకొని, భయభ్రాంతుడైవచ్చి, రాక్షసరాజుతో నిట్లు చెప్పుకొనెను:

"ఓ దైత్యశ్రేష్ఠా! నీ కొడుకు రాక్షస బాలురందరిని చేరదీసి, నాకు తెలియకుండ, నేను చెప్పిన చదువులన్నీ అసత్యములని, ఎత్తిపొడిచి, వారందరినీ మోక్షాసక్తులుగ చేసినాడు. మనందరికీ తీరని నష్టము కలిగినది. దీనిని నీవే స్వయముగ చక్కబెట్టవలెను. ఆకర్షణీయమైన విష్ణుకథల నీ గురువు మాకెన్నడును చెప్పడు అని ఆ బాలురు నా మాట నుల్లంఘించి, నేను చెప్పెడి విషయములను చదువుటకు ఒప్పుకొనుటలేదు దానవోత్తమా!

ప్రహ్లాదుడు విష్ణుభాషణము మానడు. వేఱుగా కూర్చొని జడునివలె నుండును, వాడి జ్ఞానవికాసమును గురించి నేమేమి చెప్పినను పట్టించుకొనడు. ఈ కుఱ్రవానికి చదువు చెప్పుటకు మాకు సాధ్యపడుటలేదు దానవోత్తమా! చక్కని స్వచ్ఛమైన రాక్షసకుటుంబములో నీ వికారము పట్టినవాడు జన్మించినాడు. విష్ణువును నిజమైన ప్రేమతో కొలిచెడి ఈ వెఱ్ఱివాని నెట్లు గంటివి రాక్షసరాజా!" అని గురుపుత్రుడు చెప్పగ నిజపుత్రుని శత్రుప్రవర్తన వాక్కులు కర్ణములకు ఖడ్గఘాతములుగ సోకగా, తోకత్రొక్కబడిన త్రాచువలె, పెనుగాలిచే రగుల్కొను దావాగ్నివలె, కఱ్ఱతో కొట్టబడిన మదపుటేనుగువలె, భీషణమైన క్రోధావేశముతో జ్వలించుచిత్తము గలవాడై, కంపించుచున్న శరీరముతో, నిప్పులు గ్రక్కు కండ్లతో, తత్క్షణమే కొడుకును రప్పించి, మేఘగర్జన వంటి స్వరముతో - శాంతగుణ ప్రధానుడును, పరిశుద్ధజ్ఞానియును, అజ్ఞానానికి గొడ్డలి పెట్టువంటి వాడును, సదా శ్రీనారాయణ పాదపద్మముల యందు ధ్యానమగ్నుడును అయిన పుత్రుని ధిక్కరించి దేవశత్రువైన హిరణ్యాకశిపు డిట్లనెను.

"ఓరీ దుష్టుడా! నా యొక్క ఆజ్ఞలేనిదే సూర్యుడు ఆకాశమున ప్రకాశించుటకు భయపడును; అన్ని కాలములలోను వాయువు నాకు అనుకూలముగ తప్ప వేఱొక విధముగ వీచలేదు. నా యొక్క ప్రతాపాగ్ని యెదుట వెలవెలపోవునేగాని, అగ్ని తన ఇచ్ఛప్రకారము వెలుగలేడు. నా యొక్క

కఠినమైన యాజ్ఞల నుల్లంఘించి, యముడు ప్రాణులను చంపుటకు భయపడును. ఇంద్రుడు నా ఎదుట తలయెత్తుకొని నిల్చొనుటకు భయపడును. ఇక దేవతలు కిన్నరులు, గంధర్వులు, యక్షులు, పక్షులు, నాగులు, విద్యాధరులు అందరూ నేనంటే భయముతో బిగుసుకుంటారు. నీవేలరా భయపడవు? నీకేది దిక్కు?

ప్రజ్ఞావంతులైన లోకపాలురు, మూడులోకములవారు, నాయొక్క ఆజ్ఞనుల్లంఘించుటకు కంపించిపోవుదురు. మరి నీవుమాత్రము నా యాజ్ఞలనే సాహసముతో మీరుచుంటివిరా అహంకారీ! దుర్మతీ!

ఓరీ డింభకా! నీవు గొంతెత్తి మహాగాఢముగా కంఠశోషతో వైకుంఠుడు జయింప శక్యము కానివాడని పదరుచుంటివిగాని, నిజముగా వాడు వీరాగ్రేసరుడే అయితే, నేను దేవతలను దండించి ఖండించుచుండగా ముఖము చాటు చేసుకుంటాడేగాని, నేను చేసే యుద్ధములో వచ్చి ఎదుర్కొనడేమి?

శా. ఆచార్యోక్తముగాక బాలురకు మోక్షాసక్తిఁ బుట్టించి నీ
వాచాలత్వముఁ జూపి విష్ణు సహితున్ వర్ణించి మద్దైత్యవం
శాచారంబులు నీఱు సేసితివి మూఢాత్మ్మం గులద్రోహి నిన్
నీచుం జంపుట మేలు చంపి కులమున్ నిర్దోషముం జేసెదన్. **260**

నీవు అచార్యులు చెప్పినవి కాదని, నీవాచాలత్వమును ప్రదర్శించుచు, మన దైత్య సాంప్రదాయములకు విరుద్ధముగ, శత్రువైన విష్ణుని వర్ణించి, రాక్షస బాలురలో మోక్షాసక్తి కలిగించుచుంటివట. నీవు మూఢాత్ముడవు, కులద్రోహివి, నీచుడవు. నిన్ను చంపి కులమును దోషములేకుండ చేసెదను.

క. దిక్కులు గెలిచితి నన్నియు
దిక్కెవ్వఁడురోరి నీకు దేవేంద్రాదుల్
దిక్కుల రాజులు వేఱొక
దిక్కెఱుఁగక కొలుతు రితఁడె దిక్కని నన్నున్. 261

దిక్కులన్నిటినీ గెలిచిన వాడిని నేను. దేవేంద్రాదులు, దిక్పాలకులూ, అందరు వేరే దిక్కులేక నేనే దిక్కు అని నన్నే కొలుచుచుందురురా! మరి నీకెవడురా దిక్కు?

క. బలవంతుఁడ నే జగముల
బలములతోఁ జనక వీరభావమున మహా
బలుల జయించితి నెవ్వని
బలమున నాడెదవు నాకుఁ బ్రతివీరుఁడవై

ఈ మూడు జగములలో బలవంతుడను నేనే. ఎలాంటి సైనిక సహాయమును తోడు తీసుకొనిపోకుండా నేనొక్కడినే మహావీరుడనై గొప్ప గొప్ప బలవంతులను జయించితిని. నీవు ఎవ్వడి బలసహాయముతో నన్నెదిరించుచుంటివిరా మూర్ఖుడా! అనియడిగిన తండ్రికి శాంతముతో వినయముగ పుత్రుడిట్లనెను:

క. బలయుతులకు దుర్బలులకు
బల మెవ్వఁడు నీకు నాకు బ్రహ్మాదులకున్
బల మెవ్వఁడు ప్రాణులకును
బల మెవ్వం డట్టి విభుఁడు బల మసురేంద్రా

లోకములలోని బలవంతులకు, బలహీనులకు నెవ్వడు బలమో, నీకును, నాకును బ్రహ్మాదిదేవతలకును యెవ్వడు బలమో, సమస్త ప్రాణులకు నెవ్వడు బలమో ఆ యీశ్వరుడే నాకును బలము సుమా! దానవేంద్రా!

క. దిక్కులు కాలముతో నే
దిక్కున లేకుండుఁ గలుగు దిక్కుల మొదలై
దిక్కుగల లేనివారికి
దిక్కయ్యెడు వాఁడు నాకు దిక్కు మహాత్మా

ఓ మహాత్మా! దిక్కులు, కాలము లేనివాడు (దిక్కులకు, కాలమునకు అతీతుడు) ఏ ఒక్క దిక్కులోనో ఉండనివాడు (అంతటా నిండియున్నవాడు) దిక్కులకు (సర్వమునకు) మూలమైనవాడు, దిక్కుగలవారికి, దిక్కులేనివారికి దిక్కు (ఆశ్రయము) (ఎవ్వడో) ఏదియో, అదియె నాకు దిక్కు సుమా!

సర్వవ్యాపకుడైన ఆ ప్రభువు తన వినోదముకొఱకై అఖిల జగములను సృష్టించి, రక్షించి, లయింపజేయును. ఆ అవ్యయుడు (నాశములేనివాడు)

అన్ని రూపములందును గలడు. సమత్వములేని చిత్తమే మన శత్రువుగా ప్రవర్తించును. ఆ చిత్తమును వశముచేసుకొని నీ యహంభావముతో కూడిన అసురత్వమును వీడు మయ్యా. తండ్రీ! నీయాశ్రితజనులు నీకు శ్రేయస్కరమైన మాటలు నీకు చెప్పరయ్యా!

ఉ. లోకము లన్నియున్ గడియలోన జయించిన వాఁడ వింద్రియా
నీకముఁ జిత్తమున్ గెలువ నేరవు నిన్ను నిబద్ధుఁ జేయు నీ
భీకరశత్రు లార్వురఁ బ్రభిన్నులఁ జేసినఁ బ్రాణికోటిలో
నీకు విరోధి లేఁ డొకఁడు నేర్పునఁ జూడుము దానవేశ్వరా

దానవేశ్వరా! నీవన్నిలోకములను గడియలోనె జయించిన పరాక్రమశాలివి. అయినను, నీవు నీ యింద్రియములను, చిత్తమును (మనస్సును) జయింపలేకపోయితివి. నీలోనే యున్న నిన్ను దృఢముగ బంధించి యుంచిన ఆర్గురు భయంకరమైన శత్రువులుగలరు. (కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములనబడువారు). వారిని తొలగించినచో ప్రాణికోటిలో నీకొక్కడును విరోధియుండడు. వివేకముతో నీ విషయమును గ్రహింపుము తండ్రీ!

తండ్రీ! నీ బుద్ధికుశలతను సారింపుము. కర్మబంధములను తొలగింపుము. సమత్వముద్వారా సంసారబంధనమును చాలింపుము, హృదయమందు కేశవునియందు భక్తిని నెలకొల్పుము - అని పుత్రుడు చెప్పగా తండ్రి యిట్లనెను:

"ఓరీ కుమతీ! వదరుబోతా! చావునకు కూడ తెగించిన వానివలె వాగుచుంటివి. ఏ మాత్రమును భయములేకుండ, చంపిన చచ్చెదనులే యనునట్లు కఠినోక్తులచే నన్ను పొడుచుచుంటివి. నీకు చావుమూడినట్లున్నది.

శా. నాతోడం బ్రతిభాష లాడెదు జగన్నాథుండు నాకంటె నీ
భూతశ్రేణికి రాజు లేఁ డొకఁడు సంపూర్ణ ప్రభావుండు మ
ద్భ్రాతం జంపిన మున్ను నే వెదకితిం బల్మాఱు నారాయణుం
డేతద్విశ్వములోన లేఁడు మఱి వాఁ డెం దుండురా దుర్మతీ

ఓరీ దుర్మతీ! నాతో వ్యర్థప్రలాపనలతో వాదిస్తుంటివిగాని, నావంటి సంపూర్ణ శక్తి సంపన్నుడు, జగన్నాథుడు అయిన రాజు ఈ జీవకోటి కింకెవడున్నాడురా?

ఎవ్వడును లేడు. పూర్వము నా సోదరుని చంపిన ఆ హరిని రూపుమాపుటకు నేనీ విశ్వమంతటను పలుమారులు గాలించితిని. కాని వాడెచ్చటను గానరాలేదు. మఱి వాడెచ్చట నుండునురా చెప్పు. వాడెట్లు, ఏ స్థలమున సంచరించును? ఏమార్గమున వచ్చును? వాని సేవకునివలె మిక్కిలి ప్రేలుచుంటివి కదా, చెప్పు. వానిని, నిన్ను ముక్కలుముక్కలుగా ఖండించెదను.

అని రాక్షసరాజు గద్దించి గర్జించగా, నా హరిసేవకుడు ఏ మాత్రమును కోపగించుకొనక, హర్ష పులకాంకితుడై హృదయమందు శ్రీహరిని స్మరించి, నమస్కరించి, గంతులు వేయుచు నిట్లనెను:

మ. కలఁ డంభోధిఁ గలండు గాలిఁ గల డాకాశంబునం గుంభినిం
గలఁ డగ్నిన్ దిశలం బగళ్ల నిశలన్ ఖద్యోతచంద్రాత్మలం
గలఁ డోంకారమునం ద్రిమూర్తులఁ ద్రిలింగవ్యక్తులం దంతటం
గలఁ డీశుండు గలండు తండ్రి వెదకంగా నేల నీ యా యెడన్

తండ్రీ! ఆ పరమేశ్వరుడు సముద్రములోనున్నాడు. గాలియందున్నాడు, ఆకాశము నందున్నాడు. భూమి యందున్నాడు, అగ్ని యందున్నాడన్ని దిశలలోనున్నాడు, పగటియందున్నాడు, రాత్రియందున్నాడు, సూర్యచంద్రుల యందున్నాడు, ఆత్మయందును ఓంకారమునందును యున్నాడు, త్రిమూర్తుల యందున్నాడు, స్త్రీ పురుషలింగములలో నున్నాడు, అంతటనున్నాడు తండ్రీ! ఇక్కడ అక్కడయని వెదకనేల?

క. ఇందుఁ గలఁ డందు లేఁడని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన
నందందే గలడు దానవాగ్రణి! వింటే

తండ్రీ! ఇంకా చెప్పవలెనన్న, ఆ భగవంతు డిక్కడనుండు అక్కడ నుండడను సందేహముంచుకొనరాదు. విష్ణుమూర్తి అంతటనున్నాడు. ఎక్కడెక్కడ వెదకి చూచిన, అక్కడక్కడనే గానవచ్చునని తెలుసుకొనుడు. దానవశ్రేష్ఠా! అని, ఈ విధముగ:

మ. హరిసర్వాకృతులం గలం డనుచుఁ బ్రహ్లాదుండు భాషింప స
త్వరుడై యెందును లేఁడు లేఁడని సుతున్ దైత్యుండు తర్జింప శ్రీ
నరసింహాకృతి నుండె నచ్యుతుడు నానాజంగమస్థావరో
త్కర గర్భంబుల నన్నిదేశములనుద్దండ ప్రభావంబునన్

హరి, అన్నిరూపములలో (జీవరాసులలో) నుండునని ప్రహ్లాదుడు చెప్పుచుండగ, వెంటనే తండ్రి యెక్కడను లేడు లేడని గద్దించుచుండగ, విష్ణువు శ్రీనరసింహాకారమును దాల్చి, సమస్త చరాచర జీవవస్తుజాలములలో నన్ని ప్రదేశములలో భీకరతేజోమయుడై వ్యాపించి, ప్రత్యక్షమగుటకు సిద్ధముగ నుండెను.

అప్పుడు దానవేంద్రుడిట్లనెను:

క. డింభక సర్వస్థలముల
నంభోరుహనేత్రుఁడుండు ననుచు మిగుల సం
రంభంబునఁ బలికెద వీ
స్తంభంబునఁ జూపఁ గలవె చక్రిన్ గ్రిక్రిన్

క. స్తంభమునఁ జూపవేనిం
గుంభిని నీ శిరముఁద్రుంచి కూల్చఁగ రక్షా
రంభమున వచ్చి హరి వి
స్రంభంబున నడ్డపడఁగ శక్తుండగునే

ఓరీ డింభకా! ఆహరి, అన్ని స్థలములందు నుండునని ఎంతో సందడిగ చెప్పుకొనుచుంటివికదా! నీ చక్రిని, గ్రిక్రిని ఈ స్తంభములో చూపగలవేని చూపుము. నీవట్లు చూపలేనిచో నీ శిరమును ద్రుంచి నేలగూల్చెదను, అప్పుడా హరి నీయందు ప్రీతిచే నిన్నెట్లు రక్షింపగలుగునో చూచెదను. అప్పుడా పరమభక్త శ్రేష్ఠుడైన ప్రహ్లాదుడిట్లు బదులుచెప్పెను.

శా. అంభోజాసనుఁ డాదిగాఁగఁ దృణపర్యంతంబు విశ్వాత్ముఁడై
సంభావంబున నుండు ప్రోడ విపుల స్తంభంబునం దుండఁడే

స్తంభాంతర్గతుఁ డయ్యు నుండుటకు నే సందేహమున్ లేదు ని
ర్దంభత్వంబున నేఁడు గానఁబడుఁ బ్రత్యక్షస్వరూపంబునన్,

తండ్రీ! పద్మాసనుడైన బ్రహ్మదేవుని నుండి, గడ్డిపరకవరకు, విశ్వమంతా తానేయై వ్యాపించియున్న యా సర్వేశ్వరు డింత పెద్ద స్తంభములో నుండకుండునా? ఈ స్తంభములో కూడ నున్నాడనుట కెట్టి సందేహమును లేదు. దంభము లేకుండ చూచిన, ప్రత్యక్ష రూపమున ఇక్కడే ఇప్పుడే దర్శింపవచ్చును.

అనిన, విని, ఆసనమునుండి దిగ్గునలేచి క్రిందికి ఉఱికి, ఖడ్గమును దూసి, జళిపించుచు ప్రహ్లాదుని ధిక్కరింపుచు, దానవరాజిట్లనెను:

మ. వినరా డింభక! మూఢచిత్తగరిమన్ విష్ణుండు విశ్వాత్మకుం
డని భాషించెద వైన నిందుఁ గలఁడే యంచున్ మదోద్రేకియై
దనుజేంద్రుం డఱచేత వ్రేసెను మహోదగ్రప్రభాశుంభమున్
జనదృగ్భీషణదంభమున్ హరిజనుస్సంరంభమున్ స్తంభమున్. 457

వినరా, డింభక! మూఢుడా! విష్ణువు విశ్వాత్మకుడని గొప్పగా వదరుచుంటివి. నీ మాటయే నిజమైనచో వాడీ స్తంభమునందుండునేమో జూపుము - యని, మదోన్మత్తుడై యుద్రేకమున ఆ దానవచక్రవర్తి ఉగ్రతేజస్సుతో నత్యంత దంభమును ప్రదర్శించుచు, హరిభక్తునకు (ప్రహ్లాదునకు) మిక్కిలి ఆనందము కలుగునట్లుగ, తన యఱచేతితో ఆ స్తంభమున కొక్క వేటు వేసెను.

**శ్రీనరసింహా స్వామి ఆవిర్భావము**

ఇట్లు దానవేంద్రుడు తమోగుణావేశుడై విష్ణుద్వేషముచే రోషపూరితుడై హుంకరించి, బాలుని ధిక్కరించి, రత్నఖచిత స్వర్ణకంకణభూషితమైన హస్తముతో సభామంటప స్తంభముపై నొక్క వేటు వేయగా, నా స్తంభరాజము చిట్లి, పెటిలి ఛటఛట ధ్వనులతో విస్ఫులింగముల విరజిల్లుతూ విరిగిపడినది. భయంకరమైన ధ్వనులు ఆకాశమంతయు ఆవరించినవి. ఆ స్తంభమునుండి ఆవిర్భవించిన వింతమూర్తి ఎట్లుండెననన చక్రము, ధనుస్సు, హలము, అంకుశము మొదలైన దివ్యచిహ్నములుగల పాదపద్మములతోను, ఐరావతము

యొక్క కాళ్లవంటి తొడలతోను, మణిమయ చిరుగంటల మొలత్రాడుచే చుట్టబడి, పీతాంబరము కట్టబడి శోభించు, కటితలముతోను, పిడికిపాటిదైన సన్నని నడుముతోను, విశాలవక్షస్థలముతోను, వజ్రాయుధములవంటి నఖములతోను, శంఖచక్ర గదాది ఆయుధములు ధరించిన హస్తములతోను, మణిమయ రత్నఖచిత మంజుల హార కేయూర కంకణ కిరీట మకర కుండలాది భూషణములతోను, పర్వతమువంటి స్థిరమైన కంఠముతోను, పారిజాత పుష్పమువంటి మనోహరమైన పెదవులతోను, విద్యుల్లతవలె మెరయు దంతములతోను, ప్రళయకాలమందు సకలభువనములను నశింపజేయు అగ్నిజ్వాలలవంటి ఎర్రని నాలుకతోను, సూర్యగోళముల వంటి నేత్రములతోను, తారకాగ్రహ సంయుత అంతరిక్షమువంటి భృకుటితోను, కమనీయమైన గండభాగముతోను భీతిపుట్టించు జూలుతోను, లోకములను భయకంపితము చేయు గర్జనలతోను ప్రకాశించు ధవళదేహముతోను, ప్రహ్లాదుని రక్షించునట్టి కరుణారసదృక్కులతోను, హిరణ్యకశిపుని సంహరించు వీరరసముతోను శ్రీనరసింహ భగవానుడు ఆవిర్భవించెను. ఆ యద్భుత రూపమును చూచిన హిరణ్యకశిపుడిట్లు తలపోసెను.

క. నరమూర్తి గాదు కేవల
హరిమూర్తియుఁ గాదు మానవాకారముఁ గే
సరియాకారము నున్నది
హరిమాయారచిత మగు యథార్థము చూడన్

"ఇది నరరూపముగాదు, సింహరూపమునుగాదు, యథార్థముగ చూడగ రెండును కలసియున్న మాయావి హరిరూపముగ తోచుచున్నది.

ఉ. తెంపున బాలుఁ డాడిన సుధీరత సర్వగతత్వముం బ్రతి
ష్ఠింపఁ దలంచి యిందు నరసింహశరీరముఁ దాల్చి చక్రి శి
క్షింపఁగ వచ్చినాఁడు హరిచే మృతి యంచుఁ దలంతునైననా
సొంపును బెంపు నందఱును జూడఁజరింతు హరింతు శత్రువున్

సాహసముతో బాలుడు తెగించి చెప్పిన మాటను నిలిపి, తనయొక్క

సర్వవ్యాపకత్వమును నిరూపించుటకు విష్ణువు ఈ స్తంభమునందు నరసింహ రూపమునుదాల్చి, నన్ను శిక్షించుటకు వచ్చినాడు. ఈ హరిచేతనే నా మృతి సంభవింపనున్నట్లు అనిపించుచున్నది. అయినను, అందరు చూచుచుండగా నా యొక్క బలపరాక్రమ శోభలను ప్రదర్శించి, యీ శత్రువును హతమార్చెదను" అని అహంకారముతో బిర్రబిగుసుకొని, గదను ధరించి, వేగిఅపాటుచే నొగర్చుకొనుచు, సింహమును సమీపించు మత్తగజమువలె, రాక్షసవీరుడు నరసింహదేవుని కెదురుగా నడచి, ఆయన యొక్క దివ్యతేజోజ్వాలలకు దావాగ్నియందు ప్రవేశించిన మిణుగురుపురుగువలె, కర్తవ్యాకర్తవ్యములు తెలియని మూఢునివలె తేజోవిహీనుడై చేరెను.

చేరి, ఆ దానవేంద్రుడు తన గదను గిరగిర త్రిప్పి, ఆ నరసింహమూర్తిని కొట్టగా ఆ స్వామి, సర్పము నొడిసిపట్టిన గరుడునివలె హిరణ్యకశిపుని పట్టుకొనగ, ఆతడు గిలగిల కొట్టుకొని, తన బలమంతా ప్రయోగించి, పట్టుతప్పించుకొని, ఎగిఱి గంతువేసి తన శక్తివలన నరసింహుడు బలహీను డయ్యెనని భావించి, మిట్టిపడుచు, ఖడ్గ కవచములను ధరించి, భయంకరముగ గంతువేయుచు, యిటునటు దర్పముతో కదను ద్రొక్కుచుండగా -

**సీ.** పంచాననోద్ధూతపావకజ్వాలలు భూనభోంతర మెల్లఁ బూరితముగ
దంష్ట్రాంకు రాభీలధగధగాయితదీప్తి నసురేంద్రు నేత్రము లంధములుగఁ
గంటకసన్నిభోత్కట కేసరాహతి నభ్రసంఘము భిన్నమై చలింపఁ
బ్రళయాభ్రచంచలా ప్రతిమభాస్వరములై ఖరనఖరోచులు గ్రమ్ముదేర

**తే.** సటలు జళిపించి గర్జించి సంభ్రమించి
దృష్టి సారించి బొమలు బంధించి కెరలి
జిహ్వ యాడించి లంఘించి చేత నొడిసి
పట్టె నరసింహుఁ డా దితిపట్టి నధిప

(నారదుడు యుధిష్ఠిరునితో చెప్పుచుండెను) రాజా! అప్పుడేమి జరిగెననగా: శివుని తృతీయనేత్రాగ్ని వంటి భీషణ అగ్నిజ్వాలలు ఆ నరసింహస్వామినుండి వెలువడి, భూమ్యాకాశములను నింపివేసెను. ఆస్వామిదంతముల (కోరల)

ధగధగ మెఱుపులు అసురేంద్రుని కండ్లకు మిఱుమిట్లు గొలిపి అంధత్వము కలిగించెను. ముండ్లవలె అతిశయించిన కేసరముల కదలిక మేఘములను ఛిన్నాభిన్నము చేసెను. కఠినమైన వజ్రములవంటి గోళ్ల మెఱుపులు విద్యుల్లతలవలె ప్రకాశించెను. జూలు విదిలించి, గర్జించి, విజృంభించి, దృష్టిని అసురునిపై సారించి, బొమలు ముకుళించి, జిహ్వాయాడించి, నరసింహస్వామి అసురునిపై లంఘించి, వాని నొడిసి పట్టుకొనెను. పామునోట బడి కొట్టుకొను మూషికమువలె ఆ దనుజుడు ప్రాణభయముతో కొట్టుకొనెను. ఆ ఉగ్రనరసింహమూర్తికి అసురాధిపతి లోబడిపోయెను. అప్పుడు నరసింహు డత్యాగ్రహముతో, దుస్సహుడును, వజ్రమువంటి కఠిన శరీరుడును, అచంచలమైన ఉత్సాహము గలవాడును, బలమైన బాహువులు గలవాడును, ఇంద్రుని అగ్నిని యముని యందు భయము కలిగించువాడును, ఘోరకృత్యములను చేయువాడును, దైత్యవంశలక్ష్మీకరుడును, అయిన ఆ రాక్షసేంద్రుని పట్టి, తన తొడలపై నిడుకొని, తన వాడియైన నఖములతో, గరుత్మంతుడు సర్పమును చీల్చునట్లు, ఆ దానవుని చీల్చివేసెను. స్వామి యారక్కసుని హృదయకమలమును చించివేసి, భూమిపై అతని రక్తమును వర్షింపజేసెను, రక్తనాళములను త్రెంచివేసెను. అతని విశాల వక్షమును బ్రద్దలుచేసెను, మాంసమును ముక్కలు ముక్కలుగా త్రుంచివేసెను, దుష్టుడైన ఆ అసురుని చీల్చి సంతోషించెను, ప్రేవులను మెఱయుచున్న నఖములతో కంఠమాలికలుగ చేసెను. ఆ నరసింహస్వామి నఖము లెట్లుండెననగా: వక్షస్థలమును ముక్కలు చేయునప్పుడు అవి గొడ్డళ్లవలె నుండెను. హృదయ కమలమును భేదించునప్పు డవి త్రవ్వెడి పనిముట్లుగ కనిపించెను, నాడులను త్రెంచునప్పుడవి కొడవళ్లవలెపనిచేసెను, ఉదరమందలి ప్రేవులను త్రెంచునప్పుడవి ఱంపములవలె పనిచేసెను; తొడ మీదనున్న దైత్యుని ఎట్టి శస్త్రములనుపయోగింపక సంహరించిన నరసింహుని నఖము లతి విచిత్రమైన ఆయుధములై పనిచేసినవి, రాజా!

ఈ విధముగ మానవరూపముగాని, మృగరూపముగాని కాకుండ నరసింహ రూపమును, రాత్రిగాని, పగలుగాని, కాకుండ సంధ్యా సమయమును, బయటగాని, లోపలగాని, కాని ద్వారస్థలమునను, భూమి యాకాశములుకాని

యూరువులపైన, సజీవముగాని, నిర్జీవముగాని, కాని నఖములతోడను, దానవవీరుని వధించి, మహాగ్నికీలలతోను, భయంకరమైన ముఖముతోను, సర్పమువంటి చాచియున్న నాలుకతోను, రక్తముతో తడిసిన కేసరములతోను, కంఠమాలలుగ ధరించిన ప్రేవులతోను, ఏనుగు కుంభస్థలమును కొట్టివచ్చుచున్న సింహమువలె కనబడుచున్న ఉగ్రనరసింహమూర్తిని గాంచి సహింపలేక రాజభృత్యులైన రాక్షసులు ఆయుధముల నెత్తుకొని యుద్ధమునకు సిద్ధపడి ఎదిరింపగా, స్వామి వారినందరిని, ఒక్కడైనను మిగలకుండ, చక్రాయుధముతో సంహరించెను.

రాక్షసవీరులందరిని అంతముచేసి, రణోత్సాహమునుచాలించి, భయంకరమైన దృక్కులతో, సింహాసనము నధిష్ఠించినవాడై శమింపని ఆగ్రహావేశుడై నరసింహస్వామి భీకరముగ నుండెను. ఆయనను చూచుటకు కూడ దేవతలు భయపడి దాగుకొనిరి. దేవతలు, చారణులు, విద్యాధరులు, గరుడులు, సర్పములు, యక్షులు, సిద్ధులు, ఇతర గణములలో నే యొక్కడైనను ఆ నరహరిని సమీపించుటకు సాహసింపరైరి. ఆకాశవీధులలో దేవతాంగనలు ప్రీతితో నరసింహునిపై పుష్పములు కురిపించి, ఉత్సవములు చేసుకొనిరి. ఈ సందర్భమున ఆకాశమునందు అనేకమైన దేవతావిమానములు కన్పించెను. గంధర్వగానములు, దివ్యవాద్యములు, అప్సరసల నృత్యములు వినిపించెను. విష్ణుపార్షదులు, మహేశ్వర బ్రహ్మ, ఇంద్రాది దేవతలు, మునులు, మనువులు, ప్రజాపతులు ఆ నరసింహస్వామి దర్శనార్థం విచ్చేసిరి.

బ్రహ్మాదిదేవతలు స్వామియొక్క ఉగ్రమూర్తిని చూచి భయభ్రాంతులై ఆయనను సమీపింపకుండా, చేతులు మోడ్చి శిరస్సులు వంచి, స్తుతించిరి. బ్రహ్మదేవుడిట్లు స్తుతించెను.

మ. ఘనలీలాగుణచాతురిన్ భువనముల్ గల్పించి రక్షించి భే
దనముం జేయు దురంతశక్తికి ననంతజ్యోతికిం జిత్రవీ
ర్యునికిన్ నిత్య పవిత్రకర్మునికి నే నుత్కంఠతో నవ్యయా
త్మునికిన్ వందన మాచరించెదఁ గృపాముఖ్యప్రసాదార్థినై

మహాద్భుత లీలాగుణవిశేషచైతన్య స్వరూపునికి, భువనములను సృష్టించి, రక్షించి లయింపజేయు అమోఘశక్తి సంపన్నునకు, అనంతజ్యోతికి, విచిత్ర పరాక్రమశాలికి, నిత్యమును పవిత్రకర్మలనే చేయువానికి, అవ్యయాత్మునకు, నేనత్యంతాసక్తితో, కృపానుగ్రహముల నర్థించుచు, నమస్కరించుచున్నాను. రుద్రుడిట్లు ప్రార్థించెను:

దేవదేవా! నీ కోపమున కిది సమయముకాదు. ఇంకా సహస్రయుగములు గడిచినగాని ప్రళయము రాదుకదా! దేవతలను హింసించిన తామసికుడైన దైత్యుని యుద్ధమున వధించితివి. ఇక చాలును. అతని పుత్రుడైన ఈ బాలుడు నిర్మలచిత్తుడు, నీ భక్తుడు, పవిత్రుడు. వీనిని కావుము, భక్తవత్సలా! ఇంద్రుడిట్లు ప్రార్థించెను:

ఓ ప్రభూ! ప్రాణికోట్ల హృదయ పద్మమధ్యమున నివసించి ప్రకాశించు నీవే సర్వమునెఱుగుదువు కదా! ఈ రాక్షసుని జంపి ఇంతకాల మీ దానవునిచే బాధలుపడుచు చిక్కియున్న ఆపన్నజనులను మమ్ములను రక్షించితివి. ఈ రాక్షసుని జంపి ఇప్పుడు క్రతుహవ్యములు మాకు మఱల లభించును. దేవా! నీ సేవ చేయుటను మరగినవారు కైవల్యవైభవమును గూడ కాంక్షించరుకదా! ఇక నితర సుఖములను కోరుకొందురా, అవి అస్థిరములు కావా! నిన్ను అనంతభక్తిచే కొలువనిమ్ము ఓ దైత్యభయనివారకా, నరసింహా!

ఋషులిట్లనిరి :

నీకుక్షియందు లయించి యున్న లోకములనుత్పాదించి, రక్షించి నే డవి, ఈ రాక్షసునిచేత పీడింపబడి కుంచించుకు పోయి యుండ, నీవు ఈ దుర్నీతిపరుని నరసింహరూపమున సంహరించి, వేదవిధులనుద్ధరించితివి కదా! ఓ ధర్మసంస్థాపకా!

పితృదేవతలిట్లనిరి :

ఈ దానవుడు మిక్కిలి నీచుడై క్రోధముతో మా పుత్రులర్పించు తిలోదక పిండములను మాకు చేరనీయకుండా తానే గైకొనుచుండెను. వీడిప్పుడు నీయొక్క నఖములచే చీల్చబడి హతుడై పడియున్నాడు. ఓ ఆత్మేశ్వరా! నీకివే మా ప్రణామములు.

సిద్ధులిట్లనిరి :

ఓ ప్రభూ! నరసింహా! కోపముతోడ యీ దైత్యుడు మా యొక్క సిద్ధులన్నిటిని అపహరించెను. నీవీ దుష్టుని సంహరించి ఎంతో కృపతో మా సిద్ధులను మా కిప్పించితివి. నీకు నమస్కృతులు.

విద్యాధరులిట్లనిరి :

నరసింహా! ఈ దానవుని జంపి, మా యొక్క అంతర్ధానాది విద్యలను మాకు మఱల వచ్చునట్లు చేసితివి. నీ యొక్క నిరుపమ వైభవము నేమని కొనియాడగలము దేవా!

భుజంగులిట్లనిరి :

ఓ ప్రభూ! మా యొక్క రత్నములను, కాంతారత్నములను కొనిపోయిన యీ రక్కసుని చీల్చిచెండాడి మా రత్నములు, మా పత్నులు మాకు దక్కునట్లు చేసిన నీకు వందనములు.

మనువు లిట్లనిరి :

దేవా! జయింపశక్యముకాని ఈ రాక్షసునిజంపి, భ్రష్టము చేయబడిన వర్ణాశ్రమ ధర్మవర్గమును మఱల పరిపూర్ణము చేసితివి, నీకు ప్రణామములు.

ప్రజాపతులిట్లనిరి :

ప్రభూ! ప్రజోత్పత్తి చేయుటకు మమ్ము సృజించి నియమించితివి. కాని, ఈ దైత్యుని యాజ్ఞచే మా ధర్మము నెఱవేర్చలేకపోయితిమి. ఇప్పు డీతనిని జంపితివి గాన ఇక నెట్టి భయములేక, మా కర్తవ్యములను నిర్వహించెదము.

గంధర్వు లిట్లనిరి :

ఈ రాక్షసుడు మా చేత రేయింబవళ్లు నిర్దయుడై ఆడించుచు పాడించుచు బంధించెడివాడు. ఇప్పుడు నీ చేత యమపురికి పంపించబడెను కావున బ్రతికి పోతిమి.

చారణులిట్లనిరి :

ముల్లోకముల ప్రజలను బాధించెడి ఈ యింద్రశత్రువు నేడు నీ చేత హతుడైనాడు గనుక ఓప్రభూ! భవరోగమును నివారించు నీ పాదపద్మముల నాశ్రయించి ఇక బ్రతికెదము దేవా!

యక్షులిట్లనిరి :

నీవు లేనే లేవని, ప్రచారము చేయుచు, నీ భక్తులకు భంగపాటు చేయుచుండు వీనిని నిర్మూలించి మా ఆపదలను తీర్చితివికదా! మోక్షప్రదాతా, జగన్నివాసా!

కింపురుషులిట్లనిరి :

ప్రభూ! సకలసజ్జనుల హృదయములను కర్కశుడై బాధించెడి యీ దుష్టుని జంపి జగమును రక్షించితివికదా! అల్పులము మేము నిన్ను స్తుతింపగలమా! పురుషోత్తమా!

వైతాళికులిట్లనిరి :

త్రిభువనముల శత్రువైన రాక్షసుడు పడిపోయెను. ఇక మేము ఎట్టి భయమును లేక యాగములందును, సభలయందును నీ శుభగీతములను పాడుచు సంచరించెదము ఆర్తశరణ్యా!

కిన్నరు లిట్లనిరి :

ఈ పాపాత్ముడు ధర్మవిరుద్ధముగ మాచే నీచకర్మలను చేయించెడివాడు. ఈ కలుషాత్ముని నీవు అంతము చేసితివి గనుక ఇకపై మేము ఉత్తమకర్మలను చేయుచు నీ యొక్క పాదపద్మములను కొలుచుచు తరించెదము శ్రీహరీ!

విష్ణుసేవకులిట్లనిరి :

సనకాదిమునుల శాపముచే చండరాక్షసుడై పుట్టిన వీనినీవిధముగ శిక్షించి శాపవిమోచనము గావించితివి ప్రభూ! అది నీ యొక్క కృప. భక్తితో సేవించుట కంటె వైరముతో నిన్ను శీఘ్రముగ జేరవచ్చునేమో కదా! పూజనీయమైన నీ నరసింహ రూపమతి యద్భుతముగ నున్నది. అందరును ఆపద బాసిరి శ్రీహరీ!

ఈ విధముగ బ్రహ్మాదిదేవతలు స్తుతించినను స్వామియొక్క ఉగ్రత శమింపనందున, వారు లక్ష్మీదేవిని పిలిచియిట్లు వేడుకొనిరి.

క. హరికిం బట్టపుదేవివి
హరిసేవా నిపుణమతివి హరిగతివి సదా
హరిరతివి నీవు సని నర
హరి రోషము డింపవమ్మ హరివరమధ్యా.

తల్లీ! శ్రీహరికి పట్టపుదేవివి, హరిసేవచేయుటలో నిపుణురాలివి, హరిచే ఎల్లప్పుడును కోరబడుదేవివి. ఎల్లప్పుడును హరిని రమింపజేయు సతివి. ఓ సింహమధ్యా! నీవు పోయి, ఆ నరహరి రోషమును శాంతింపజేయుమమ్మా.

అనిన, ఆమె వారి కోరికను మన్నించి, మహా ఉత్సాహముతో నరహరి సమీపమునకు పోయి, ఆ రూపమును జూచి, ఆశ్చర్యచకితయై యిట్లు తలపోసెను: "ఇదేమిటి, నా స్వామి రూపమిట్లున్నది!

సీ. ప్రళయార్క బింబంబుపగిది నున్నది గాని నెమ్మోము పూర్ణేందునిభము గాదు
శిఖిశిఖాసంఘంబు చెలువు సూపెడుఁగాని చూడ్కి ప్రసాదభాసురము గాదు
వీరరౌద్రాద్భుతావేశ మొప్పెడుఁగాని భూరికృపారసస్ఫూర్తిగాదు
భయదదంష్ట్రాంకుర ప్రభలు గప్పెడుఁగాని దరహసితాంబు జాతంబు గాదు

తే. కఠిననఖర నృసింహవిగ్రహముగాని
కామినీజనసులభవిగ్రహము గాదు
విన్న దియుఁగాదు తొల్లి నే విష్ణువలనఁ
గన్నదియుగాదు భీషణాకార మనుచు,

ఫాలభాగము ప్రళయకాల ప్రచండ సూర్యగోళము వలె తపించుచున్నది గాని, ఎల్లప్పుడు నుండు చల్లని పూర్ణచంద్రప్రకాశముతో లేదేమి? చూపులు అగ్నిజ్వాలలవలె నున్నవి గాని ప్రసన్నముగ శోభించుటలేదు. మోము వీరరౌద్ర అద్భుత ఆవేశపూరితముగ నున్నదిగాని ఎప్పటివలె మిక్కిలి కృపారస ముట్టి పడుటలేదు, పెదవులు ఆ భయంకరమైన కోరల దీప్తిని కప్పిపుచ్చుచున్నవేగాని పద్మము వంటి స్వచ్ఛమైన చిరునవ్వుల చిందించుటలేదు. విగ్రహమైనను, కఠినమైన వజ్రనఖములతో కూడిన నరసింహ రూపమేగాని మగువలు మెచ్చు సుందర సుశీల సౌమ్య విగ్రహముగాదు. నేనిటువంటి భీకరరూపము గురించి

మునుపెన్నడును వినియుండలేదు, చూచియుండనులేదు" ఆమె స్వామితో మాట్లాడవలెనని ప్రయత్నించును, మరి ఆయన కోపగించుకొని పలుకడేమోయని వెనుకాడును. చనువుతో మాట్లాడినను తిరస్కరించునని భయపడును. ఈ విధముగ నామె, స్వామి శాంతించిన పిమ్మట మాట్లాడుటకు నిశ్చయించుకొని మిన్నకుండెను.

అప్పుడు బ్రహ్మదేవుడు యోచించి, ఆ దేవదేవుని రోషమును నివారించుటకు ఒక్క ప్రహ్లాదుడే సమర్థుడని గుర్తించి అతనితో నిట్లనెను :

"నాయనా, ప్రహ్లాదా! నీ తండ్రిని శిక్షించు నిమిత్తము శ్రీహరి తీవ్రముగ రోషావేశుడై యింతవరకును శాంతింపకున్నాడు. నీవు పోయి, యతని కోపతాపమును శాంతింపజేయుమయ్యా" అని కోరగా ఆ మహాభాగవత శ్రేష్ఠుడు సరే యని, చేతులు జోడించి, వినయ వివేకశీలుడై మందగమనముతో స్వామి సన్నిధికి పోయి, సాష్టాంగ దండప్రణామములు చేయగా భక్తపరాధీనుడైన ఆ భగవంతుడు శాంతుడై, కరుణాపూర్ణచిత్తుడై... బాలుని దగ్గరగా తీసుకొని, కృపాదృక్కులతో చూచుచు, నతని శిరస్సుపై తన దివ్యహస్తమునుంచి తలనిమిరెను. శ్రీహరి కరస్పర్శచే ఆ బాలుడు, భయరహితుడై, బ్రహ్మజ్ఞాన సహితుడై పులకిత దేహుడై, ఆనందబాష్ప ప్రవాహపూర్ణుడై, ప్రేమాతిశయమున రుద్ధకంఠుడై, వినయ వివేక చేతసుడై, ఏకాగ్రచిత్తుడై, భక్తిపరాయణుడై, ఆ పరమేశ్వరుని చరణకమలములను తన హృదయమందు నిలుపుకొన్నవాడై చేతులు జోడించి, యిట్లు స్తుతించెను:

## ప్రహ్లాద స్తుతి

దేవదేవా! దేవతలు, సిద్ధులు, యతీశ్వరులు, బ్రహ్మాదులు, భావసహిత చిత్తములతో నిన్ను అనేకవిధముల నిత్యము చింతించుచు, సంసారసాగరపు ఆవలి యొడ్డు చేరుటకు నిన్ను స్తుతింప గోరినను, సంపూర్ణముగ నిన్ను స్తుతింపలేరట. మఱి నేను రాక్షస వంశజుడను, జడుడను, గర్వమద, ఉద్రిక్తతలతో గూడియున్నవాడను, బాలుడను, నిన్ను వర్ణింపగలనా స్వామీ!

తపము, వంశము, తేజము, శాస్త్రజ్ఞానము, అంగసౌందర్యము, ఉన్నతపదవి, నైపుణ్యము, ప్రతాపము, పౌరుషము, నిష్ఠబలము, ప్రజ్ఞ (జ్ఞానము)

జపయోగము, ఇవి ఏవియును నిన్ను సంతుష్టునిగా చేయుటకు చాలవుకదా! స్వామీ! నిన్ను సంతోషింపజేయుటకు గజేంద్రునివలె భావయుక్తముగ భక్తి చేయవలెను.

నిర్మలజ్ఞానము, దానధర్మనిరతి, సత్యవ్రతము, క్షాంతి (క్షమాగుణము) మత్సరము లేకుండుట, యజ్ఞ, తపస్సులను చేయుట, అసూయలేకుండుట మొదలగు సదాచారములు గలవని గర్వించు బ్రాహ్మణోత్తముని కంటెను, కర్మలచేతను, వాక్కులచేతను మనస్సు భావములచేతను, ప్రాణముచేతను సమమైన నిష్ఠతో నిన్ను ప్రార్థించునట్టి చండాలుడే శ్రేష్ఠుడు. అట్టివాడు, చివరకు తన వంశమునకు శ్రేయస్కరుడగును.

కావున నో యనంతా! అల్పుడనైన నేను సంకోచము లేక నిన్ను సంస్తుతించెదను. నీ వర్ణనము చేసిన వాడు అవిద్యను జయించి ముక్తికి బోవును కదా!

సర్వాత్మకుడవైన ఓ సర్వేశ్వరా! నీ భీషణాకృతిని చూచి, నీ యాజ్ఞలను శిరసావహించి నెరవేర్చువారైన బ్రహ్మాదిదేవతలు భయభ్రాంతులగుచున్నారు. నీ యొక్క సుందర రూపములు, కల్యాణకరములుగాని భీతికరములు కావు, కావున రోషంబు మానుము. అందరినీ భయపెట్టిన అసురుని అంతమొందించితివి కదా! నీ అవతారకార్యము తీరినది. ఇక అలుక యేల ప్రభూ! ఇప్పుడు సాధుసంతోషమైనది. లోకులందరు నిన్ను కలుషహారివని, సంతోషకారివని స్తుతించుచున్నారు నిర్మలాత్మా! ఈశ్వరా! నీ యొక్క భయంకరమైన కోరలు, భృకుటి, జూలు, నఖములు, ఉగ్రమైన ధ్వనులు, రక్తముతో తడిసిన కేసరములు, హారములవలె వ్రేలాడు ప్రేవులు జ్వలించుచున్న నేత్రములు, వీటితో కూడియున్న నీ భయంకర నరసింహాకృతిని జూచి, నేను భయపడుటలేదు, ఏలనన వీటికంటె క్రూరమైనది, తప్పింప శక్యముకానిది, భరించలేనట్టిది అయిన సంసార దావాగ్నికి నేను మిక్కిలి భయపడుచుంటిని. నీ పాదములచెంత నాకు ఆశ్రయము ననుగ్రహింపుము. దేవా! నేను అనేక యోనులనుండి జన్మించి, సుఖవియోగము దుఃఖసంయోగముల వలన కలుగు శోకాగ్నిలో దహింపబడినవాడనై ఇంకా

దుఃఖమును కలిగించునట్టి దేహాభిమానముచే మోహితుడనై భ్రమించుచుంటిని. ఇకనుండి నాకు అత్యంత ప్రియతముడవు, సఖుడవు, పరమదేవతవు, నైన నీ యొక్క లీలావతార కథా విశేషములను పఠించుచు, రాగద్వేషాది వికారము తొలగించుకొని దుఃఖములను దాటివేసి, నీ యొక్క పాదసేవలో నిపుణులైన భక్తుల సాంగత్యము చేసెదను. బిడ్డలను తలిదండ్రులు రక్షించునట్లును, రోగిని వైద్యుడిచ్చిన ఔషధము రక్షించునట్లు, సముద్రము నందు మునుగుచున్న వానిని నావ రక్షించునట్లు, ఇతరులెవ్వరును రక్షింపలేని విధముగ సంసార తాపములో నీ చేత నుపేక్షింపబడి, దహించుకు పోవుచున్న వాని నుద్ధరించుటకు నీవు తప్ప నన్యులెవ్వరును సమర్థులు కానేరరు. జగద్రక్షకుడవైన నీ యొక్కయంశమైన మానవునకు నీ యొక్క యనుగ్రహముచే మనస్సు కలిగెను. ఈ మనస్సును నీ యొక్క సేవచేసిననే తప్ప జయించుట యెవ్వరికిని సాధ్యపడదు. ప్రభూ ఈ సంసార దావాగ్నిలో దహించుకుపోవుచున్న ఈ దీనుని రక్షింపుము. జనులు, దేవతల నాశ్రయించి, సంపదలను, దీర్ఘాయువును, వైభవములను, అవియే కోరదగినవనిగా భావించి కోరుకొందురు. కాని అవియన్నియును నా తండ్రియొక్క రోషముచేతగాని, అట్టహాసముచేతగాని, ఆవులింతచేగాని, బొమముడి (ముకుళించిన భృకుటి) మాత్రముచేగాని పొందబడుచుండెను. అట్టి శక్తిమంతుడైన వీరుడే నిముషమాత్రమున నీచేత అంతమయ్యెనుకదా! కావున అట్టివి కోరదగినట్టివికావు. బ్రహ్మాదిదేవతల సిరి, వైభవములు, జీవితములు కూడను కాలునిచేత నపహరింపబడునట్టివేగాని, నిలిచియుండవు. నాకేమియును వలదు. నీయందు నాకుగల కొద్దిపాటి ఎఱుకచే నిన్ను సేవకునివలె కొలిచెదను స్వామీ!

మానవుడు, ఎండమావులవంటి యీ మిథ్యా సంపదలన్నీ నిజములేయని భ్రమించి, రోగభూయిష్టమైన శరీరము పట్ల విరక్తుడు గాక, మిక్కుటమైన కామాగ్నిలో నెల్లప్పుడు దహించుకొనిపోవుచు, ఇంద్రియ సుఖములలో మునిగిపోవుచు, నెన్నడును సంసారసాగరమును దాటిపోజాలడు.

ప్రభూ! శ్రీదేవి, బ్రహ్మ, మహేశ్వరులకైనను నీ యొక్క దివ్యహస్తముచే

అభయదానము చేసియుండని నీవు, బాలుడను, దానవవంశజుడను, రజోగుణోపేతుడను అయిన నా శిరస్సుపై అపరిమితమైన దయతో నీ యొక్క కరకమల ముంచుట అత్యంత ఆశ్చర్యకరము కాదా!

మహాత్మా! సుజనులైన బ్రహ్మాదిదేవతల యందును, దుర్జనులమైన మావంటి దైత్యులయందును ఎట్టి పక్షపాతమును జూపక కల్పవృక్షమువలె కర్మఫలప్రదానము చేయుదువు. సంసార కూపమునపడి కొట్టుకొనుచున్న మూఢజనులతో గూడి మ్రగ్గుచున్న నేను, నీ యొక్క సేవకుడైన నారదమహర్షి యనుగ్రహముచే నీ కృపకు పాత్రుడనైతిని. నన్ను రక్షించుటకై మా జనకుని వధించుట నా యందు పక్షపాతము గాదు. దుష్టశిక్షణము, శిష్టరక్షణము, ధర్మోద్ధరణము, అనబడునవి నీ యొక్క నైజగుణములు. నీవే విశ్వమువు. త్రిగుణాత్మకమైన విశ్వమును సృజించి, అందు ప్రవేశించి, కార్యకారణ గుణయుక్తుండవై రక్షక భక్షకాది నానారూపముల ధరింతువు. నీ మాయచే స్వ, పర యనెడి భేదబుద్ధి కన్పించునుగాని, నీ కంటే వేఱేమియును లేదనునదియే సత్యము. విశ్వమునకు నీ యందె సృష్టి స్థితి ప్రకాశలయములు కలుగును. నీవు తొల్లి ప్రళయకాలమున శేషతల్పమున యోగనిద్రలో నుండగ, కాలశక్తిచే మేల్కొలుపబడి, త్రిగుణములను స్వీకరించి, నాభినుండి కమలము నుద్భవింపజేయగా దానినుండి చతుర్ముఖ బ్రహ్మ ఉద్భవించెను. తన జన్మకు ఉత్పత్తిస్థానము నన్వేషింప దలచిన బ్రహ్మదేవుడు జలమునందు ఒక వంద దివ్యవత్సరములు వెదకి యేమియు గానలేక తిరిగివచ్చి కమలముపై ఆసీనుడై చిరకాలము తపస్సుజేసి, తన హృదయమునందే పురుషోత్తముడవైన నిన్ను దర్శించెను.

ఈశ్వరా! నీవు హయగ్రీవునిగ మధుకైటభులను రాక్షసులను వధించి, వేదములను గైకొని బ్రహ్మకు ఇచ్చిన ఘనుడవు. ఈ విధముగ నీవు కృత త్రేతా ద్వాపరయుగములలో, జంతు, మానవ, ముని, జలచరాకారంబులలో అవతరించి, లోకములనుద్ధరింపుచు, ధరియింపుచు, హరియింపుచు, యుగానుకూల ధర్మంబులను ప్రతిష్ఠింపుచునుండుదువు, దేవదేవా!

సీ. కామహర్షాదిసంకలితమై చిత్తంబు భవదీయచింతనపదవి సొరదు
మధురాదిరసముల మరఁగి చొక్కుచు జిహ్వ నీ వర్ణనమునకు నిగుడ నీదు
సుందరీముఖములఁ జూడఁగోరుచుఁ జూడ్కి తావకాకృతులపైఁ దగులువడదు
వివిధ దుర్భాషలు వినఁగోరు వీనులు వినవు యుష్మత్కథావిరచనములు

తే. ఘ్రాణ మురవడిఁ దిరుగు దుర్గంధములకు
దవులు గొలుపదు వైష్ణవధర్మములకు
నడఁగి యుండవు కర్మేంద్రియములు పురుషుఁ
గలఁచు సవతులు గృహమేధిఁ గలఁచునట్లు.

దేవాదిదేవా! కోరికలతోను, హర్షశోకములతోను, కలుషితమయి, చిత్తము నీ యందు ధ్యానమగ్నమవదు. మధురాది షడ్రుచులను తిన మరగిన నాలుక, నీ యొక్కదివ్యలీలా వర్ణమువలను చేయుటకు నిచ్ఛగించదు. సుందర వనితల వదనముల నెల్లప్పుడు జూడగోరెడు చూడ్కులు, నీ యొక్క దివ్యమోహనా కృతులయందు దృష్టి నిలుపదు. నానారకములైన దుర్భాషలను వినగోరు చెవులు నీ యొక్క దివ్యమధుర గాథలను వినగోరవు. దుర్గంధముల కలవాటుపడిన నాసికలు, విష్ణుపూజల సుగంధములతో తృప్తిజెందునా? విషయభోగముల కలవడిన యింద్రియములు వైష్ణవధర్మాచరణకు ఇష్టపడక, సవతులు గృహస్థుని వేధించునట్లు అలజడి చేయును.

ప్రభూ! ఈ విధముగ నింద్రియములచేత చిక్కుపడి, ఇతర ప్రాణుల యందు స్వ, పర, భేదభావములను జూపుచు, జనన మరణముల పొందుచు సంసార వైతరణీ పంకిలములో మునిగియున్న లోకము నుద్ధరించుట, సృష్టి స్థితి లయ కారకుడవైన నీకే తగియున్నది, కర్తవ్యము కూడను. నీ సేవకులమైన మా యందు ప్రియభక్తులనుద్ధరించు రీతిగ నుద్ధరింపుము.

సర్వేశ్వరా! నీయొక్క దివ్యగుణానుకూల వర్తనముచే కలిగిన అమృతపాన చిత్తుడనైన నేను ఈ భయంకర సంసార వైతరణికి భయపడుచుంటిని. దీనికి వ్యతిరేకులై నీ యొక్క గుణస్తోత్రములను చేయుటకు విముఖులై మిథ్యాసౌఖ్య భావములతో సద్గతిని గాంచలేని మూఢులగురించి నేను శోకించెదను.

దేవా! మునీంద్రులు మోక్షాపేక్షులై, నిర్జన స్థలములలో తపస్సు చేసెదరు. కోరికలను నిరాకరించువారికి నీ కంటెను వేఱు శరణ్యములేదు. నేను నిన్ను సేవించెదను ప్రభూ! కొందరు కాముకులు పశుపక్ష్యాదులవలె తుచ్ఛమైన మైథున క్రియలలోను, గృహస్థ సుఖములలోను, తగుల్కొని కడు దుఃఖితులగుదురు. నీ యనుగ్రహమును పొందిన సుగుణుడు కోరికలులేనివాడై యుండును. భక్తిలేనిదే నీ గురించిన జ్ఞాన మబ్బదు. నీవు సగుణుడవు, నిర్గుణుడవు కూడను.

సీ. నీగృహాంగణభూమి నిటలంబు మోవంగ మోదించి నిత్యంబు మ్రొక్కఁడేని
నీమంగళస్తవనికరవర్ణంబులు పలుమాఱు నాలుకఁ బలుకఁడేని
నీయధీనములుగా నిఖిలకృత్యంబులు ప్రియభావమున సమర్పింపఁడేని
నీపదాంబుజముల నిర్మలహృదయుఁడై చింతించి మక్కువఁ జిక్కఁడేని

తే. నిన్నుఁ జెవులార వినఁడేని నీకు సేవ
సేయ రాఁడేని బ్రహ్మంబుఁ జెందఁగలఁడె
యోగియైనఁ దపోవ్రత యోగియైన
వేదియైన మహాతత్త్వవేదియైన.

దేవదేవా! నీ మందిరప్రాంగణ భూమిపై నుదుటిని మ్రోయించుచు ఆనందపారవశ్యముతో నిత్యము మ్రొక్కనివాడు, నీ దివ్యమంగళ స్తవవర్ణనలను పలుమార్లు నాలుకపై నుచ్చరింపని వాడు, తనయొక్క సర్వకర్మలను ప్రేమభావముతో నీకు సమర్పించి, నీ యధీనము చేయనివాడు, నీ దివ్యపాదపద్మములను నిర్మల హృదయుడై స్మరించుచు ప్రీతితో పట్టుకొననివాడు, నీ దివ్యచరిత్రలను చెవులార విననివాడు, నీ పాదపద్మముల సేవ చేయుటకు రానివాడు, ఎంతటి యోగియైనను, తపోధనుడైనను, వేదవేత్తయైనను తత్త్వవేత్తయైనను, బ్రహ్మమును జెందగలడా? స్వామీ! కావున ఓ ప్రభూ! నీ యొక్క పాదసేవా, దాస్య, భాగ్యమును నాకు అనుగ్రహింపుము.

అని ప్రణతుడైన ప్రహ్లాదుని వాక్కులకు సంతసించి శ్రీహరి సౌమ్యముగ నిట్లనెను:

శా. సంతోషించితి నీ చరిత్రమునకున్ సద్భద్ర మౌఁగాక నీ
యంతర్వాంఛితలాభ మెల్లఁ గరుణాయత్తుండనై యిచ్చెదం
జింతం జెందకు భక్త కాముఁడ నే సిద్ధంబు దుర్లోక్యుఁడన్
జంతుశ్రేణికి నన్నుఁ జూచినఁ బునర్జన్మంబు లే దర్భకా.

బాలకా! నీ యొక్క సత్చరిత్ర సత్శీలములకు సంతోషించితిని. నీకు సర్వశుభములు కలుగుగాక! నీ మనోవాంఛితములన్నిటిని కరుణతో నీకు ప్రసాదించెదను. చింతింపవలదు. నేను నిశ్చయముగ భక్తుల మనోభీష్టములను తీర్చువాడను. నా దర్శనము దుర్లభము. అయినను నా దర్శనమొకసారి లభించిన, జీవులకిక పునర్జన్మ యుండదు. సాధులు, విద్వాంసులు, సకలశుభములను ప్రసాదింపగల ప్రభువునైన నన్ను అనేక విధములుగ కోరుచుందురు. నేనిచ్చెదను, నీవు కూడ ఏదియైనను కోరుకొనుము - అని పరమేశ్వరుడా బాలుని మనస్సు నెఱుంగుటకు అనెను. నిష్కాముడును, ఏకాంత భక్తుడును అయిన ప్రహ్లాదుడు, కోరికలు భక్తియోగమునకు అంతరాయములని తెలిసియున్నవాడు గనుక యిట్లు బదులు చెప్పెను:

"ప్రభూ! నన్ను పరీక్షింపదలచి వరమిచ్చెదనంటివా? కోరికలు సంసారమునకు బీజములును, బంధకారకములును గనుక కామములకు భయపడి, ముముక్షువునై క్షేమముకొఱకై నిన్నాశ్రయించితిని. కోరికలవలన మనశ్శరీర ధైర్యములు, మానవ ధర్మములు, లజ్జ, స్మృతి, సంపద, సత్యము, తేజస్సులు నశించును. అందుచేత నాకు కోరికలు లేవు, వరములును వలదు. దేవా! నాకు వరమివ్వ సంకల్పించినచో కోరికలు చేరకుండగ వరమునిమ్ము. కోరికలు లేని వాడు భగవంతునితో సమానుడగును కదా! ఓ నరసింహా, పురుషోత్తమా, పరమాత్మా" యని ప్రణామము చేసి నమస్కరించిన బాలునితో శ్రీహరి యిట్లనెను:

ప్రహ్లాదకుమారా! నీ వంటి ఏకాంతభక్తులు, జ్ఞానశ్రేష్ఠులు నా నుండి యెటువంటి కోర్కెలను కోరరు. ఐనను, అనుగ్రహింపుచున్నాను. నీవు అసురుల ప్రభువువై కొనసాగి, మన్వంతరకాలము సకలభోగముల ననుభవించెదవు. శుభచింతనతో నా చరిత్రలు వినుచుండుము. సకలభూతములందు

సంపూర్ణముగ నుండి, యజ్ఞేశ్వరుడను, ఈశ్వరుడను అగు నన్ను నీ యాత్మయందు నిలుపుకొని, కర్మసముదాయమును తొలగించుకొని, ఈశ్వరార్పణముగ పూజలాచరింపుము. భోగానుభవముచే పుణ్యములు నశించును, వ్రతములచే పాపములు నశించును. ఆపైన, నీవు కాలగమనమున, ముల్లోకములలో యశస్సుపొంది, దేహమును విడిచి, బంధముక్తుడవై నన్ను చేరెదవు. మఱియును

ఏ మానవుడు ప్రియముతోడ నా అవతారగాథను, నీ యొక్క ఉత్తమ పుణ్య చరిత్రనువిని, మననము చేయునో వాడు, కర్మబంధమును త్రెంచుకొని, ఈ లోకమున మఱి జన్మింపడు. అనిన ప్రహ్లాదుడిట్లనెను.

ప్రభూ! తొల్లి తన సోదరుడైన హిరణ్యాక్షుని నీవు వరాహరూపమున జంపుటచేత శతృత్వము బూని నా తండ్రి, నీవు పరమేశ్వరుడవని గుర్తింపలేక, నీ భక్తుడనైన నన్నొక శత్రునివలె భావించి యపకారము చేయదలంచెను. నీ యొక్క శాంతదృష్టిచే నేడతడు నిర్మలత్వమునొందెను. కావున అతడు పాప పుంజములను పోగొట్టుకొని పరిశుద్ధాత్ముడగునట్లుగా నాకు వరమునిమ్ము ఓ పద్మనేత్రా!

అనిన భక్తవత్సలుడైన శ్రీహరి యిట్లనెను :

ఓ దానవశ్రేష్ఠా! నీవు నాకు ప్రియభక్తుడవు. నిన్ను గన్న సుకృతముచేత నీ తండ్రి యిరువది యొక్క పూర్వజులతో సహా పవిత్రుడై శుభగతిని పొందును సుమా! నా భక్తులు నివసించు ప్రదేశాలలో నుండుచు, వారి ప్రేమకు పాత్రులైన దుర్జనులు కూడ పరిశుద్ధులవగలరు. ఓ పుణ్యశీలుడా! కోరికలన్నిటిని విరమించుకొని నీవలె నన్నెవరైనను సేవించినచో నా భక్తులగుదురు. అట్టివారికి నీవు ఆదర్శప్రాయుడవైతివి. ఇప్పుడు వైదిక విధులతో, నా యందు చిత్తమును నిలిపి, నీ తండ్రికి అంతిమ సంస్కారములను ప్రీతితో నెరవేర్పుము. అతడు నాతో యుద్ధముచేసి నా యొక్క స్పర్శచే నిర్మల దేహుడై పాపకల్మషములను పోగొట్టుకొన్నవాడై పుణ్యలోకముల కేగును -

స్వామి ఆనతిప్రకారము ప్రహ్లాదుడు తండ్రి దేహమునకు సంస్కారములు చేయించెను. భూసురోత్తములతనిని రాజ్యాభిషిక్తుని చేసిరి. శాంతించిన నరసింహస్వామిని చూచి బ్రహ్మ యిట్లనెను :

దేవాదిదేవా! నాచే సృష్టింపబడిన ఏ ప్రాణిచేతను తనకు చావురాకూడదను వరము నీ దానవుడు నా నుండి పొంది గర్వమదాంధుడై లోకకంటకుడై భాగ్యవశమున నేడు నీచేత హతుడయ్యెను ప్రభూ! ఇప్పుడు లోకకల్యాణ మయ్యెను. ఈ భాగవతశ్రేష్ఠుని రక్షించి, వరము నిచ్చితివి. నీ యొక్క యీ నరసింహావతార గాథను నిష్ఠతో విని, మననము చేయువారు మృత్యుభయము లేనివారగుదురు. అనిన నరసింహస్వామి యిట్లనెను.

పద్మాసనా! దయజేసి, దేవశత్రువులకెన్నడు నిటువంటి వరము లివ్వవలదు. పాపాత్ముల కిట్టి వరములిచ్చుట పాముల కమృతమిచ్చు నట్లగును కదా! అనిన,

బ్రహ్మాదిదేవతలు ఆ దేవదేవుని పూజింపగా శ్రీహరి నిష్క్రమించెను. బ్రహ్మదేవుడు ప్రహ్లాదునిచే పూజింపబడి, యతనిని దీవించి, దేవతలను వెంట నిడుకొని వెడలిపోయెను.

ఇట్లు విష్ణుదేవుడు తన పార్షదులైన జయవిజయులు మునులశాపమువలన ప్రథమజన్మమున దితిపుత్రులైన హిరణ్యాక్ష హిరణ్యకశిపులను వరాహ నారసింహ రూపముల నవతరించి, వధించెను. ద్వితీయజన్మమున రావణ కుంభకర్ణులై జన్మించిన వారిని శ్రీరామరూపమున వధించెను. తృతీయ జన్మమున శిశుపాల దంతవక్త్రులుగ జన్మించిన వారిని, శ్రీకృష్ణావతారమున సంహరించెను. ఈ విధముగ మూడు జన్మముల గాఢవైరముచే వారు నిరంతర శ్రీహరి అవతారరూప ధ్యానలో నుండి కల్మషముక్తులై శ్రీహరిని చేరిరి, అని నారదుడు యుధిష్ఠిరునకు చెప్పి యిట్లనెను:

ఉ. శ్రీరమణీయమైన నరసింహవిహారము నింద్రశత్రుసం
హారముఁ బుణ్యభాగవతుఁడైన నిశాచరనాథపుత్రసం
చారము నెవ్వఁడైన సువిచారత విన్నఁ బఠించినన్ శుభా
కారముతోడనే భయముఁ గల్గని లోకముఁ జెందు భూవరా.

ధర్మనందనా! మనోహరము శుభప్రదమునైన యీ నరసింహవిహారము ఇంద్రశత్రువైన హిరణ్యకశిపుని సంహారము, పరమభాగవతుడైన ప్రహ్లాదుని

సంరక్షణమును, ఎవ్వరైన శ్రద్ధగా వినినను, పఠించినను, సర్వశుభములతో పుణ్యలోకమును పొందెదరు.

రాజా! బ్రహ్మాదిదేవతలైనను, మనస్సులో మననం చేయుటకుగాని, భాషాజ్ఞానముచే వర్ణించుటకు గాని వలను పడనట్టి పరబ్రహ్మమైన ఆ జనార్ధనుడు నీ యింటిలో సఖుడై, మేనమఱదియై, సలహాదారుడై ప్రియతముడై మహాఫలప్రదాతయై మీతో నుండుట మహాభాగ్యము కదా! రాజేంద్రోత్తమా!

ప్రథమరత్నమైన ప్రహ్లాదచరిత్ర సమాప్తం.

హరిః ఓం తత్ సత్

❖ ❖ ❖

## 2. గజేంద్రమోక్షణ కథ (అష్టమ స్కంధము)

శ్రీశుకమహర్షి పరీక్షిన్నరేంద్రున కిట్లు చెప్పెను : రాజా! పూర్వము నాల్గవ మన్వంతరమున, విష్ణువు, హరిమేధునకు హారిణియందు "హరి"యై జన్మించెను. అఖిలలోకేశ్వరుడును, దయాసాగరుడును యైన యా హరి మకరిచే బద్ధుడైన యొక గజరాజును ప్రాణభయమునుండి కాపాడి రక్షించెను. అని చెప్పగా, జలచరమైన ఆ మకరి, వనచరుడైన యా గజరాజుతో నెందుకు యెట్లు పోరాడుట సంభవించెనో, ఆ గజరాజును పురుషోత్తముడెట్లు రక్షించెనో వినుటకు మిక్కిలి కోరికగా నున్నది. శ్రీహరిని గూర్చి చెప్పబడు గాథలన్నియు నతి పుణ్యగాథలు కదా! మునీంద్రా నాకు వినిపింపుడు.

అనిన, శుకయోగీంద్రుడు పరీక్షిత్తున కిట్లు చెప్పెను.

రాజేంద్రా! క్షీరసముద్రమునందు త్రికూటమనబడు పర్వతమున్నది. అది, మూడు శృంగములతోను, ఒక యోజనము పొడవు, వెడల్పు, ఎత్తులతోను, సువర్ణ బహురత్నమయముగను మెఱయుచుండెను. అనేకమైన వృక్షలతాకుంజములతోను, నురకలు వేయుచు ప్రవహించు సెలయేరులతోను, మనోహరముగ విహంగములవలె విహరించు దివ్యవిమానములతోను, క్రీడలాడుచుండు కిన్నరులతోను శోభాయమానముగ నుండెను. ఆ పర్వత సానువులు మాదీఫల,లవంగ, మామిడి, జీడి, పనస, వెలగ, మద్దె, ఖర్జూర, అరటి, ఉసిరిక, కదంబాది నానావిధ ఫలవృక్షములు, పలాశ, నాగ, పున్నాగ, చంపక, శతపత్ర, మల్లికాది యనేక పుష్పవృక్షలతలతోను, ఉద్యానవనముల తోను శుకపికాది నానావిధపక్షి సమూహములతోను, వజ్రవైఢూర్య పుష్యరాగ, నీలగోమేధికాది మణులతోను, విద్యాధర సిద్ధచారణ గంధర్వ గరుడ కిన్నర కింపురుషాది స్వేచ్ఛావిహారి మిథునముల ఆటపాటలు, గాననృత్యాది వినోదవిలాసములతోను, నిత్యము నేత్రపర్వముగ నొప్పుచుండెను. ఆ వనమునందు అనేక రకముల భయంకర క్రూరమృగములు, సర్పములు సంచరించుచుండెను. చూడభయంకరమగు కొన్ని అడవి యేనుగుల సమూహమొకటి, కొండగుహలనుండి బయల్పడి, మదించిన శరీరములతో నాడు యేనుగులతో గూడి విహారార్థమై వచ్చి, చల్లని గాలిని, జలమును పొందు

కాంక్షతో, నీట మునిగి, ప్రీతితో జలక్రీడల నాడుటకు నొక పెద్ద మడుగులో ప్రవేశించెను. సూర్యకాంతికి తట్టుకొనలేని అంధకారము, కొండగుహలలో దాగుకొని, సూర్యరశ్మి తగ్గగనే, మళ్లీ (ఆ యంధకారము) గుహలనుండి బైటకు వచ్చుచున్నదా యన్నట్లు, ఈ యేనుగుల మందలు బైటకు వచ్చుట కనిపించెను. ఆ యేనుగు గున్నలు కొండలను త్రోసివేయుటకైనను వెనుకాడవు. ధైర్యసాహసములతో, సింహములనైన నెదుర్కొనుటకు భయపడవు. ఆ బలసంపన్నమైన కుంజరములు పిడుగుపాట్లకైనను కలతజెందవు. భీకరములైన ఈ యేనుగుల మందలను జూచి పులులు భయపడి పొదరిండ్లలో దూరి తలదాచుకొనెను. భల్లూకములు గుహలలో దాగుకొనెను. అడవిపందులు నేల బొఱియలలో దూరిపోయెను. లేళ్లమంద లతాకుంజములలో దాగుకొనెను. కారుగేదెలు మడుగులలోమునిగి దాగెను. వానరమూకలు కొండలపైకి ఎగబ్రాకెను. అడవి సర్పములు బిలములందు చొరబడెను. నెమళ్లు ఎగిరి పారిపోయెను. చమరీ మృగములు భయముచే తమ చామరములవంటి తోకలతో, విలాసముగ విహరించి అలసిపోయిన భద్రగజములకు, విసరి సేద దీర్చుచుండెను. తుమ్మెదలు ఆ ఏనుగులయొక్కమదజల సుగంధమును బాగుగ నాఘ్రాణించి ఝుంఝుంమనుచు గానముచేసెను.

ఏనుగు గున్నలు గాలికి కదిలియాడు పొదలను వాసనజూచుచు, త్రొక్కి వేయుచు, ఫలవృక్షములకు ఒడలు రాయుచు లేత చిగుళ్లను మేయుచు, పులులను, కారు ఎనుబోతులను, ఇతర మృగములను, పోనీయక అల్లరి చేయును. కొలనులో జొచ్చి నీటిని కలచివేయుచు, పర్వతమునెక్కి పేడముద్దలను వేయుచు, మదజలము కారుచున్న చెక్కిళ్ళు తొండములతోను కుంభములు, ఆపిడి చేయుచు, కొండలు తలక్రిందై పడునేమో, దిక్కులు పెల్లగిల్లునేమో, లోకములు భయభీతములగునేమో యనిపించుచుండెను. ఆ ఏనుగులమందలో ఒక గజరాజు మాత్రము విడిపోయి, ఆడ యేనుగులచే, సేవింపబడుచుండెను. ఆ కరిరాజు మోహావేశములో బడి, దారితప్పి, ఆడు ఏనుగులు పరివేష్టించగా, దారిలో కనబడిన లేతకొమ్మలను త్రుంచుచు, చెలియలకు తినిపించుచు, తన చెవులతో విసరుచు, చెలియల తాపమును

చల్లార్చుచు, వాటి మెడలను మృదువుగా నిమురుచు, పిఱుదులచెంత జేరి ప్రేమతో వాసన జూచి, క్రీడించుచు, ఆ మాతంగ సీరుడు విశ్రమించెను. ఈ విధముగ ననేకమైన శృంగార క్రీడలలో మైమరచి, తన బృందములో పోయిపోయి దాహము తీర్చుకొనుటకై యొక కొలను చెంతకు చేరెను. అచ్చట ఆ కరిరాజు, అప్పుడే విచ్చిన తెల్లకలువలు, తుమ్మెదల గుంపులు, తాబేళ్లు, చేపలు, నిరోధింపశక్యముగాని మొసళ్ళు, వటవృక్షములు, తాటిచెట్లు, మామిడి, సాలవృక్షములు మనోహరమైన పుష్పలతలు, మెఱుపుతీగలవలె తళతళ మెఱయు హంసలు చక్రవాకములు, కొంగలను, జూచెను.

ఇట్లితర పురుషసంచారములేని నిర్మలమైన సరోవరమునుజూచి, దానినుండి వీచు కమలముల సుగంధము మేనుసోకగ సేదదీరి, తామర తూడులను ప్రీతితో నారగించుచు వీనులవిందుగ రవముల జేయుచుండు కలహంసలను జూచుచు, పద్మముల సుగంధము నాసికను, ఆహ్లాదపరుపగా, నిర్మల జలములు వదనమునుల్లాస పరుపగా, మూడులోకముల సౌభాగ్య శోభ కన్నులకు విందుజేయ, ఇంద్రియ వ్యాపారములను మఱచి, ఆ కుంజర యూధము కొలనులో జొచ్చెను. తొండములను ఆ నిర్మల జలములచే పూరింపుచు, చెక్కిళ్లను తడుపుకొనుచు, గళగళ శబ్దములు చేసుకొనుచు, నా కరిబృందము కడుపులు నిండ నీరు ద్రావెను. అప్పుడు ఆ గజేంద్రుడు తొండము నిండ నీరెక్కించి, తొండము నాకాశమువైపున కెత్తి యిటునటు కదిలించి, నీరు చిమ్మగా ఆ నీటితోబాటు తాబేళ్లు, చేపలు, పీతలు, మొసళ్లు పైకెగసి క్రిందికి పడుచుండగ, వాటిని గజరాజు పట్టుకొనుట జూచి దేవతలును ఆశ్చర్యచకితులైరి.

ఆ గజరాజుయొక్క నిరాటంకమైన జలవిహారములో, గజకాంతలు యిచ్చు తెల్లని మెఱయుచున్న పద్మముల మధ్యనతడు వెయ్యికనుల యింద్రునివలె కనిపించెను. ఏనుగుగున్నలు వెదజల్లు సౌగంధికాపుష్పపరాగము ఆ కనకాచలమునకే శోభతెచ్చెను. హస్తినులు తెచ్చిన కలువకాండములు ఆదిశేషునకే అలంకారప్రాయము అనిపించెను. మదగజములు విరజిమ్ము ముత్యములవంటి నీటి తుంపరలు, మేఘమండలమంతా నిండిపోయెను.

ఎదురులేని శక్తితో నా గజశ్రేష్ఠుడు ఆ కొలనులో జలకేళి చేయుచుండ, ఆ సరోవరలక్ష్మి, మత్తగజముల వివిధ విహార కేళులతో చెదిరి, చెదిరిన ఇసుకతిన్నెలతో, మరల క్రొత్తశోభను తెచ్చుకొని విలసిల్లెను.

సీ. భుగ భుగాయితభూరిబుద్బుదచ్ఛటలతోఁ గదలుచు దివికి భంగంబు లెగయ
భువనభయంకరఫూత్కారరవమున ఘోరనక్రగ్రాహకోటి బెగడ
వాలవిక్షేపదుర్వారఝంఝానిలవశమున ఘుమఘుమావర్త మడరఁ
గల్లోలజాలసంఘట్టనంబులఁ దటీతరు లమూలంబులై ధరణిఁ గూల

తే. సరసిలోనుండి పొడగని సంభ్రమించి
యుదరి కుప్పించి లంఘించి హుంకరించి
భానుఁ గబళించి పట్టుస్వర్భానుపగిది
నొక్కమకరేంద్రుఁడిభరాజు నొడిసిపట్టె

అట్టితరి, భుగభుగ (బుడబుడ) ధ్వనులతో పెద్దపెద్ద నీటిబుడగల ప్రవాహమును కలిగించుచు, ఆకాశము నంటునట్లు అలలను రేపుచు, భువనములకు భయము కలిగించునట్టి ఫూత్కార శబ్దములు చేయుచు, ఇతర మొసళ్ళు కూడ హడలిపోవుచుండ, తోక కదలికలచే కలుగు ఝంఝానిల సుడిగాలు లుద్భవింపగా ఆ తాకిడికి యొడ్డుననున్న వృక్షములు సమూలముగ కూలిపోవ, కరిరూపమును గాంచి, యూపిరి బిగబట్టి, హుంకరించి, సరస్సునుండి శీఘ్రముగలంఘించి, సూర్యుని కబళించిన రాహువువలె నొక మకరేంద్రుడు వచ్చి గజేంద్రునొడిసి పట్టుకొనెను.

క. వడిఁ దప్పించి కరీంద్రుడు
నిడుదకరం బెత్తివ్రేయ నీరాటంబుం
బొడ వడఁగినట్లు జలములఁ
బడి కడువడిఁ బట్టెఁ బూర్వపదయుగళంబున్.

అప్పుడా గజేంద్రుడు వడిగా తప్పించుకొని, తన పొడవైన తొండమునెత్తి ఒక్క వ్రేటు వేయగా ఆ మకరి చచ్చినట్లు జలమందుపడి, వెంటనేలేచి యేనుగు యొక్కముందరి కాళ్లను పట్టుకొనెను.

చ. పదములఁ బట్టిన ం దలఁకుఁబా టొకయింతయు లేక శూరతన్
మదగజవల్లభుండు ధృతిమంతుఁడు దంతయుగాంతఘట్టనం
జెదరఁగఁ జిమ్మె నమ్మకరిచిప్పలు పాదులు దప్ప నొప్పఅన్
వదలి జలగ్రహంబు కరివాలముమూలముఁ జీరె గోఅలన్

మకరి తన కాళ్లను పట్టుకున్నను ఎంతమాత్రము తడబడక ధృతిమంతుడును, శూరుడునైన ఆ గజరాజు తప్పించుకొని, తన దంతములతో ఆ మకరియొక్క ముడుకు చిప్పలను, పాదములను పొడిచి పొడిచి, చెదరగొట్టగా, ఆ మకరి, కరియొక్క కాలును విడిచి, తన కోఅలతో దాని తోకమూలమును చీల్చెను.

క. కరిఁ దిగుచు మకరి సరసికిఁ
గరి దరికిని మకరిఁ దిగుచుఁ గరకరి బెరయన్
గరికి మకరి మకరికిఁ గరి
భర మనుచును నతలకుతలభటు లదురుపడన్

కరిని మకరి తనవద్దకు (సరస్సులోనికి)లాగును; మకరిని కరి తన వద్దకు (ఒడ్డుకు) లాగును, ఇట్లు కరిమకరులు పరస్పరము భయముతోను బరువైన మనస్సుతోను, నతలకుతల మగుచు, తమతమ భృత్యులు భయముచే నదిరిపోవునట్లుగా పోరాడుచుండిరి.

ఇట్లు కరిమకరములు, సమానశక్తి శౌర్యములతో హోరాహోరీగా పోట్లాడుచు లోకములకు భయము కలిగించుచుండెను. ఒకరికొకరు తీసిపోవని విజయకాంక్షతో పట్టుదలతో, జలాశయమునొక భీకర రణరంగము చేసివేసినవి. చిన్నమొసళ్లు, తాబేళ్లు, ఎండ్రలు, చేపలు, కప్పలు వంటి యనేకమైన జలచరములు, వీటియొక్క పాదముల క్రిందపడి నలిగి నశించినవి. ఈ విధముగ రేయింబవళ్లు కరిమకరులు ఘోరయుద్ధము జేసినవి. కరిరాజు, ఆడు ఏనుగుల యెదుట తన ఆడంబరమును ప్రదర్శించుచు, తొండముతో నీరు జిమ్ముచు, వజ్రముల వంటి తన దంతములతో మకరిని పొడుచుచు, తొండముతో దానిని కొట్టుచు మాటిమాటికి నీట మునుగుచు, తన ప్రతాపము

జూపుచుండెను. ఆడు ఏనుగులు, మకరితో పోరాడుచున్న తమ నాథుని ఒక్కనిని విడిచిపోవలేకను, ఏమియు చేయలేకను, అచ్చటనే చూచుచు ఉండిపోయినవి, మగువలకు మగలు విడువడని అనుబంధము కదా! అప్పుడు.

ఆ. జీవనంబు దనకు జీవనంబై యుంట
నలవు చలము నంతకంత కెక్కి
మకర మొప్పె డస్సె మత్తేభమల్లంబు
బహుళపక్షశీతభానుపగిది

జలమే తనకు జీవనమై యుండుటచేత, మకరికి స్థానబలముచే శక్తి, యుక్తి, సులువు, అంతకంత కెక్కువై ధైర్యము పెరిగెను. కరికి మాత్రము నిలకడ తప్పి, అలసట వచ్చి, కృష్ణపక్ష చంద్రునివలె శక్తి సన్నగిల్లెను.

మ. ఉఱుకుం గుంభయుగంబుపై హరి క్రియన్ హుమ్మంచుఁ బాదంబులన్
నెఱియుం గంఠము వెన్ను దన్ను నెగయున్ హేలాగతిన్ వాలమున్
జఱచున్ ముగ్గగఁ దాఁకు ముంచు మునుఁగున్ శల్యంబులు దంతముల్
విఱుగన్ వ్రేయుచు బొంచి పొంచి కదియున్ వేదండయూథోత్తమున్

మఱియు, ఆ మకరి, హుంమనుచు గజేంద్రుని కుంభస్థలముపైకి కోతివలె నుఱుకును, పాదముల మధ్యను ఇఱుకును, కంఠమును, వెన్నును తన్నుటకై విలాసముగ నెగురును; తోకను చఱచును, ముంచును, మునుగును, ఎముకలు, దంతములు విరుగునట్లు కొట్టును, పొంచిపొంచి కుంజరయూథనాథుని చెంతజేరును. కంటికి కనపడకుండ దాగును, బైటకు పోకుండ అడ్డువచ్చి కనబడును. కాళ్లకు పెనవేసుకొని కదులుటకు వీలులేకుండ చేయును. భయపడునట్లు నేలపడద్రోయును, లేచినచో "లం" మనుచు గొంతెత్తి కేకలు వేయును, తొలగించును, మరలించును, తటాలున పట్టుకొనును, వేధించును, కోపగించుకొనును, ఈ విధముగ నతివిచిత్రముగ ప్రవర్తించుచు నా మకరి, మిక్కిలి ధైర్యముగ, సాహసముతో -

రెండు పాదముల నేలమోపి, ప్రాణవాయువును నియంత్రించి, ఇంద్రియ వ్యాపారముల నరికట్టి, బుద్ధిని లగ్నముచేసి, శోకరహిత బ్రహ్మానందమున

రమించు యోగీంద్రునివలె, ఆ మకరి, కరిపాదముచే అణచబడియున్నను, నిర్భయముగ విజృంభించెను.

ఊహ సరిగా పనిచేయక బ్రతుకు ప్రలోభములో పడి కొట్టుకొనుచు, శరీరశక్తి చివరిదశకు చేరుకొనగా, సంసారమోహబంధములచే చుట్టబడి, విడిపించుకొనలేక, నూగిసలాటలో పడిన జీవునివలె, కరిరాజు, మకరిదాడి నెదుర్కొనలేక చిక్కి శల్యమయ్యెను. ఈ విధముగ ఆ గజేంద్రుడు, అలసటను మూర్ఛిల్లుటను, విసుగుదలను జేరనీయక, మకరితో భయంకరముగ దివారాత్ర సంధ్యలలో ఘోరపోరాటమొక వెయ్యి సంవత్సరములు సల్పెను.

మ. పృథుశక్తిన్ గజ మా జల గ్రహముతోఁ బెక్కేండ్లు పోరాడి సం
శిథిలంబై తనలావు వైరిబలముం జింతించి మిథ్యామనో
రథ మింకేటికి దీని గెల్వ సరి పోరం జాలరా దంచు స
వ్యథమై యిట్లనుఁ బూర్వపుణ్యఫలదివ్యజ్ఞానసంపత్తితోన్

గొప్పశక్తితో, ఆ గజరాజు ఘోరమకరితో ననేక సంవత్సరములు పోరాడి, బాగుగ శిథిలమై తనబలము, శత్రుబలమును సరిపోల్చుకొని, మకరిని గెల్చెదననెడి మిథ్యా వాంఛ యికనేల, దీనిని గెల్వలేను సరికదా, దీనితో పోరాటమునుగూడ కొనసాగించలేను యని భావించి, వ్యథతో కూడిన మనస్సుతో, పూర్వజన్మల పుణ్యవిశేషముచే కలిగిన దివ్యజ్ఞానమువలన నిట్లు తలపోసెను.

శా. ఏ రూపంబున దీని గెల్తునిట మీఁ దేవేల్పుఁ జింతింతు నె
వ్వారిం జీరుదు నెవ్వ రడ్డ మిఁక నివ్వారిప్రచారోత్తమున్
వారింపం దగువార లెవ్వ రఖిల వ్యాపారపారాయణుల్
లేరే మ్రొక్కెద దిక్కు మాలిన మొఱాలింపం బ్రపుణ్యాత్మకుల్

అయ్యో! దీనినే విధముగ నేను గెల్వగలను? ఇక నేనే దేవుని గొల్చెదను? ఎవరిని బిల్చెదను? ఈ యాపదలో నా కడ్డపడే వారెవ్వరున్నారు? ఈ జలచర శ్రేష్ఠు నెదుర్కొను సమర్థులెవ్వరు? నావంటి దిక్కుమాలిన వారి మొఱల నాలకించు శరణాగత రక్షకులెవ్వరును లేరా?

అనేకములైన కుంజరయూథములు వనములో నన్ను చిరకాలమునుండి ప్రభువుగా మన్నించుచుండ, అసంఖ్యాకములైన ఆడు యేనుగులకు నేను నాథుడనై యుండ, ఈ సుందర వనములో దట్టముగ పెరిగియున్న చందనాది వృక్షలతా కుంజముల చల్లని నీడయందు, నేను సంతుష్టుడనై యుండక జలక్రీడ కాంక్షతో నీ మడుగులో నేల జొచ్చితిని? ఈ ప్రమాదమెట్లు నివారణ మగునో కదా, యీశ్వరా!

ఉ. ఎవ్వనిచే జనించు జగ మెవ్వనిలోపల నుండు లీనమై
యెవ్వనియందు డిందుఁ బరమేశ్వరు డెవ్వఁడు మూలకారణం
బెవ్వఁ డనాదిమధ్యలయుఁ డెవ్వఁడు సర్వముఁ దానయైనవాఁ
డెవ్వఁడు వాని నాత్మభవు నీశ్వరు నే శరణంబు వేఁడెదన్.

ఈ విశ్వమెవ్వనివలన నుద్భవించెనో, యెవ్వనియందు లయించునో, లయించి, మఱి యెవ్వనియందు లీనమైయుండునో, పరమేశ్వరుడెవ్వడో, మూలకారణమైన వాడెవ్వడో, ఆది, మధ్య, అంతములు లేని వాడెవ్వడో, సర్వమునూ తానే యై యున్న వాడెవ్వడో, అట్టి స్వయంభువునై ఆ యీశ్వరునే నేను శరణువేడుచున్నాను.

క. ఒకపరి జగములు వెలి నిడి
యొకపరి లోపలికిఁ గొనుచు నుభయముఁ దానై
సకలార్థసాక్షి యగు న
య్యకలంకుని నాత్మమూలు నర్థిఁ దలంతున్

లోకముల నొకమారు తననుండి వెలుపలకు నెట్టి (ఉద్భవింపజేసి), వేఱొకమారు ఆ లోకములను తనలోనికి తీసుకొనుచు, వెలుపలను, లోపలను, తానేయై యుండుచు, సర్వమునకును సాక్షియై యుండు, పవిత్రుడును, నిర్మలుడును యైన ఆ యాత్మమూలమైన పరమాత్ముని నేనాసక్తితో ధ్యానింతును.

క. లోకంబులు లోకేశులు
లోకస్థులుఁ దెగినఁదుది నలోకం బగుపెం

జీఁకటి కవ్వల నెవ్వం
డేకాకృతి వెలుఁగు నతని నే సేవింతున్

ఈ లోకములు, లోకులు, లోకపాలకులందరును అంతమైన పిమ్మట, చివరకు అలోకమైన (లోకము లేవియును లేని) స్థితిలో, పెంజీకటి (శూన్యస్థితి యందు గాఢాంధకార తమస్సు) కవతల నెవ్వడు ఏకైక పరంజ్యోతియై వెలుగుచుండునో ఆ పరమాత్మను నే సేవింతును.

క. నర్తకుని భంగిఁ బెక్కగు
మూర్తులతో నెవ్వఁడాడు మునులున్ దివిజుల్
గీర్తింప నేరరెవ్వని
వర్తన మొరు లెఱుఁగ రట్టి వాని నుతింతున్

నటునివలె ననేకులైన రూపములతో నెవ్వడు లీలానాటకము లాడుచుండునో, యెవ్వనిని ఋషులైనను, దేవతలైనను, సంపూర్ణముగ కీర్తింపజాలరో, యెవ్వని వర్తనములను (చేష్టితములు) గురించి యితరులెవ్వరు నెఱుంగజాలరో యట్టి ప్రభువును నేను స్తుతించెదను.

ఆ. ముక్తసంగులైన మునులు దిదృక్షులు
సర్వభూతహితులు సాధుచిత్తు
లసదృశవ్రతాఢ్యులై కొల్తు రెవ్వని
దివ్యపదము వాఁడు దిక్కు నాకు

సంగమును వీడిన మునులు, దివ్యదర్శనకాంక్షులు, సకలప్రాణికోటికి హితము కోరు సజ్జనులు, సాధుచిత్తులైనవారు, సాటిలేని దృఢనిష్ఠగలవారై, యెవ్వని దివ్యపాదములను కొల్చెదరో ఆ దేవదేవుడే నాకు దిక్కు.

సీ. భవము దోషంబు రూపంబుఁ గర్మంబు నాహ్వయమును గుణము లెవ్వనికి లేక
జగములఁ గలిగించు సమయించుకొఱకునై నిజమాయ నెవ్వఁడిన్ని యునుదాల్చు
నా పరేశునకు ననంతశక్తికి బ్రహ్మ కిద్ధరూపికి రూపహీనునకును
జిత్రచారునికి సాక్షికి నాత్మ రుచికిని బరమాత్మునకుఁ బరబ్రహ్మమునకు

ఆ. మాటల నెఱుకల మనములఁ జేరంగఁ
గాని శుచికి సత్త్వగమ్యుఁడగుచు
నిపుణుఁడైనవాని నిష్కర్మతకు మెచ్చు
వాని కే నొనర్తు వందనములు

వాస్తవముగ నెట్టి సంసారబంధముగాని, దోషముగాని, రూపముగాని, నామముగాని, గుణముగాని, ఏదియును ఎవ్వనికి లేవో, అయినను జగములను సృష్టించుటకు, లయింపజేయుటకు ఎవడు తన మాయ నుపయోగించి, వీటన్నిటిని దాల్చునో, ఆ పరమేశ్వరునకు, అనంతశక్తి స్వరూపునకు, తేజోమయునకు, విచిత్ర యద్భుత చరిత్రునకు, బ్రహ్మమునకు సర్వసాక్షికి, ఆత్మానందునకు, పరమాత్మునకు, పరబ్రహ్మమునకు, మనస్సుచేగాని, మాటచేగాని యెఱుకచేగాని జేర శక్యముగాని వానికి, పరిశుద్ధునకు, సత్త్వగుణము ద్వారానే తెలియబడువానికి, నిపుణుడైనవాని నైష్కర్మ్యమునకు ప్రసన్నుడగు వానికి, నేను వందన మాచరించెదను.

సీ. శాంతున కపవర్గ సౌఖ్యసంవేదికి నిర్వాణభర్తకు నిర్విశేషు
నకు ఘోరునకు గూఢునకు గుణధర్మికి సౌమ్యున కధికవిజ్ఞానమయున
కఖిలేంద్రియద్రష్ట కధ్యక్షునకు బహుక్షేత్రజ్ఞునకు దయాసింధుమతికి
మూలప్రకృతి కాత్మమూలున కఖిలేంద్రియజ్ఞాపకునకు దుఃఖాంతకృతికి

ఆ. నెఱి నసత్య మనెడి నీడతో వెలుఁగుచు
నుండు నెక్కటికి మహోత్తరునకు
నిఖిల కారణునకు నిష్కారణునకు న
మస్కరింతు నన్ను మనుచుకొఱకు

శాంతుడును, మోక్షసౌఖ్యము ననుగ్రహించువాడును, మోక్షప్రదాతయు, ద్వైతాద్వైత (సాకారనిరాకార) భేదము లేనివాడును, దుష్టభయంకరుడును, నిగూఢ తత్త్వముగలవాడును, గుణధర్మములతో నున్నవాడును, విజ్ఞాన మయుడును, సౌమ్యుడును, ఇంద్రియ వ్యాపారములకు ద్రష్టయు, సర్వాధ్యక్షుడును, సకల జీవరాసులకు క్షేత్రజ్ఞుడును, దయాసాగరుడును,

ఆత్మమూలమును, మూలప్రకృతియు, దుఃఖమునంతము చేయువాడును, మిథ్యాజగత్తే ప్రతిబింబమై వెలయువాడును, మహోత్తముడును, సర్వమునకు మూలకారణుడును, తన యునికికెట్టి కారణము లేనివాడును, అయినట్టి ఆ పరమేశ్వరునకు, నన్ను బ్రతికించుమని వేడుకొనుచు నమస్కరించుచున్నాను.

క. యోగాగ్నిదగ్ధకర్ములు
యోగీశ్వరు లే మహాత్ము నొండెఱుఁగక స
ద్యోగవిభాసితమనముల
బాగుగ నీక్షింతు రట్టిపరము భజింతున్

జ్ఞానాగ్నిచే కర్మబంధములను దగ్ధము గావించుకొన్న యోగీశ్వరులు అన్యమేమీ యెఱుగనివారై యుత్తమ యోగాభ్యాసముచే భాసించిన మనస్సులతో నే మహాత్ముని దర్శింపగలరో యట్టి పరమాత్ముని నేను భజించెదను.

సర్వాగమ శాస్త్రనిధియు, మోక్షనిలయుడును, పరమధాముడును, స్వతేజో విరాజితుడును, దిక్కులేని నావంటి పశుజీవుల పాపములను శమింపజేయువాడును, సర్వాంతరాత్ముడై వెలుగువాడును, ఏకమును, అనేకము చేయబడనివాడును, దారాపుత్ర క్షేత్ర యందాసక్తులకు అందజాలనివాడును, అయిన భగవంతునకు నేను వందనముల నాచరింతును. మఱియును,

ధర్మార్థ కామ కాంక్షలు లేని బుద్ధిమంతులు ఎవ్వనిసేవించి, యిష్టగతిని పొందుదురో, మఱియు, ధర్మార్థకామములను కాంక్షించువారికి కరుణతో అంతులేని దేహపరంపరల నెవ్వడు ప్రసాదించునో, ముక్తాత్ములెవ్వని పాదములపైబడి యానంద సాగరములో మునుగుదురో, ఏకాంతిక భక్తులు ఏమియును కోరక, ఎవ్వని పుణ్యచరిత్రములను పాడుచుందురో, ఆ మహేశ్వరుని, ఆదిమూర్తిని, అవ్యక్తుని, అధ్యాత్మ యోగగమ్యుని, పరిపూర్ణుని, ఉన్నతాత్ముని, బ్రహ్మమైన వానిని, పరుని (పరమాత్మను) అతీంద్రియుని (ఇంద్రియములకు గోచరింపనివానిని) స్థూలసూక్ష్మములు రెండునూ అయిన వానిని నేను భజించెదను. అని, మఱియు నిట్లు తర్కించెను.

అగ్నిదేవుడు మంటలను, సూర్యుడు వెలుగులను ఏవిధముగ వ్యాపింపజేసి అణచివేయుదురో యట్లు తనయొక్క తీక్ష్ణతచే నెవ్వడు బ్రహ్మాదిదేవతలను అఖిల జీవరాసులను, గజములను, వివిధ నామరూపములతో ప్రకాశింపజేసి యణచునో, యెవ్వడు మనోబుద్ధీంద్రియములు తానెయై త్రిగుణములను ప్రవర్తింపజేయునో, ఎవ్వడు స్త్రీ నపుంసక పురుషమూర్తియుగాక, దేవ మానవ జంతుమూర్తియుగాక, కర్మ గుణభేదములు గాని సత్ అసత్‌ల ప్రకాశము గాని కాడో, కాని, వీటన్నిటికి ఆధారముగ తానె అన్నియునైయున్న యా విభుని స్మరించెదను.

క. కలఁడందురు దీనులయెడఁ
గలఁడందురు పరమయోగిగణములపాలం
గలఁడందు రన్ని దిశలను
గలఁడు కలండనెడువాఁడు గలఁడో లేఁడో

ఇంతగా స్తుతించినను, భగవంతునకు నా మొఱవినబడలేదా, వినబడిందో లేదో! మరి, ఆ భగవంతుడు దీనులయెడల దయగలిగి యుండునని యందురు కదా! పరమయోగుల పాలిట నుండునని యందురు కదా! అతడు అంతటను, అన్నిదిశలందును ఉండునని చెప్పెదరుకదా! మరి "ఉన్నాడున్నా" డని అందరూ చెప్పే ఆ భగవంతుడు నిజముగా నున్నాడో, లేడో!

సీ. కలుగఁడే నాపాలికలిమి సందేహింపఁ గలిమి లేములు లేక కలుగువాఁడు
నా కడ్డపడ రాఁడె నలి నసాధువులచేఁ బడినసాధుల కడ్డపడెడువాఁడు
చూడఁడే నా పాటుఁ జూపులఁ జూడక చూచువారలఁ గృపఁ జూచువాఁడు
లీలతోనామొఱాలింపఁడే మొఱఁగుల మొఱ లెఱుంగుచుఁదన్ను మొఱఁగువాఁడు

తే. అఖిలరూపులు దనరూప మైనవాఁడు
ఆదిమధ్యాంతములు లేక యడరువాఁడు
భక్తజనముల దీనులపాలివాఁడు
వినఁడె చూడఁడె తలఁపడె వేగ రాఁడె

అయ్యో! ఆయన ఉనికిని సందేహింపనేల? కలిమి లేములు లేక (కలడో లేడో యను సందేహము లేక, లేదా, కలవారు లేని వారు యను విచక్షణలేక) అంతటా, అందరిపట్ల కలిగియుండు ఆ భగవంతుడు నా పట్ల నుండడా? దుష్టులపాలబడి మిక్కుటముగ హింసింపబడు సాధువుల కడ్డపడి రక్షించువాడు, నా కడ్డపడి రక్షింపకుండునా? పైపై చూపులు జూడక అంతర్‌దృష్టితో జూచువారలపై కృపజూపు నా సర్వసాక్షి, నా యొక్క పాట్లను చూడకుండునా? దీనజనుల మొఱలను వినుచు తన్నుతాను మఱచిపోవు ఆ దయామయుడు, నా మొఱనాలకింపరాడా? సకల ప్రాణుల రూపములు తన రూపముగనె వెలసియున్నవాడును, ఆది, మధ్య, అంతములులేక సంతతను వ్యాపించియున్నవాడును, భక్తులకు, దీనులకు, దిక్కైన వాడును అయిన ఆ కరుణామయుడు నా మొఱవినడా, (వినియుంటే) నా బాధను చూడడా, (చూచియుంటే) నా యందు దయతలపడా, (దయతలచినవాడైతే) నన్ను రక్షించుట కింకను రాడేమి?

క. విశ్వకరు విశ్వదూరుని
విశ్వాత్ముని విశ్వవేద్యు విశ్వు నవిశ్వున్
శాశ్వతు నజు బ్రహ్మప్రభు
నీశ్వరునిం బరమపురుషునే భజియింతున్

విశ్వమును సృష్టించినవాడును, విశ్వమునకు దూరముగ నుంటూ, దానిచే నంటబడనివాడును, విశ్వమే తానై యున్నవాడును, విశ్వమును తెలిసియున్న వాడును, తాను విశ్వుడును, విశ్వము కానివాడును (ఒకప్పుడు విశ్వముగ కన్పించునది, పిమ్మట లేకుండునట్టిది). శాశ్వతుడును, పుట్టుకలేనివాడును, బ్రహ్మమును, ఈశ్వరుడును (ప్రభువు) అయియున్న ఆ పరమపురుషుని ప్రార్థించెదను. అని భావించి, ఆ గజరాజు భగవంతుని సాన్నిధ్యమును ఊహించుకొని, యిట్లు పలికెను.

శా. లా వొక్కింతయు లేదు ధైర్యము విలోలం బయ్యెఁ బ్రాణంబులున్
ఠావుల్ దప్పెను మూర్ఛ వచ్చెఁ దనువున్ డస్సెన్ శ్రమం బయ్యెడిన్

నీవే తప్ప నితః పరంబెఱుఁగ మన్నింపందగున్ దీనునిన్
రావే యీశ్వర కావవే వరద సంరక్షింపు భద్రాత్మకా

ఓ భగవంతుడా! నాశక్తి అంతయునశించినది, ఒక్కింతైనను మిగిలి యుండలేదు. ధైర్యము చెదిరిపోయినది. ప్రాణములు తమ తమ తావులను విడిచినవి. మూర్ఛ వచ్చినది. శరీరము శిథిలమైనది. మిక్కిలి అలసటగ నున్నది. ఇక నీవే నన్ను కాపాడవలెను. నీవు తప్ప నా కింకేమియును తెలియదు. ఈ దీనుని యార్తిని మన్నించి నీవే యాదుకొనుట సరియగును. ఓ యీశ్వరా! రావా! ఓ వరములిచ్చు ప్రభువా! నన్ను కావవా! ఓ శుభంకరా! నా భయమును బాపి, నన్ను రక్షింపవా ప్రభూ!

క. విను దఁట జీవులమాటలు
చను దఁట చనరానిచోట్ల శరణార్థులకో
యను దఁట పిలిచిన సర్వముఁ
గను దఁట సందేహమయ్యెఁ గరుణావార్ధీ

ఓ కరుణాసాగరా! జీవుల మనస్సులోని మాటలను నీవు వినెదవట! శరణార్థులను రక్షించుట కొఱకు ఎటువంటి వెళ్ళరాని (శక్యముగాని) చోట్లకైనను వెళ్లెదవట. ఆర్తులెవ్వరు పిలిచినను వెంటనే "ఓ" యనెదవట! అంతయును చూచుచు సర్వమును గ్రహించెదవట! కాని, ఇదియంతయు నిజమేనా యని నాకు సందేహము కలుగుచున్నది స్వామీ!

ఉ. ఓ కమలాప్త యో వరద యో ప్రతిపక్షవిపక్షదూరకు
య్యో కవియోగివంద్య సుగుణోత్తమ యో శరణాగతామరా
నోకహ యో మునీశ్వరమనోహర యో విమలప్రభావ రా
వే కరుణింపవే తలఁపవే శరణార్థిని నన్నుఁ గావవే

ఓ కమలప్రియా! ఓ వరదాతా! శత్రువులయందును శత్రుత్వములేని ఓ దయామయా! (నా బాధ దుర్భరమై పోవుచున్నది) కుయ్యో! కవులు, యోగులచే పూజింపబడు ఓ స్వామీ! ఓ సుగుణభూషణా! శరణాగతుల యెడల కల్పవృక్షమా! ఓ మునిమానసచోరా! ఓ యనంతప్రభావా! రావా! నన్ను

కరుణింపవా! నా యార్తిని గురించి తలంపవా! శరణార్థినైన నన్ను గావవా? యని ఆక్రోశించి, రక్షణలేని దీనులకు రక్షకుడైన యీశ్వరుడు ఆపదలోనున్న నన్ను గాచుగాక యని, నింగివైపు నిక్కి చూచుచు, నిట్టూర్పుచు గజేంద్రుడు మొఱ సేయుచుండగా, వినియును, బ్రహ్మాది దేవతలు, తాము సర్వశక్తిమంతులు కారు గనుక నేమియు చేయలేక మిన్నకుండిరి, అప్పుడు విశ్వమయుడు, విభుడు, విజయశీలుడైన విష్ణువు భక్తుడైన గజేంద్రుని రక్షింపదలచి....

మ. అలవైకుంఠపురంబులో నగరిలో నా మూలసౌధంబుదా
పల మందారవనాంతరామృతసరఃప్రాంతేందుకాంతోపలో
త్పలపర్యంకరమావినోది యగు నాపన్న ప్రసన్నుండువి
హ్వలనాగేంద్రము పాహి పాహి యనఁ గుయ్యాలించి సంరంభియై

ఆ వైకుంఠధామములో, రాజప్రాసాదములో, చివరి సౌధము ప్రక్కనున్న మందార వనమునందున్న అమృతసరస్సు ఒడ్డున నున్న చంద్రకాంతశిలా వేదికపై కలువ పుష్పముల ప్రక్కపై (శయ్యపై) రమాదేవితో వినోదించుచుండు ఆపన్నప్రసన్నుడు (ఆపద యందున్నవారి నాదుకొనువాడు) భయకంపితుడైన గజేంద్రుడు "పాహి పాహి" యని మొఱపెట్టుచుండగ ఆ మొఱాలించి, అతి శీఘ్రముగ....

మ. సిరికిం జెప్పడు శంఖచక్రయుగముం జేదోయి సంధింపఁడే
పరివారంబును జీరఁ డభ్రగపతిం బన్నింపఁ డాకర్ణికాం
తరధమ్మిల్లముఁ జక్క నొత్తఁడు వివాదప్రోత్థితశ్రీకుచో
పరిచేలాంచలమైన వీడఁడు గజప్రాణావనోత్సాహియై

(గజేంద్రుని రక్షింపవలెనను ఉత్సాహముతో ఆ శ్రీహరి...) శ్రీదేవికైనను చెప్పడు, శంఖచక్రములనైనను చేతుల ధరింపడు. అనుచరుల నెవ్వరిని పిలువడు, పక్షిరాజైన గరుడుని సిద్ధపడుమని చెప్పడు. చెవులవరకు జాలువారిన జుత్తులనైనను సవరించుకొనడు. అంతేకాదు, వినోదమున కంతరాయము కలిగినందుకు వచ్చిన ప్రణయ కోపముచే లేచి వెళ్లిపోవుచున్న శ్రీదేవియొక్క

పైట చెంగు తన వ్రేళ్లకు చుట్టుకొని యుండ, దానిని విడిచిపెట్టకుండ, తొందరలో వడివడిగ ఆకాశమార్గమున నడచి వెళ్లిపోవుటకుద్యుక్తుడయ్యెను.

ఇట్లు భక్తజన రక్షణపరాయణుండును, సకలజీవరాసుల హృత్కమల నివాసియునగు శ్రీమన్నారాయణుడు, గజేంద్రుని యొక్క నానావిధ దీనాలాప, విజ్ఞాపనల నాలకించినవాడై కరిరాజు రక్షణ బాధ్యతను వహించి, గగనమునకు దిగి పయనమగునప్పుడేమి జరిగెననగా:-

మ. తనవెంటన్ సిరి లచ్చి వెంట నవరోధవ్రాతమున్ దానివె
న్కను బక్షీంద్రుఁడు వానిపొంతను ధనుఃకౌమోదకీశంఖచ
క్రనికాయంబును నారదుండు ధ్వజినీకాంతుండు రా వచ్చి రొ
య్యన వైకుంఠపురంబునం గలుగువా రాబాలగోపాలమున్

శ్రీహరివెంట శ్రీదేవి, ఆమెవెంట నంతఃపుర స్త్రీ జన సమస్తము, వారివెనుకను గరుడుడు, నాతనితో సహా సారంగధనుస్సును, కౌమోదకీగద, సుదర్శనచక్రము, పాంచజన్య శంఖ సముదాయము, ఆ వెనుకను నారదుడు, పార్షదుడైన ధ్వజనీకాంతుడు, బయలుదేరగా, వారివెంట వైకుంఠములోని వారెల్లరు, నాబాలగోపాలము తిన్నగా వెంటబడిరి.

గోవిందుని కరకమలములో చిక్కుబడి, లాగబడుచున్న తన పైటచెంగును రక్షించుకొనుచు, ఆయన వెంట పరుగెత్తవలసివచ్చిన లక్ష్మీదేవి యిట్లు తలపోసెను.

మ. తన వేంచేయుపదంబుఁ బేర్కొనఁ డనాథ స్త్రీ జనాలాపముల్
వినెనో మ్రుచ్చులు మ్రుచ్చిలించిరొ ఖలుల్ వేదప్రపంచంబులన్
దనుజానీకము దేవతానగరిపై దండెత్తెనో భక్తులం
గని చక్రాయుధుఁ డేఁడి చూపుఁ డని ధిక్కారించిరో దుర్జనుల్

స్వామి, తాను వెళ్లుచున్న దెచ్చటికో, యెందులకో, చెప్పకుండా ఇంత వడివడిగా వెళ్లుచుండెనేల? ఎవ్వరైన అనాథ స్త్రీ జనుల నార్తనాదము వినెనేమో! దుర్మార్గులైన చోరులేమైన దొంగిలించిరో, లేక దుష్టులెవ్వరైన వేదముల నపహరించిరో! రాక్షసిమూకలు, దేవతల నగరముపై దండెత్తిరో! దుర్జనులైన

దైవద్వేషులెవరైన "విష్ణువేడి? చూపుడని" భక్తులను ధిక్కరించి హింసింపు చుంటిరేమో! యని తర్కించు కొనుచు, నా సిరులసుందరి,

శా. తాటంకాచలనంబుతో భుజనటద్ధమ్మిల్లబంధంబుతో
శాటీముక్తకుచంబుతో నదృఢచంచత్కాంతితో శీర్ణలా
లాటాలేపముతో మనోహరకరాలగ్నోత్తరీయంబుతోఁ
గోటీందుప్రభతో నురోజభరసంకోచద్విలగ్నంబుతోన్

క. అడిగెద నని కడు వడిఁజను
నడిగినఁ దను మగుడ నుడుగఁడని నడ యుడుగున్
వెడవెడ చిడిముడి తడఁబడ
నడు గిడు నడుగిడదు జడిమ నడుగిడునెడలన్

కదలాడు చెవికమ్మల (లోలాకుల) తోను, ముడివేయబడిన శిరోజముల తోను, ఆచ్ఛాదన తొలగిన కుచములతోను, మారుచున్న ముఖకాంతితోను, కుంకుమ చెదిరి, లేపనములు వెలిసిన ముఖముతోను, మనోహరుని చేతిలో చిక్కుకున్న ఉత్తరీయముతోను, కోటిచంద్రుల శోభతోను, కుచభారముతో వంగిన నడుముతోను, ఆమె శ్రీహరి ననుసరించుచు, ఎక్కడికి, యెందుకీ దౌడు యని అడుగవలెనని వడివడిగా నడుచును, అడిగినా చెప్పడేమో యని సంకోచించుచు అడుగక నూరుకొనుచు, చిరుకోపము తెచ్చుకొనుచు వడి తగ్గించి మందగమనము చేయుచు, ఆ దేవి పతిదేవుని వెంట నడచుచుండెను. అప్పుడేమి జరిగె ననగా:-

మ. వినువీథిం జనుదేరఁ గాంచి రమరుల్ విష్ణున్ సురారాతిజీ
వనసంపత్తినిరాకరిష్ణు గరుణావర్ధిష్ణు యోగీంద్రహృ
ద్వనవర్తిష్ణు సహిష్ణు భక్తజనబృందప్రాభవాలంకరి
ష్ణు నవోఢోల్ల సదిందిరాపరిచరిష్ణున్ జిష్ణు రోచిష్ణునిన్

అసురుల జీవనముల హరించువాడును, కరుణాసాగరుడును, యోగీంద్రుల హృదయసీమలయందు విహరించువాడును, సహనశీలి, భక్తుల హృదయముల నుత్కృష్టపరచువాడును, నిత్యనవయౌవనియైన ఇందిరాదేవి

పరిచర్యలు చేయువాడును, విజయశీలుడును, తేజోమయుడును నగు విష్ణుమూర్తి ఆకాశవీధులలో వచ్చుచుండగా దేవతలు చూచిరి. ఆయన వెనువెంటనే వచ్చుచున్న వారిని చూచి తమలో తాము యిట్లు ముచ్చటించుకొనిరి.

మ. చనుదెంచెన్ ఘనుఁ డల్ల వాఁడె హరిపజ్జం గంటిరే లక్ష్మి శం
ఖనినాదం బదె చక్ర మల్లదె భుజంగధ్వంసియున్ వాఁడె క్ర
న్నన యేతెంచె నటంచు వేల్పులు నమో నారాయణాయేతి ని
స్వనులై మ్రొక్కిరి మింట హస్తిదురవస్థావక్రికిం జక్రికిన్

అడుగో మహనీయుడగు శ్రీహరి వచ్చుచుండె, ఆ వెనుకనే వచ్చుచున్న లక్ష్మిని జూచితిరా! అదిగో శంఖనాదము, సుదర్శన చక్రమదిగో, అదిగో సర్పశత్రువైన గరుత్మంతుడు వెంటనే వచ్చుచుండె. చూడుడీ దివ్యదర్శనము - ఆహా! "ఓం నమో నారాయణాయ" యని దేవతలు, కరిరాజు దురవస్థను బాపుటకై తొందరపడు విష్ణువుకు మ్రొక్కిరి.

గజేంద్రుని రక్షించు ధ్యాసయందున్న శ్రీహరి, దేవతల నమస్కారములను గుర్తించలేదు. మనోవేగముతో పోయిపోయి, కొంతదూరమున శింశుమార చక్రమును బోలునట్టిదియు, కిన్నరేంద్రుని భాండాగారము వంటిదియు, భాగ్యవంతుని ఐశ్వర్యము వంటిదియు వైకుంఠపురమునందుండు కమలములతో నున్నట్టిదియు, సంసారచక్రమువలె ద్వంద్వములతోను, పాపపంకిలముతోను కూడియున్నదియునైన, యా కలువల సరస్సును గాంచి,

మ. కరుణాసింధుఁడు శౌరి వారిచరమున్ ఖండింపఁగాఁ బంపెన
త్వరితాకంపితభూమిచక్రము మహోద్యద్విస్ఫులింగచ్ఛటా
పరిభూతాంబరశుక్రమున్ బహువిధ బ్రహ్మాండభాండచ్ఛటాం
తరనిర్వక్రముఁ బాలితాఖిలసుధాంధశ్చక్రముం జక్రమున్

కరుణాసాగరుడైన శ్రీహరి మకరిని ఖండించుటకు తన సుదర్శన చక్రమును పంపెను. ఆ చక్రమెట్టిదన : సాధుజనులను రక్షించునట్టిది, భూమండలమును కంపింప జేయుగలవేగము గలది, తనసుండి వెలువడే

అగ్నికణములతో ఆకాశమును చుట్టివేయగలది, పెక్కు బ్రహ్మాండ భాండములను కాంతిపుంజములతో నింపివేయగలది, తిరుగులేనట్టిది.

ఆ దివ్యచక్రము సూర్యకాంతితో సరస్సులో ప్రవేశించి, నీటిని కలచివేసి బుడబుడ ధ్వనులు నిండిపోవగా, దుష్టజలచరమైన మకరముండు తావునకు శీఘ్రముగ చేరెను.

శా. భీమంబై తలఁ ద్రుంచి ప్రాణములఁ బాపెం జక్ర మాశుక్రియన్
హేమక్ష్మాధరదేహముం జకితవన్యేభేంద్రసందోహముం
గామక్రోధన గేహమున్ గరటిరక్తస్రావగాహంబు ని
స్సీమోత్సాహము వీతదాహము జయశ్రీమోహమున్ గ్రాహమున్

ఆ చక్రము, భయంకరముగ, బాణమువలె పోయి, ఆ మకరితలను ద్రుంచి ప్రాణములను పోగొట్టెను. ఆ మకరము మేరు పర్వతమువంటి దేహము గలదియై, కామక్రోధాదులకు నిలయమై, ఏనుగుల మందకు భీతిని కల్పించునట్టిదై, గజేంద్రుని రక్తస్రావముతో నిండిన మడుగులో మునిగి తాపమును చల్లార్చుకొని, యంతులేని ఉత్సాహముతోను, విజయకాంక్షతోను విజృంభించినట్టిదై యుండెను. అట్టి మకరిని చక్రము ద్రుంచెను. అప్పుడు,

మ. తమముం బాసినరోహిణీవిభుక్రియన్ దర్పించి సంసారదుః
ఖము వీడ్కొన్న విరక్తచిత్తునిగతిన్ గ్రాహంబు పట్టూడ్చి పా
దము లల్లార్చి కరేణుకావిభుఁడు సౌందర్యంబుతో నొప్పె సం
భ్రమదాశాకరిణీకరోజ్ఝిత సుధాంభస్స్నానవిశ్రాంతుఁడై

రాహువుచే విడిచిపెట్టబడిన చంద్రునివలెను, వైరాగ్యమును పొంది, సంసారదుఃఖమునుండి విడుదలను పొందిన గృహస్థుని వలెను, మొసలి పట్టునుండి విడుదల పొందిన కరిరాజు పాదము నిటు నటు కదిలించి స్వస్థుడై, సుఖియై, సుందర వదనుడై, యాడు యేనుగులు స్నానము చేయించి సేవలు చేయగా విశ్రాంతుడయ్యెను.

శా. పూరించెన్ హరి పాంచజన్యముఁ గృపాంభోరాశిసౌజన్యమున్
భూరిధ్వానచలాచలీకృతమహాభూత ప్రచైతన్యమున్
పారోదారసితప్రభాచకితపర్జన్యాదిరాజన్యమున్
దూరీభూతవిపన్న దైన్యమును నిర్ధూతద్విషత్సైన్యమున్

అప్పుడు శ్రీహరి పాంచజన్య శంఖమును పూరించెను. ఆ శంఖము, ఆయనయొక్క కరుణారస సముద్రమునుండి సౌజన్యమును స్రవింపజేయు నట్టిది దానియొక్క గొప్ప ధ్వనిచే పంచమహాభూతములు చైతన్యవంతములై చలనము పొందును, దాని యొక్క దివ్యతేజస్సు, ఇంద్రవరుణాది లోకములను కూడ ఆశ్చర్యపరచును, ఆపదలోనున్నవారి భయమును తొలగించును, శత్రుసేనలను పారద్రోలును.

మ. మొరసెన్ నిర్జరదుందుభుల్ జలరుహామోదంబులై వాయువుల్
దిరిగెం బువ్వులవానజల్లు గురిసెన్ దేవాంగనాలాస్యముల్
పరఁగెన్ దిక్కులయందు జీవజయశబ్దధ్వానముల్ నిండె సా
గర ముప్పొంగెఁ దరంగ చుంబితనభోగంగాముఖాంభోజమై

దేవదుందుభులు మ్రోగినవి, కమలములు తల లాడించు నట్లుగా వాయువులు వీచినవి, పువ్వులవాన జల్లు కురిసినది, అప్సరసలు నృత్యము చేసిరి, జయజయధ్వనులతో దిక్కులు నిండినవి, అలలు ఆకాశమునంటు నట్లుగ సముద్రముప్పొంగినది.

క. నిడుదయగు కేల గజమును
మడుపున వెడలంగఁ దిగిచి మదజల రేఖల్
దుడుచుచు మెల్లన పుడుకుచు
నుడిపెన్ విష్ణుండు దుఃఖ ముర్వీనాథా

పరీక్షిన్మహారాజా!

ఆ మహాభాగ్యశాలి యైన గజేంద్రుని పొడవైన తొండమును పట్టుకొని, శ్రీహరి, ఆ గజమును మడుగునుండి వెలికితెచ్చి దాని చెక్కిళ్లపై కారిన మదజలచారలను తుడిచి, చేతితో నెమ్మదిగ నిమురుచు, దాని బాధను దుఃఖమును పోగొట్టెను.

శ్రీహరియొక్క కరస్పర్శచే దేహతాపము తొలగినవాడైన గజేంద్రుడు కరిణుల (ఆడుయేనుగుల) సమూహముతో ఫీంకార శబ్దములతో కలుసుకొనెను. తొండముతోకరిణులను నిమురుచు, శ్రీహరి యనుగ్రహముచే, గజపతి, మునుపటివలె అనురాగముతో క్రీడించెను.

మహారాజా! దేవల ఋషియొక్క శాపమునుండి విముక్తుడైన మకరము తన మొసలి రూపమును విడిచి, తన పూర్వపు హూహూ నామగంధర్వ రూపమును పొంది, నిర్మలుడై, శ్రీహరికి నతిభక్తితో మ్రొక్కి, కీర్తించి, గీతములు పాడి, ఆ భగవంతుని కృపను పొంది, పాపములను పోగొట్టుకొని, తనలోకమునకు వెళ్లెను. ఆ గజేంద్రుడు శ్రీహరి కరస్పర్శచే అజ్ఞానరహితుడై విష్ణురూపుడై వెలసెను. ఈ గజేంద్రుడు పూర్వజన్మమున ఇంద్రద్యుమ్ను డనబడు ద్రవిడదేశపు రాజైయుండెను. అతడత్యంత పుణ్యశీలుడు, వైష్ణవశ్రేష్ఠుడు, ఒక మహాపర్వతశిఖరముపై కూర్చొని, మౌనవ్రతము స్వీకరించి సర్వాత్ముడైన నారాయణుని విశేషముగ పూజించుచుండెను. ఒకనాడతడు మహావిష్ణువును ధ్యానించుచుండగా నచ్చటికి అగస్త్యముని వచ్చెను. రాజు, మునిరాకను గమనించలేక, లేచి నిల్చొని అతనిని పూజింపని కారణమున ముని క్రుద్ధుడై "నీవు గజమువై జన్మించెదవుగాక!" యని శపించెను. అట్లే ఇంద్రద్యుమ్నుడు కుంజర గర్భమున జన్మించెను. రాజా! ఎట్టి పరిస్థితుల యందైనను విప్రుల కోపమునకు గురియగుట ప్రమాదకరము. ఆ రాజు గజరాజయ్యెను. అతని అనుయాయులందరును కుంజర యూథమైరి. అతని పూర్వపుణ్యావిశేషముచే, విష్ణుభక్తిచే, నతడు కరియైనను ఉత్తమ సద్గతినే పొందెను.

ఆ. కర్మతంత్రుఁడగుచు కమలాక్షుఁ గొల్చుచు
నుభయనియతవృత్తి నుండెనేనిఁ
జెడును గర్మ మెల్ల శిథిలమై మెల్లన
ప్రబలమైన విష్ణుభక్తి సెడదు

రాజా! కర్మలు చేయుచుండ కర్మతంత్రుడైనను, శ్రీహరిని భక్తిశ్రద్ధలచే కొలుచుచు, కర్మ, భక్తి ఉభయనిష్ఠలను ఆచరించుచున్నచో సాధకుని

కర్మమంతయు క్రమముగ శిథిలమై నశించును. కాని ప్రబలమైన విష్ణుభక్తి మాత్రము నశింపదు.

క. చెడుఁ గరులు హరులు ధనములుఁ
జెడుదురు నిజసతులు సుతులుఁ జెడుచెనఁటులకున్
జెడక మనువెలసుగుణులకుఁ
జెడని పదార్థములు విష్ణుసేవానిరతుల్

రాజా! బుద్ధిహీనులకు (దుష్టులకు) ఏనుగులు గుఱ్ఱములు, ఇతర ధనసంపదలు ఎన్నియున్నను నశించును. నిజసతులు, సుతులు కూడ నశింతురు. కాని, సంపూర్ణ సుగుణవంతునకు (నిష్కారణముగ) ఏమియును నశింపవు. ఈ నశించు ప్రపంచములో నశింపనివి కేవలము విష్ణుసేవా నిరతులు మాత్రమే.

భక్తరక్షణ కార్యము ముగిసిన పిమ్మట ఆ పరమేశ్వరుని దృష్టి జగజ్జననియైన లక్ష్మీదేవివైపు మరలి, ఆమెతో నిట్లు పరిహాసమాడెను:

క. బాలా నావెనువెంటను
హేలన్ వినువీధినుండి యే తెంచుచు నీ
చేలాంచలంబుఁ బట్టుట
కాలో నేమంటి నన్ను నంభోజముఖీ

బాలా! నీపైట చెంగును చేతితో పట్టుకొని, విడువకుండ ఆకాశమార్గాన నేను విలాసముగా వెళ్లిపోవుచుండ, నీవు నా వెంట పరుగెత్తుకొంటూ వచ్చుచున్నప్పుడు నీవు నా గురించి ఏమనుకొంటివో కదా, పద్మవదనా! అని పలికిన, అరవింద మందిర యగు నా యిందిరాదేవి మందస్మిత వదనారవింద యగుచు ముకుందునకిట్లనెను:

క. దేవా దేవరయడుగులు
భావంబున నిలిపి కొలుచుపని నాపని గా
కో వల్లభ యే మనియెద
నీవెంటను వచ్చుచుంటి నిఖిలాధిపతీ

ఓ దేవా! నీ యడుగులనే (పాదపద్మములనే) నా చిత్తమునందు నిలుపుకొని కొలుచుట నా ధర్మముకాదా ప్రాణేశా! నేను నిన్నేమనగలను సర్వేశ్వరా! మఱియు

క. దీనుల కుయ్యాలింపను
దీనుల రక్షింప మేలు దీవనఁ బొందన్
దీనావన నీ కొప్పును
దీనపరాధీన దేవదేవ మహేశా

ఓ ప్రభూ! దీనపరాధీనా! దీనులయొక్క మొఱలనాలకించుటకును, వారిని రక్షింపుటకును, వారి స్తుతులను పొందుటకును, ఓ దీనావనా! నీకే తగియున్నది కదా! ఓ దేవదేవా! మహేశ్వరా!

శ్రీదేవియొక్క సముచిత సంభాషణములకు సంతసించిన శ్రీహరి, ఆమెను మందహాస పూర్వకముగ, ప్రేమతో నాలింగనము చేసుకొని, సపరివారముగ, గంధర్వసిద్ధ విబుధగణములు స్తుతించుచుండగ శ్రీమన్నారాయణుడు గరుడారూఢుడై నిజధామమునకు వెడలెను. అని చెప్పి శుకయోగీంద్రు డిట్లనెను :

సీ. నరనాథ నీకును నాచేత వివరింపఁబడిన యీ కృష్ణానుభావమైన
గజరాజమోక్షణకథ వినువారికి యశము లిచ్చును గల్మషాపహంబు
దుస్స్వప్న నాశంబు దుఃఖసంహారంబు ప్రొద్దున మేల్కాంచి పూతవృత్తి
నిత్యంబుఁ బఠియించు నిర్మలాత్మకులైన విప్రులకును బహువిభవ మమరు

తే. సంపదలు గల్గుఁ బీడలు శాంతిఁ బొందు
సుఖము సిద్ధించు వర్ధిల్లు శోభనములు
మోక్ష మఱచేతిదై యుండు ముదము సేరు
ననుచు విష్ణుండు ప్రీతుఁడై యానతిచ్చె

(శ్రీశుకుడిట్లు చెప్పెను:) నరనాథా! మహావిష్ణువు నిజధామమునకు మరలిపోవు నప్పుడిట్లు చెప్పెను. ఈ గజరాజ మోక్షణకథ, వినువారికి కీర్తినిచ్చును, కల్మషమును హరించును, దుస్స్వప్నములు నివారించును, దుఃఖమును తొలగించును. ప్రాతఃకాలమున మేల్కొని పుణ్యాకర్మలు చేసుకొని

నిత్యము పఠించు నిర్మలాత్ములకు అనేకమైన వైభవములు కలుగును, సంపదలు కలుగును, పీడలు శాంతించును, సుఖము సిద్ధించును, శోభనములు వర్ధిల్లును, సంతోషము కలుగును మోక్షము సిద్ధించును. మఱియును, ఎవ్వరైనను వేకువజామున మేల్కొని, నిశ్చలమనస్కులై - శ్వేతద్వీపమును, నాకు ప్రియమైన సుధాసాగరమును, మేరుపర్వతమును, ఆ పర్వత గుహలను, వనములను, లతా, కుంజ, దేవతా వృక్షములను, నేనును బ్రహ్మ శివులును నివసించు పర్వత శిఖరములను, సుదర్శన పాంచజన్య కౌమోదకి, కౌస్తుభములను, శ్రీదేవిని, శేష, వాసుకి, గరుడులను, ప్రహ్లాద నారదాది భక్తులను, ఋషులను, మత్స్య కూర్మ వరాహాద్యవతారములను, ఆ యవతార కార్యములను, సూర్యచంద్రాగ్నులను, ప్రణవమును, వేదవేదాంగ, శాస్త్రములను,ధర్మ తపః సత్యములను, గో, బ్రాహ్మణ, సాధు, పతివ్రతా జనములను, గౌరీ, గంగా, సరస్వతీ, కాళిందీ సునందాదిప్రముఖ నదులను, దేవతలను, కల్పవృక్షములను, ఐరావతమును, అమృతమును, ధృవుని, బ్రహ్మర్షి సముదాయమును, పుణ్యమూర్తులైన మానవులను, నిశ్చలచిత్తులై స్మరించువారికి, ప్రాణావసానకాలమందు నా యొక్క నిర్మల పవిత్ర స్థితిని అనుగ్రహించెదను' - అని శ్రీహరి నిర్దేశించి, శంఖము పూరించి, పక్షిరాజైన గరుడునిపై నెక్కి నిష్క్రమించెను. బుద్ధిమంతులందరు జయజయ ధ్వనులు చేసిరి. అని శుకయోగి పరీక్షిత్తునకు చెప్పి మరల ఇట్లనెను:

క. *గజరాజమోక్షణంబును*
*నిజముగఁ బఠియించునట్టి నియతాత్ములకున్*
*గజరాజవరదుఁ డిచ్చును*
*గజతురగస్యందనములుఁ గైవల్యంబున్*

ఈ గజేంద్ర మోక్షణకథను శ్రద్ధగ పఠించునట్టి నిష్ఠాపరులకు కరిరాజవరదుడు (శ్రీహరి) రథగజతురగాది సకలసంపదలే కాక కైవల్యమును కూడ ప్రసాదించును.

*గజేంద్రమోక్షణ కథ సమాప్తము*
*హరిః ఓం తత్ సత్*

❖ ❖ ❖

# 3. వామనచరిత్ర

పరీక్షిన్మహారాజు అడిగిన ప్రశ్నకు బదులుగ శుకయోగీంద్రుడిట్లు చెప్పెను. రాజేంద్రా! మనువులు, మునులు, మనుపుత్రులు, ఇంద్రులు, దేవతలు, అందరును ఆ శ్రీహరి యాజ్ఞ ప్రకారము నడచెదరు. వారు విష్ణు తేజోంశసంభూతులు. హరియొక్క సహాయశక్తులను పొంది జగముల నడుపుదురు. నాల్గు యుగములనంతరము కాలముచే కబళింపబడిన వేదములను మునుపటివలె ఋషులు తమతమ తపోబలముచే మరల దర్శింతురు. ధర్మము మరల నాలుగు పాదములను కలిగి వర్తించును, మనువులు మహావిష్ణువు ఆజ్ఞల ప్రవర్తించెదరు, రాజులు భూమిని విభజించి తమతమ కాలములలో నేలుదురు. మఱియు, వారి వారి ప్రాప్తముల ప్రకారము దేవతలకు ఇంద్రాది పదవులను శ్రీహరి యిచ్చును, వారు, విహితకర్మలచే మూడులోకములను పరిపాలించెదరు. లోకములు సుభిక్షముగ నుండును. ఆ లోకములలో శ్రీహరి, యోగీశ్వరుని రూపమున యోగము దెల్పును, మునిరూపమున కర్మమార్గమును దెల్పును, ప్రజాపతి రూపమున సృష్టిని గావించును, ఇంద్రుడై యసురుల మదమణచును, సిద్ధుని రూపమున జ్ఞానము బోధించును, కాలరూపమున నాశనము చేయును, నానావిధాకార నామరూపులలో వెలసినను జ్ఞానములేని కర్మిష్ఠులకు కానబడడు. భూత భవిష్య వర్తమాన మూడు కాలముల యందును, అవ్యయుడైన విష్ణువు యనేక రూపములతో వివిధ కార్యములలోను ప్రవృత్తుడైయుండును. అని చెప్పగా రాజిట్లడిగెను : మునీంద్రా!

విష్ణువు బలిచక్రవర్తిని, యెందుకొఱకు మూడడుగుల నేలను యాచించెను? ఆయన పరిపూర్ణుడు, లక్ష్మీపతి, నిశ్చలుడు, కోరికలు లేనివాడు, అయి యుండియు, ఒక దీనునివలె వెళ్ళి కొద్దిపాటి నేల గురించి యాచింపనేల, మఱి, తప్పేమియు చేయని, నిర్మలుడైన బలిని బంధించెనేలకో, వినుటకు మిక్కిలి కుతూహలముగ నున్నది. చెప్పుడు. అనిన శుకయోగిట్లు చెప్పెను:

రాజా! దేవాసుర సంగ్రామములో బలి, యింద్రునిచేత బాగుగ దెబ్బతిని ఓడిపోయి, పారిపోయి, శుక్రాచార్యులచే బ్రతికింపబడి, అతిభక్తి శ్రద్ధలతో నాతని

శిష్యుడై గురువులను మెప్పింపగా, యా గురువులు సంతసించి, అతనిచే విశ్వజిత్ యాగమును శాస్త్రోక్తముగ చేయించిరి. అప్పుడు హోమగుండము నుండి, అగ్నిహోత్రుడు, బంగారు రథమును, సూర్యాశ్వముల వంటి గుఱ్ఱములు, సింహధ్వజము, దివ్యధనుస్సు రెండు పూర్ణ తూణీరములు, కవచమును బహూకరించెను. వాడిపోని పద్మమాలను తాత యిచ్చెను, చంద్రకాంతి వంటి శంఖమును శుక్రాచార్యుడిచ్చెను.

క. పాణియు రథియుఁ గృపాణియుఁ
తూణియు ధన్వియును స్రగ్వి తురగియు దేహ
త్రాణియు ధిక్కృతవిమత
ప్రాణియు మణికనకవలయపాణియు నగుచున్

రథమునెక్కినవాడును, ఖడ్గమును ధరించినవాడును, అమ్ములపొదులను ధరించినవాడును, శంఖమును చేతబట్టినవాడును, దేవతలచే నిగ్రహింపబడిన వాడును, మణిమయ కనక హారములను ధరించినవాడును, అయిన యా బలిదైత్యేంద్రుడు.

బ్రాహ్మణులకు పెక్కు దానములనిచ్చి వారి శుభాశీస్సులను పొంది పెద్దలకు మ్రొక్కి ప్రత్యేకమైన ఇష్టదైవములను అంతరంగమున పూజించి, పవిత్రుడైన ప్రహ్లాదునికి వినమ్రుడై నమస్కరించి, రథరాజము నెక్కి ఆ దానవరాజు పర్వత శిఖరముపై ప్రజ్వలించు దావాగ్నివలె తేజస్సుతో వెలిగిపోవుచుండెను.

అణచబడిన యమభటాదులు, పీడింపబడిన సురసిద్ధసాధ్య గంధర్వాదులు, లొంగదీయబడిన దిక్పాలకులు, అసురనాయకులు, హితులు, ఆ దానవరాజును కొలవగా, చూపులతోనే ఆకాశమును ఆక్రమించి, భూలోక స్వర్గలోకములను తల్లక్రిందులు చేయుచు, ఆక్రమించుచు, ఆ దానవేంద్రుడు దేవతానగరముపైకి దారితీసెను. ఇట్లు బలవంతుడైన బలి, ఇంద్రుని జయింప సమకట్టి, దండయాత్ర చేయుటకై పోయి, పోయి,

పుణ్యజనులుండు లోకమును, రోగములు, స్వప్నపీడలు, అన్నఖాద్యముల వలన కలుగు దుఃఖములు లేని లోకమును, ఫలపుష్పాదులతో నిండియున్న

వృక్షములను ఎత్తుగా నెగురుచున్న పతాకమును, మిక్కుటముగ సంచరించు విమాన సమూహమును పవిత్రజలములతో నున్న నదులను, ఇంద్రునితో గూడియున్న స్వర్గలోకమును, గాంచెను.

ఆ రాక్షసరాజు అట్లు పోయి, ఆ స్వర్గలోకపు శోభను తిలకించి ఆశ్చర్య పోయెను. వృక్షములు మొగ్గలతోను పుష్పములతోనూ పిందెలు, కాయలు, పండ్లతోను మోయలేక తలలు వంచుకొనియున్నవి. జుమ్మని ఎగురుచు, పుష్పతేనెలను కడుపునిండ పీల్చుకొని ఎగురలేక సాటి తేటులతో సమావేశమగు తుమ్మెదలతోను, సమృద్ధిగ లభించు చిగురుటాకులను మేయలేక గొంతెత్తి కూయలేని కోయిల సమూహములతోను, వివిధమైన స్వరములతో కూయు చిలుకలు, పావురములతోను, కొలనులందలి తామరలను చించి త్రుంచి, కర్ణికలను తూడులను యారగించు హంసలను, గాలికి గర్వముగ తలల నాడించుచు, ఇందిరామందిరములనబడు కలువలతో నిండియున్న సరస్సులను, గాలికి ఎగసి, గగనములనంటెడి, పలువర్ణముల పుష్పపరాగ ములను, పచ్చని గఱిక చిగుళ్లను మేయుచు, నెమరువేయుచు, పొదుగులు నింపుకొని, దూడల క్రీడలను వీక్షించుచు ఇళ్లకు చేరి అమృతమును కురిపించు కామధేనువులను, కామధేనువులకు నీడలనిచ్చుచు, అడిగినవారి కోర్కెలను దీర్చుచు ధనములను కురిపించు కల్పతరువులను, కల్పతరువుల కొమ్మలను విరుచుచు, గున్నలను మేపుచు, సుందరీమణులకు గజగమనము నేర్పుచున్నవా యనిపించునట్లు విహార పర్వతములకు నడచిపోవు యేనుగులను, అందముగ నలంకరింపబడిన మకరతోరణ స్తంభములను, స్తంభములవద్ద నిల్చొనియున్న మెఱుపుతీగలవంటి చూపులతో మోహింప జేయునట్టి, విమానములలో వచ్చు సత్‌చరిత్రులను ఆహ్వానించుటకు నియమింపబడినట్టి అప్సరసలను, ఆకాశమున కెగసి క్రిందికి ప్రవహించు గంగను, గంగయందలి తేట నీటిలో జల్లులాట లాడుకొను దివ్య కన్యకలను, పెద్దపెద్ద అరుగులు గోపురములు, కవాటములు గల భవనములను, నవరత్నములు పొదగబడిన కవాటములను, ఇంద్రనీల గంభీర స్తంభములను, భటులచేతను ద్వారపాలకులచేతను కాపలాకాయబడిన అంగళ్లను, కాలక్షేపముకొఱకు, దేవదానవ యుద్ధ గాథలను ముచ్చటించుకొను రక్షకభటులను, గొప్ప ఎత్తైన, శుద్ధస్ఫటిక సుకుమార

సోపానము రజత దీపస్తంభములతో వెలిగింపబడిన అగడ్తలను, ఆ అగడ్తల ప్రక్కన ఎత్తైన వజ్రపు గోడలు, తారకలనంటు శిఖరములు, చంద్రకాంత శిలల నేలలతో, బంగారు జలతారు తెరలతో ఎత్తైన ప్రాకారములతో శోభిల్లు సౌధములను, శత్రుసేనలను హతమార్చగల ఫిరంగులు, రథములు, రమణులతో నిండిన రాజసౌధములు, కర్పూర కుంకుమ అగరుధూపములతో నిండిన గదులను, ఆ ధూపముల జూచి మేఘములని భ్రమపడి నృత్యము చేయు నెమళ్లను, వీరభటుల సమూహములను, రథములను, అశ్వములను, ఆహ్లాదకరమైన వీధులతో నున్న రాజమార్గములను, వాయువేగ మనోవేగములతో నెచ్చటికైనను ఎగురగల విమానములను, విమానవిహారము చేయు సుందర సుందరీమణులుంచుకున్న భేరీ, వీణా, పణవ, మృదంగ, శంఖాది వాద్యవిశేషములను, అశోక, పున్నాగ కదళీ వృక్షాదులతో కూడిన సుందర ఉద్యానవనములతో శోభిల్లుచుండు అమరావతీ నగరమును గాంచి బలిదైత్యేంద్రుడు దేవనగరిచుట్టును సేనలను పెట్టి, మార్గములనరికట్టి, సావధానముగ నుండెను.

ఈ అమరావతిలోని స్త్రీ జనమెన్నడు కళావిహీనులు కారు, చిరునవ్వును వీడరు, కాలవశులై చనిపోవరు, ముసలితనము నొందరు, దుష్టులదరిజేరరు, పుణ్యాత్ముల సాంగత్యమును విడిచిపెట్టరు. అట్టితరి,

దానవుల శంఖములనుండి వెలువడిన భయంకర ధ్వనులు దేవనగరిని నింపివేయుగా, దేవతాస్త్రీల గర్భములు పగిలి, యందలి బిడ్డలావురావురని ఆక్రోశించిరి.

అంతట, బలిదానవుడు అమరావతిని ముట్టడించుటను తెలుసుకొని, కోటకు గట్టిగా రక్షణ ఏర్పాటుచేసి, దేవేంద్రుడు, దేవవీరులను సమావేశపరచి, దేవగురువైన బృహస్పతిని రావించి యిట్లనెను : ఈ బలిదైత్యుడు మనపై దండెత్తి వచ్చినాడు. ప్రళయకాల దావాగ్నివలె వెలుగుచున్నాడు. ఘోరరాక్షసులతో గూడివచ్చినాడు. ఇదివరకు మనచే ఓడింపబడి పారిపోయిన వాడిప్పుడు తిరిగివచ్చెను. వీనికి ఏ తపస్సువలన ఇంత శక్తి వచ్చెనో మరి! ఈ దురాత్మునకు ఎవ్వడు తోడయ్యెనో! ఇప్పుడు వీనిని గెల్చుటెట్లు? ఏమి

చేయుదము? మనకు శక్తి యెక్కడున్నది? వీని నెదుర్కొనుటకెవ్వరికి సాధ్యపడును?

వీడు ఆకాశమునే మ్రింగివేయునట్లున్నాడు. అమరాద్రికంటెను పొడవెదిగి పోయి నట్లున్నాడు. కాలాంతకునివలె మ్రింగివేయునట్లున్నాడు. మనము వెనుదిరిగినచో బ్రహ్మదేవునికూడ ఓడించునట్లున్నాడు.

వీనికి రాజ్యమెన్నటికిని ఇవ్వరాదు. వీనితో యుద్ధము చేయుటకు పోరాదు. పోయినచో గెలువకుండ తిరిగి రారాదు. ఈ దానవునిచేత నిక నోడిపోరాదు. మహాత్మా! గురువర్యా! మార్గాంతర మేమిటో తెలపిండు.

అనిన సురేంద్రునకు ఆచార్యుడిట్లు చెప్పెను:

దేవేంద్రా! వినుము. ఈ దానవున కింతటి శక్తిసంపదలు బ్రహ్మవేత్తలైన భృగుశ్రేష్ఠులిప్పించిరి. వీనినిప్పుడెదిరించుటకు గాని వారించుటకుగాని, యీశ్వరుడైన హరికి తప్ప నీకుగాని, నీ సములకుగాని అధికులకుగాని, అన్యులకెవ్వరికిని సాధ్యపడదు. ఇంతవరకు 'నీవనుభవించిన రాజ్యము చాలు. నీవీ దేవలోకమును ప్రస్తుతమునకు విడిచిపోవుటయే కర్తవ్యము. శత్రువు బలహీనుడగు సమయముచూచి, మరలివచ్చి జయించుట మేలని నా మతము. బ్రాహ్మణులచే వీని కీ బలమువచ్చినది. వారియెడల శ్రద్ధ తగ్గినంతనే వీనిశక్తి చెడును. అంతవరకు నీవు శత్రువుగురించి తలంచకుండ వేచియుండుము. శత్రువును గెలువవలెను. కానిచో, తీవ్రముగ పోరవలెను. కానిచో చావవలెను. జయించుటగాని మరణించుటగాని కుదరనప్పుడు, సరసముగ ముందే తొలగి పారిపోవలెను. సుమా!

అని బృహస్పతి చెప్పగా, దేవతలు కామరూపులై (ఇచ్ఛారూపులై) దేవలోకమును విడిచి, తమకు లభించినచోట్లకు వెడలిపోయిరి. ఎదిరించువారు లేని కారణమున బలి, దేవరాజధానియైన అమరావతి నాక్రమించి, మూడు లోకములను తనవశము చేసికొని, విశ్వవిజయుడై చాలాకాలము రాజ్యమేలుచుండెను. గురువులైన భృగ్వాదులతనిచే నూరు అశ్వమేధ యాగములు చేయించిరి. అప్పుడా అసురచక్రవర్తి రాజ్యములో కోరుకొను వారే లేకపోయిరి. దానములిచ్చి చెడినవారెవ్వరును లేరైరి. సకల కామ్యకర్మ

క్రతువులు ఫలించెడివి. విరోధులు లేరు. దేవాలయములు మహోత్సవములను నిర్వహించెడివి. పూర్ణకాములైన బ్రాహ్మణులు ఏ కాలమున ఏ యాగములు చేయనగునో వానిని చేయుచు, వర్షములు కురిపించుచు, భూమిని సుసంపన్నము చేయగ భూమి సకలార్థముల నిచ్చుచుండెను ఆ అసురేంద్రుని రాజ్యపాలనమప్పుడు.

అంత, నొకనాడు, సురమాతయైన అదితి, తన పుత్రుల స్థానమును దనుజులు లాక్కొనుటచే, వారు ఎక్కడికో పోయి తలదాచుకొనుటను భరించలేక అనాథవలె శోకించుచుండగా నామె భర్తయైన కశ్యపప్రజాపతి సమాధిని చాలించి, అదితి గృహమునకు వచ్చి, ఆమె యొక్క సేవా సపర్యలను పొంది, ఆమె యొక్క కృశించియున్న దీనవదనమును, అశ్రుధారలను చూచి, నగచి, బుజ్జగించి, శోకకారణమడిగెను.

"ఓ పుణ్యశీలా! నీ యొక్క యీ దైన్యతకు కారణమేమిటి? బ్రాహ్మణులు సరిగా ఆదరింపబడి సంతుష్టులై యుండిరా? దేవతార్చనాదులన్నీ సక్రమముగ జరిగినవా? గృహస్థులు సకాలమున సక్రమముగ హోమాదిక్రతువులు చేసిరా? పుత్రులు ధర్మానుష్ఠాన పరులైయుంటిరా? అభ్యాగతులకు సరిగా అన్నపానము లివ్వబడినవా? యాచకులకు సేవకులకు సుజనులకు గౌరవాదరము లివ్వబడినవా? ఓ దేవమాతా! అన్నమైనను జలమైనను, పైకమైనను, శాకమైనను (కూరలైనను) తనకు జరుగునంతవరకు అతిథి జనులకు లేదనకుండ ఇవ్వనివారు, కలిగియున్నవారైనను, లేనివారే సుమా!

వనితా! విష్ణువునకును, సకల దేవతలకును అగ్నిదేవుడు, బ్రాహ్మణులే నోరు (వారి ద్వారానే అర్పణలు దేవతలచే నారగింపబడును గనుక) వారు సంతృప్తులైనచో శ్రీహరిసంతృప్తుడగును. శ్రీహరి సంతృప్తుడైన జగములన్నియు సంతృప్తులగును.

ప్రియసతీ! నీ బిడ్డలు నీతో వక్రముగ మాటాడుటకు భయపడుదురా! నీ కోడండ్రు నీతో ఎదురుప్రశ్నలు వేయక సౌమ్యముగ ప్రవర్తించెదరా? నీకు నీయింట నీమాటకు అడ్డము కలుగుచున్నదా? అనిన విని అదితి యిట్లనెను:

హృదయేశ్వరా! ఇంచుకైనను ప్రేమలేనివారై, దితి బిడ్డలు, మనుమలు, మహాభయంకర బలాఢ్యులై, నా బిడ్డలందరిని త్రోలివేసి, దుస్సాహసముతో అమరావతి నేలుచుండిరి. నా వారి బాధలను నీకేమని విన్నవింతును, మేలుదలంచి చూడుము. మేము అక్కాచెల్లెండ్రమైనను, దితి నాతోటి వైరము మానదు సరికదా రక్కసులు సురలను మొత్తుచుండగ, అక్కటా! మొత్తవద్దని తనవారిని వారింపదు. చూచుచు భళిభళియని ఆమోదించును.

సీ. ఎండకన్నెఱుఁగని యింద్రునియిల్లాలు పలుపంచలను జాలిఁబడియె నేఁడు
త్రిభువనసామ్రాజ్యవిభవంబుఁ గోల్పోయి దేవేంద్రుఁ డడవులఁ దిరిగె నేఁడు
గలిమి గారాబుబిడ్డలు జయంతాదులు శబరార్భకులవెంటఁ జనిరి నేఁడు
నమరుల కాధారమగు నమరావతి యసురుల కాటపట్టయ్యె నేఁడు

ఆ. బలి జగముల నెల్ల బలియుచు నున్నాఁడు
వాని గెలువరాదు వాసవునకు
యాగభాగ మెల్ల నతఁ డాహరించుచుఁ
గడఁగి సురల కొక్కకడియు నీఁడు

నాథా! అంతఃపురమునుండి యెన్నడును బయటకు వచ్చియుండని యింద్రసతి, జాలిగా పలుపంచలలో తలదాచుకుంటున్నది. ముల్లోకముల సామ్రాజ్య వైభవమును పోగొట్టుకొని, దేవేంద్రుడు అడవుల పాలయ్యెను. ఐశ్వర్యముతో తులతూగుచుండెడి యింద్రసంతతి వారైన జయంతాదులు అడవులలో శబరబాలురతో తిరుగుచున్నారు. అమరుల స్థానమైన అమరావతి యిప్పుడసురులకు ఆటపట్టయి పోయినది. బలి యిప్పుడన్ని జగముల నేలుచు, నింకను శక్తివంతుడయ్యెను. వానినిప్పు డింద్రుడు గెలవలేడు. దేవతలకు చెందిన యజ్ఞహవిర్భాగములను బలియే ఆరగించుచు దేవతల కేమియు నిచ్చుటలేదు.

మహాత్మా! నీవు ప్రజలందరిపట్లను సముడవు. ప్రజలను కన్న బ్రహ్మవు నీవు. ప్రజలలోని దుష్టులను నీవు శిక్షింపవలెను కదా! స్వామీ!

స్వామీ! దేవతలను, ప్రజలను, ఆర్తిలోనున్నవారిని, మునులను, వారి

శోకమును బాపి దేవరాజధానిని రక్షించి, రాక్షసులను శిక్షించునట్టి సత్కార్యము నే రీతిని, ఏ ఉపాయముచే చేయునగునో ఆ విధమును శీఘ్రముగ నాలోచించవలసినదిగా వేడుచున్నాను, ఓ కల్యాణ సంధాయకా! నీ యొక్క కరుణాకటాక్షమును ప్రవహింపజేయుము.

అనిన ధర్మపత్ని వాక్కులను విని, క్షణకాలము యోచించి, చేయగల కార్యమును విచారించి కశ్యపబ్రహ్మ యిట్లనెను :

మ. జనకుం డెవ్వఁడు జాతుఁ డెవ్వఁడు జవస్థానంబు లెచ్చోటు సం
జననం బెయ్యది మేను లే కొలఁది సంసారంబు లే రూపముల్
వినుమా యంతయు విష్ణుమాయ దలఁపన్ వే ఱేమియున్ లేదు మో
హనిబంధంబు నిధాన మింతటికి జాయా విన్నఁబో నేటికిన్.

దేవీ! నీకెందుకీ యావేదన? జీవునికి తండ్రి యెవ్వడు, తనయుడెవ్వడు? (అనేకమైన జన్మలలో ననేకమైన తండ్రులుందురుకదా!) వాని జన్మస్థాన మెక్కడున్నది? జననమనగా నేమిటి? ఈ శరీరము లేపాటివి? (ఎన్నాళ్లుండునవి?). ఈ సంసారముల యొక్క వాస్తవ స్వరూపములెట్టివి? వినుము. బాగుగ యోచించినచో, నిదియంతయు విష్ణుమాయ, తప్ప వేఱేమియును లేదు. కేవలము మోహబంధనమే యీ మమకారమున కాధారము. కావున ఓ సతీమణీ! నీవీ విషయమున ఖిన్నురాలవనేల?

అయినను, కాలోచితమైన కార్యమును చెప్పెద విని, ఆచరింపుము: భగవంతుడు, పరమాత్ముడు, జనార్దనుడు, కృపాపూర్ణుడు, సర్వాత్మకుడు, జగదీశుడు, అయిన శ్రీహరిని సేవింపుము. అతడు సంతుష్టిని పొంది, నీ యొక్క ఇష్టకామ్యార్థములన్నిటిని అనుగ్రహించును. నీకు సకలార్థములు చేకూరును. భగవత్సేవచే బహుసౌభాగ్యములు పొందవచ్చును కదా! ప్రేయసీ!

అనిన ఆమె యిట్లనెను : స్వామీ! పరమేశ్వరుడైన నారాయణుని నేను ఏ విధముగా ధ్యానించవలెను, ఏ మంత్రమును జపింపవలెను, ఆ విధానము లెట్టివి, ఎంతకాల మారాధింపవలెను? నాకు తెలవిండు. అనగా ఆ కశ్యపప్రజాపతి భార్యకు పయోభక్షణము అను వ్రతమునుపదేశించి, ఆ

మంత్రమును, విధానమును, ఉపవాస భోజనాది నియమములను తెలియజేసెను. అదితి, ఫాల్గుణమాస శుక్లపక్ష ప్రథమ దివసమునుండి పండ్రెండు దినములు శ్రీహరి సమర్పణముగ వ్రతముచేసి, వ్రతాంతమున నియమ నిష్ఠలతో నుండగా, శ్రీమన్నారాయణుడు చతుర్బాహుడై పీతవస్త్రధారియై శంఖచక్ర గదాధారియై ప్రత్యక్షమనగా నామె చూచి, కన్నులనుండి రాలిన సంతోషాశ్రువులు చన్నులను తడుపగా, శరీరము పులకాంకితమవగా, ఉత్తమరీతిని నమస్కారములు స్తుతులు చేసి చేతులు జోడించి నుదుట నిడుకొని, చూపులతో శ్రీపతి రూపమును తనివితీరక త్రావిత్రావి, హర్షముప్పొంగగ, మందమధురా లాపములతో లక్ష్మీనాథుని, యిట్లు స్తుతించెను.

సీ. యజ్ఞేశ విశ్వంభరాచ్యుత శ్రవణమంగళనామధేయ లోకస్వరూప
యాపన్నభక్తజనార్తివిఖండన దీనలో కాధార తీర్థపాద
విశ్వోద్భవస్థితివిలయ కారణభూత సంతతానంద శశ్వద్విలాస
యాయువు దేహంబు ననుపమలక్ష్మియు వసుధయు దివముఁ ద్రివర్గములును

తే. వైదికజ్ఞానయు క్తియు వైరిజయము
నిన్నుఁ గొలువని నరులకు నెఱయఁగలదె.
వినుతమందార గుణహార వేదసార
ప్రణుతవత్సల పద్మాక్ష పరమపురుష

ఓ యజ్ఞేశ్వరా! (యజ్ఞపురుషా)! విశ్వంభరా! (విశ్వమంతట నిండియున్న వాడా) అచ్యుతా! శ్రవణమాత్రమున మంగళము కలిగించు నామము గలవాడా! లోకమే నీ స్వరూపమై యున్నవాడా! ఆపన్నులైన భక్తజనుల ఆర్తిని హరించువాడా! దీనజనులకు ఆధారమైనవాడా! పదమే (పాదజలమే) తీర్థమైనవాడా! విశ్వముయొక్క సృష్టిస్థితి లయములకు కారణభూతమైనవాడా! నిత్యానందుడా! శాశ్వతలీలా విలాసుడా! నిన్ను భక్తితో కొలుచువారికి ఆయుస్సు, దేహారోగ్యము, ఐశ్వర్యము, ఇహము, పరము, ధర్మార్థకామములు, వేదవిజ్ఞానము, యుక్తి శత్రు విజయము, అన్నీ సిద్ధిస్తాయి కదా! (నిన్ను కొలవని

వారికి ఇవియేవియైన లభించునా?) ఓ భక్తమందారా! సుగుణభూషణా! వేదస్వరూపా! శరణాగత వత్సలా! పద్మాక్షా! పరమపురుషా! అని స్తుతించి, మఱల నామె యిట్లనెను:

ఆ. అసురవరులు సురల నదలించి బెదరించి
నాక మేలుచున్న నాఁటినుండి
కన్న కడుపుగాన కంటఁ గూరుకు రాదు
కడుపుఁబొక్కు మాన్పి కావవయ్య.

ప్రభూ! ఈ యసురులు స్వర్గము నాక్రమించి యేలుచున్నప్పటినుండి, దేవతలను అదరించి, బెదరించి, నానాబాధలు పెట్టుచుండిరి. కన్న కడుపు గావున, నా కంటికి ఒక్క కునుకైనను పట్టుటలేదు నా కడుపుమంటను మాన్పి మమ్ములను కాపాడుమయ్య!

అనిన విని, ఆ యాశ్రిత వత్సలుడైన పరమేశ్వరుడు మందహాసముతో నిట్లనెను: ఓ దేవమాతా! నీవు, నీ నాధుడు, నీ పుత్రులు, కోడండ్రు, నన్ను స్తుతించుటచే, నే సంతసించి, దేవతలు వారిసతులును, సుఖించుటకునై, నేను రాక్షసులను శిక్షించి శోకింపజేయుటకునై, నీ గర్భవాసమున తేజోమూర్తినై జన్మించెదను. నీ సుతునిగా నుండి, వర్తించుటకు నాకును వేడుకగ మున్నది.

మ. బలిమిన్ దైత్యులఁ జంపరాదు వినయోపాయంబునంగాని సం
చలనం బొందకు నేను నీనియతికిన్ సద్భక్తికిన్ మెచ్చితిన్
బలివిద్వేషియు నా నిలింపగణముం బౌలోమియున్ మెచ్చదై
త్యులరాజ్యంబు హరింతు నింద్రునికి నిత్తున్ దుఃఖ మిం కేటికిన్

అదితీ! దానవుల నిప్పుడు బలప్రయోగముచే చంపవలను పడదు. వినయముతోను, ఉపాయముచేతను మాత్రమే వారిని సాధింపవచ్చును. కావుననీవు అలజడి చెందవలదు. నీ యొక్క నియమనిష్ఠలకు, సద్భక్తికి నేను సంతసించితిని. ఇంద్రుడు, ఇంద్రాణి, దేవగణములు మెచ్చునట్లుగా నేను దైత్యుల రాజ్యమును హరించి, ఇంద్రునకిచ్చెదను. ఇంక నీకు దుఃఖమెందులకు?

నీవు, నా రూపమును మనసులో నుంచుకొని, నీ పతిని సేవింపుము. నేను నీ గర్భమున ప్రవేశించెదను. నన్ను నీవు కరుణతోను ప్రేమతోను సాకుము.

క. ఏలింతు దివము సురలను
బాలింతు మహేంద్రయువతి భాగ్యశ్రీలన్
దూలింతు దానవుల ని
ర్మూలింతు రిపుప్రియాంగముల భూషణముల్

స్వర్గలోకమును మఱల దేవతలచే నేలించెదను. ఇంద్రాణి తిరిగి పూర్వపు సిరిసౌభాగ్యములు పొందునట్లు చేసెదను, దానవుల అంగములను, భూషణములను తొలగించి, వారిని నిర్మూలింతును అని చెప్పి, ఆ భక్తజన పరతంత్రుడైన పురుషోత్తముడు నిష్క్రమించెను. కృతకృత్యయైన దేవమాత మిక్కిలి సంతోషముతో పతిని సేవించుచుండెను. అప్పుడొక నాడు కశ్యపుడు ఘనసమాధినందుండగ శ్రీహరి అంశమతనియందు ప్రవేశించెను. అతడు తన వీర్యమును అదితి యందుంచెను. కశ్యపుని తపశ్శక్తిచే నిండిన ఆ వీర్యము అదితి గర్భమున దినదిన ప్రవర్ధమానమై నెలలు నిండవచ్చెను. జగములను తన కడుపున నిడుకొన్న జగన్నాథుడు, దేవమాత కడుపున నిముడుకొని బిడ్డడై పెరిగెను. అదితికి గర్భము దుర్భరమయ్యెను. అంగన లామెకు శుభమగుటకు విభూతిని నుదుటపెట్టిరి, గర్భమునకు రక్షను కట్టిరి.

అంతట చతుర్ముఖ బ్రహ్మ వచ్చి అదితి గర్భస్థుడైయున్న విశ్వగర్భునిట్లు స్తుతించెను.

సీ. త్రిభువనజయరూఢ దేవ త్రివిక్రమ పృథులాత్మ శిపివిష్ట పృశ్నిగర్భ
ప్రీతత్రినాభ త్రిపృష్ఠ జగంబుల కాద్యంతమధ్యంబు లరయ నీవ
జంగమస్థావరజననాది హేతువు నీవ కాలంబవై నిఖిల మాత్మ
లోపల ధరియింతు లోనిజంతులనెల్ల స్రోతంబులోఁ గొని సుందరతను

తే. బ్రహ్మలకు నెల్ల సంభవభవన మీవ
దివమునకుఁ బాసి దుర్దశ దిక్కు లేక

శోకవార్ధి మునింగిన సురల కెల్లఁ
దేల నాధారమగుచున్న తెప్ప వీవ

ఓ దేవా! త్రివిక్రమా, శిపివిష్ట, పృశ్నిగర్భ, ప్రీతత్రినాభా! త్రిపృష్ఠ త్రిభువనరూపా, సర్వవ్యాపీ, జగములకు నీవే ఆది మధ్యాంతములైన వాడా! స్థావర జంగమాదుల జన్మహేతువు నీవె, నీవె కాలమువై సర్వమును నీలోనే ధరింతువు. సర్వజీవులను లయమప్పుడు నీలోనికే తీసుకొను సుందరుడవు. బ్రహ్మలందరికి నీధామమె జన్మస్థలము. స్వర్గలోకమును పోగొట్టుకొని, దుర్దశలో, దిక్కుమాలిన వారై శోకసముద్రమున మునిగియున్న దేవతలకు తెప్పవంటి ఆధారమువు నీవు.

అదితిగర్భమునుండి శీఘ్రమే వెలువడి విచ్చేయుము మహాత్మా! చాలకాలమునుండి స్వేచ్ఛను పోగొట్టుకున్న దేవతలకు ఆనందమునందింప వలెను ప్రభూ! అని యిట్లు బ్రహ్మదేవుడు ప్రార్థింపగా:

మ. రవి మధ్యాహ్నమునం జరింప గ్రహతారాచంద్రభద్రస్థితిన్
శ్రవణద్వాదశినాఁడు శ్రోణ నభిజిత్సంజ్ఞాతలగ్నంబునన్
భువనాధీశుఁడు పుట్టె వామనగతిం బుణ్యావ్రతోపేతకున్
దివిజాధీశ్వరుమాతకుం బరమపాతివ్రత్యవిఖ్యాతకున్

శ్రావణ ద్వాదశీ అభిజిత్ నక్షత్ర శుభలగ్నమందు, గ్రహతార చంద్ర స్థితులు శుభప్రదముగ నుండగా, మధ్యాహ్న సమయమున జగదీశ్వరుడైన శ్రీహరి పుణ్యవ్రతోపేతయు, పరమ పతివ్రతయు, దేవేంద్రాదుల మాతయైన అదితికి వామనరూపుడై యుదయించెను. మఱియు, నా దేవుడు శంఖచక్ర గదాపద్మ ధారియైన చతుర్భుజుడును, మకరకుండల, కనక కంకణ, కౌస్తుభ, నూపుర, వనమాలా లంకృతుడును, సకలజన మనోహరుండును అయి, యవతరించెను.

శా. చింతం బాసిరి యక్షతార్క్ష్యసుమనస్సిద్ధోరగాధీశ్వరుల్
సంతోషించిరి సాధ్యచారణమునీశబ్రహ్మవిద్యాధరుల్
గాంతింజెందిరి భానుచంద్రములు రంగద్గీతవాద్యంబులన్
గంతుల్ వైచిరి మింటఁ గింపురుషులున్ గంధర్వులుం గిన్నరుల్

శ్రీహరి యవతరించిన కారణముచే యక్షులు, తార్క్ష్యులు, సిద్ధులు, సుమనులు, సర్పరాజములు చింతను పోగొట్టుకొనిరి, సాధ్యులు, చారణులు, మునులు, బ్రహ్మవేత్తలు, విద్యాధరులు సంతోషించిరి, సూర్యచంద్రులధిక కాంతితో ప్రకాశించిరి, కింపురుషులు, గంధర్వులు కిన్నరులు, వినువీధులలో నృత్యగీత వాద్యములతో గంతులువేసిరి.

దిక్కులలో మబ్బులు విరిసెను; సముద్రములు నిర్మలత నొందెను. ధరణి వాస్తవముగ నిలకడ పొందెను. తారల గమనము బ్రాహ్మణులకు అనుకూలమయ్యెను.

పుష్పవృష్టులు వెల్లువలై కురిసెను; గాలులు పుష్పమధువులను తుంపరలుగ జల్లులు కురిపించెను, పుష్పపరాగములతో భూమి నిండిపోయెను.

అంతట, ఈ మహానుభావుడింతకాలము నా ఉదరములో నెట్లు ఇమిడి యుండగలిగెనో కదా యని యాశ్చర్యపోవుచుండగ, కశ్యపుడు ఆనందాతిశయముతో జయజయధ్వనులు చేయుచు స్తుతించుచుండగ, ఆ యద్భుత ప్రభువు తన సాయుధ, అలంకృత రూపమును విడిచి, మాయావటునిగ మారి, ఉపనయన వయస్కునిగ కనిపించుచు, తల్లిచెంత బాలాలాపనలాడుచు, క్రీడించుచుండ, నా తల్లి పరవశించి పోయి యిట్లనెను:

ఆ. నన్నుఁ గన్న తండ్రి నాపాలిదైవమ
నా తపఃఫలంబ నా కుమార
నాదు చిన్నవడుగ నా కులదీపక
రాఁగదయ్య భాగ్య రాశివగుచు

నాయనా! నన్ను గన్నతండ్రీ, నా పాలిదైవమా, నా తపఃఫలమా, నాకుమారా, నా చిన్నివడుగ (ఉపనయన యోగ్యుడు), నా కులదీపకా! నీవు నా భాగ్యరాశివి గదయ్యా! రావయ్యా, రమ్మా.

క. అన్నా రమ్మని దగ్గఱఁ
జన్నులపాలేటువాఱ సంశ్లేషిణియై
చిన్నారి మొగము నివురుచుఁ
గన్నారం జూచెఁ గన్న కడుపై యుంటన్

నాయనా! రమ్మని దగ్గరగా చేర్చుకొని, చన్నులనుండి పాలు ఏఱులై ప్రవహింపగ, బాలుని కౌగలించుకొని, చిన్నారి మోమును నివురుచు, కన్న కడుపగుటచేత బాలుని కన్నారజూచి, ఆ తల్లి ఆనందించెను.

అప్పుడు మహర్షులు వచ్చి ఆ బాలునకు సముచితమైన ఉపనయన కర్మలను చేయించిరి. సూర్యుడు సావిత్రి నుపదేశించెను. బృహస్పతి యజ్ఞోపవీతమును, కశ్యపుడు దర్భలమొలత్రాడును, అదితి కౌపీనమును, భూదేవి జింక చర్మమును, చంద్రుడు దండమును, గగనదేవత ఛత్రమును, బ్రహ్మ కమండలమును, సరస్వతి అక్షమాలికను, సప్తఋషులు కుశపవిత్రములనుఇచ్చిరి. కుబేరుడు అక్షయం అని చెప్పి భిక్షాపాత్రనివ్వగా, భవాని పూర్ణభిక్షను ఇచ్చెను. అని శుకుడు చెప్పెను. శుద్ధబ్రహ్మర్షులు విహితమంత్ర రాజములను చదువగా, పురాతనాచారము ప్రకారము వటుడు అగ్నులను వ్రేల్చెను.

ఇట్లు ఉపనయన కర్మను చూడవచ్చిన దేశదేశాంతరాగత బ్రాహ్మణులను చూచి వామను డిట్లడిగెను:

క. వత్తురె విప్రులు వేడఁగ
నిత్తురె దాతలును వేడ్క నిష్టార్థములం
దెత్తురె మీరును సంపద
లిత్తెఱఁగున దానవీరుఁడెవ్వఁడొ సెపుఁడా

ఓ బ్రాహ్మణోత్తములారా! దానముల నడుగుటకు బ్రాహ్మణులు వచ్చుచుందురా? అడిగినంతనె సంతోషముగ నిష్టార్థములను (కోరబడినవి) యిచ్చు దాతలున్నారా? మీరుకూడ నీవిధముగ దానములను స్వీకరించి తెచ్చుచుందురా? అట్టి దానముల నిచ్చే దానవీరుడెవ్వడున్నాడో నాకు చెప్పుడు.

అనిన వివిధ దేశీయులైన బ్రాహ్మణు లిట్లనిరి:

మ. కలరున్ దాతలు నిత్తురున్ ధనములుం గామ్యార్థముల్ గొంచు వి
ప్రులు నేతెంతురు గాని యీవిని బలిం బోలన్ వదాన్యుండు లేఁ

డలఘుండై యొనరించె నధ్వరశతం బా భార్గవానుజ్ఞచే
బలి వేఁడం బడయంగవచ్చు బహుసంపల్లాభముల్ వామనా

ఓ వామనమూర్తీ! దాతలనేకులు గలరు. వారు ధనములను కామ్యార్థములను (కోరికలను) విరివిగానే ఇత్తురు. వాటిని స్వీకరించి విప్రులనేకులు కొనివచ్చుచుందురు. కాని యీవినిగురించి (దానశీలత) చెప్పవలెనన్న బలిచక్రవర్తికి సమమగు వదాన్యుడు (దాత) ఎవ్వడును లేడు. ఘనతవహించిన యతడు గురువైన భార్గవుని యనుజ్ఞతో, శతాధికముగ యజ్ఞయాగాదులను చేయించెను. ఆ బలిని వేడినచో బహుసంపద లాభములను పొందవచ్చునయ్యా!

అని చెప్పిన బ్రాహ్మణుల వాక్కులను విని, లోకములకు ప్రీతికలిగించుటకై పెద్దల ఆశీర్వచనములను పొంది, తల్లిదండ్రుల వద్ద శెలవు తీసుకొని, శుభముహూర్తమున బయలుదేరి, క్షీణించిన దేవరాజును రక్షింప సంకల్పించిన శ్రీహరి, యాచకుడై బలి యింటికి భిక్షాటనము చేయ పయనించెను.

క. హరిహరి సిరి యురమునఁగల
హరి హరిహయుకొఱకు దనుజు నడుగన్‌జనియెన్
బరహితరతమతియుతులగు
దొరలకు నడుగుటయు నొడలితొడవగుఁ బుడమిన్

హరిహరీ! (అయ్యోపాపం, ఎంతవింత!) సాక్షాత్తు సిరుల తల్లియైన లక్ష్మీదేవియే తన వక్షమున వసించుచుండ శ్రీహరి, హరిహయుని (ఇంద్రుని) కొఱకు, నింద్రశత్రువైన దానవుని కడకు యాచించుటకు వెడలెను. పరహితము చేయుటయందే ఆనందించు దొడ్డప్రభువులకు ఈవిధముగ నడుగుటయును ఒక అలంకారమే కదా!

సర్వలోకముల భారమును మోయువాడు గనుక, అతడు వేయు వడివడి యడుగుల తాకిడికి పృథివి క్రుంగెను, ఆదిశేషువు ఒరిగిపోయెను.

అట్లు పోయి పోయి యమదండమునుండి తప్పించునట్టిదియు, అతిజటిలమైన ముక్తికాంత మనసులోని మర్మమును (ముక్తిమార్గమును)

తెలియజేయునదియు, సంతోషమునిచ్చునదియు, నగు నర్మదానదిని త్రోవలో నాతడు దాటెను.

సూర్యునివలె మెఱయుచున్న ఆవటుడు నర్మదానదిని దాటి ఉత్తరతటమున ఆహుతులైన అనేకమంది ఉద్దండులైన మునీశ్వరులను, సిద్ధుల సమూహములను, అనేక గజ తురగ సైన్య సమూహములను, బాగుగ పైకెగురు పొగచే కప్పబడిన సూర్యునివలె కన్పడు గుఱ్ఱములతో నున్న రథములను చూచెను. బలిదైత్యుడు చేయు యజ్ఞవాటికను దాటి దానవేంద్రుని దరిజేరునప్పుడు, అతనిని జూచి,

శా. శంభుండో హరియో పయోజభవుఁడో చండాంశుడో వహ్నియో
దంభాకారత వచ్చెఁగాక ధరణిన్ ధాత్రీసురుం డెవ్వఁడీ
శుంభద్యోతనుఁడీ మనోజ్ఞతనుఁ డంచున్ విస్మయభ్రాంతులై
సంభాషించిరి బ్రహ్మచారిఁగని తత్సభ్యుల్ రహస్యంబుగన్

ఇతడెవ్వడు? శివుడో, విష్ణువో, బ్రహ్మయో, సూర్యుడో, అగ్నియో, మారువేషమున వచ్చియుండునా! ఏమో! లేనిచో నీ ప్రపంచమున ఇంతటి తేజోమయుడు, సుందర శరీరుడైన బ్రాహ్మణుడెక్కడ నున్నాడు? అని తలచుచు, ఆ బ్రహ్మచారిని చూచి అచ్చటి సభాసదు లాశ్చర్యభ్రాంతులై తమలో తాము గుసగుసలాడుకొనిరి. ఈ పొట్టివడుగు బాలుని చూచి, ఆ సభాస్థలిలోని ప్రజలందరు గుసగుసలాడుకొనుచు, కొందరు గజిబిజిపడుచు, కొందరు కలకలపడుచు నుండిరి.

అప్పుడు వామనుడు:

సీ. చవులుగాఁ జెవులకు సామగానంబులు సదివెడు హోతలచదువు వినుచు
మంత్రతంత్రార్థసంబంధభావములు గొనియాడు యాజులు గూడికొనుచు
హోమకుండంబులందున్న త్రేతాగ్నుల వెలిఁగించు యాజకవితతిఁ గనుచు
దక్షులై బహువిధాధ్వరవిధానంబులు సెప్పెడు సభ్యులఁ జేరఁ జనుచు

తే. బెట్టు గోరెడు వేడుక పట్టుపఱుప
నదితిపుట్టువు లచ్చికి నాటపట్టు
గోరి చరియించె సభలోనఁ గొంతదడవు
పుట్టు వెన్నఁడు నెఱుఁగని పొట్టివడుగు

చెవులకు చవులు పుట్టునట్లుగా సామగానములను చదివెడి హోతల చదువు వినును, వేదములందలి మంత్రతంత్రముల అర్థతాత్పర్యభావములను విశ్లేషించు యాజులతో గూడును, హోమకుండములందలి త్రేతాగ్నులను వెలిగించు యాజకబృందమును జూచును, సర్వసమర్థులైన అధ్వర్యులు చెప్పెడి విధివిధానముల నాలకించును ఈ లక్ష్మీదేవి ఆటపట్టును, అదితియొక్క బిడ్డడును అయిన వామనుడు ఋత్విక్కులతో వేడుకగ వాదించి, వారిని ఓడించి, విజయగౌరవమును కోరును. పుట్టుకయేలేని పురుషోత్తముడైన యీ పొట్టివడుగు ఈ విధముగ యజ్ఞ సభాస్థలిలో కొంతసమయము చరించి,

క. వెడవెడ నడకలు నడచుచు
నెడనెడ నడు గిడఁగ నదరి యిల దిగఁబడఁగా
బుడిబుడి నొడువులు నొడువుచుఁ
జిడిముడి తడఁబడఁగ వడుగు సేరెన్ రాజున్

మందమందమైన నడకలు నడచుచు, అప్పుడప్పుడు ఆగిపోవుచు, ఆగినచోట్ల భూమి దిగబడుచుండ, చిన్నచిన్న దాటులు దాటుచు, తడబడు అడుగులతో వడుగు రాజు కడకు జేరి, యిట్లనెను.

మ. ఇతఁడే దానవచక్రవర్తి సురలోకేంద్రాగ్ని కాలాదిది
క్పతిగర్వాపనయప్రవర్తి గతలోభస్ఫూర్తి నానామఖ
వ్రతదానప్రవణానువర్తి సుమనోరామామనోభేదనో
ద్ధతచంద్రాతపకీర్తి సత్యకరుణాధర్మోల్లసన్మూర్తి దాన్

ఓహో! ఇతడేనా ఆ దానవచక్రవర్తి, యెవడైతే ఆ దేవేంద్ర, అగ్ని, యమాది దిక్పాలకుల గర్వమును తొలగించిన ధీరుడు? ఇతడేనా లోభమును, కోరికను పారద్రోలిన వీరుడు? ఇతడేనా అనేకమైన యజ్ఞయాగ వ్రతదానాది

సత్కర్మలను జేయు పుణ్యమూర్తి? ఇతడేనా దేవతాసతుల మానససాగరములో కల్లోలమును (వైధవ్య భయమును) కల్గించు శూరుడు? ఇతడే నా సత్యము, దయ, ధర్మములతో విలసిల్లే సజ్జనమూర్తి? యని, కుశదర్భ, పవిత్రములు, అక్షతలు పట్టుకున్న దక్షిణహస్తము చాచి, ఆశీర్వదించుచు నిట్లనియె:

ఉ. స్వస్తి జగత్త్రయీభువనశాసనకర్తకు హోసమాత్రవి
ధ్వస్తనిలింపభర్తకు నుదారపదవ్యవహర్తకున్ మునీం
ద్రస్తుతమంగళాధ్వరవిధానవిహర్తకు నిర్జరీగళ
న్యస్తసువర్ణ సూత్రపరిహర్తకు దానవలోకభర్తకున్

ముల్లోకములను శాసించు దానవచక్రవర్తికి స్వస్తి (శుభమగుగాక!) దేవేంద్రుని అవలీలగ నణగద్రొక్కి మహోన్నత పదవి నలంకరించి నిర్వహించు వానికి స్వస్తి! మునీంద్రులచే స్తుతింపబడి మంగళకరమగు యాగములను జరిపించువానికి స్వస్తి! దేవతా సతుల మంగళసూత్రములను పోగొట్టువానికి స్వస్తి! అని దీవించి, మూర్తీభవించిన వేదరాశివలెను, దండము, ఛత్రము, కమండలము, భిక్షాపాత్రలను ధరించినవాడై, మనోహర చంద్రవదనుడై యున్న ఆ మాయావటుని జూచి పురోహితులైన భృగువులు తమ ఆసనములనుంచి లేచి నిల్చొని సేమంబడిగి ప్రియవచనములతో నాదరించిరి. బలిచక్రవర్తియు, నమస్కరించి తగిన ఆసనమిచ్చి, భార్య బంగరు కలశతో జలము పోయ పాదములను కడిగి తడియొత్తి, పాదజలమును శిరస్సున చల్లుకొనెను. మఱియు నిట్లనెను:

మ. వడుగా యెవ్వరివాఁడ వెవ్వఁడవు సంవాసస్థలం బెయ్య ది
య్యెడకున్ నీ వరుదెంచుటన్ సఫలమయ్యెన్ వంశమున్ జన్మముం
గడు ధన్యాత్ముఁడనైతి నీ మఖము యోగ్యంబయ్యె నాకోరికల్
గడతేఱెన్ సుహుతంబులయ్యె శిఖులుం గల్యాణ మిక్కాలమున్

ఓ బ్రాహ్మణకుమారా! నీకు స్వాగతము. నీ వెవ్వరివాడవు? నీ వెవ్వడవు? నీ నివాస స్థలమేది? నీ విచ్చటికి వచ్చుటచే నా జన్మము, వంశము సఫలత చెందినవి. మేము ధన్యులమైతిమి. నీ రాకచే ఈ యజ్ఞము పవిత్రమైనది. నా

కోరికలు ఈడేరినవి. అగ్నులు బాగుగ వ్రేల్చబడినవి. ఈ సమయము మిక్కిలి మంగళకరమైనది.

మ. వరచేలంబులొ మాడలో ఫలములో వన్యంబులో గోవులో
హరులో రత్నములో రథంబులొ విమృష్టాన్నంబులో కన్యలో
కరులో కాంచనమో నికేతనములో గ్రామంబులో భూములో
ధరణీఖండమొకాక యే మడిగెదో ధాత్రీసురేంద్రోత్తమా

ఓ భూసురోత్తమా! నీకేమి కావలయును? మేలైన పట్టువస్త్రములా? సువర్ణ ముద్రలా? ఫలములు వనసంపదలా? గోవులు, గుఱ్ఱములు, రథములా, రత్నములా? మృష్టాన్న భోజనములా? గృహములు, భూములు, రాజ్యములా? యేనుగులా? కన్యలా? లేదా నీవేమి కోరినను దానిని నేనిచ్చెదను.

అని, ధర్మయుక్తముగ పలికిన బలిచక్రవర్తి మాటలకు శ్రీహరి సంతసించి యిట్లనెను: దానవేంద్రా!

సీ. ఇది నాకు నెలవని యేరీతిఁ బలుకుదు నొకచో టనక నిండియునేర్తు
నెవ్వనివాఁడ నం చేమని పలుకుదు నాయంతవాఁడనై నడవనేర్తు
నీ నడవడి యని యెట్లు వక్కాణింతుఁ బూని ముప్పోకలఁ బోవనేర్తు
నది నేర్తునిది నేర్తునని యేల చెప్పంగ నేరుపులన్నియు నేన నేర్తు

ఆ. నొరులు గారు నాకు నొరులకు నేనొదు
నొంటివాఁడఁ జుట్ట మొకఁడు లేడు
సిరియుఁ దొల్లి గలదు చెప్పెద నాటెంకి
సుజనులందుఁదఱచు సొచ్చియుందు

దానవేంద్రా! "ఇది" నా చోటని నేనెట్లు చెప్పగలను, ఒక్కచోటనక నేనంతటను నిండియుందును. ఎవ్వనికి చెందినవాడనని నేనెట్లు చెప్పగలను, నాకు చెందిన వాడనై నేను మెలగుచుందును. "ఇది" నా నడవడి యని (సంచరించుతావు అని) నేనెట్లు చెప్పగలను, కోరి మూడు పోకడల పోవంగలను (ముల్లోకముల లోను సంచరింపగలను (లేదా) జాగ్రత్స్వప్న సుషుప్తి యను

మూడు అవస్థలలోనుండు వాడను). "అది" నేర్చుకొంటిని "ఇది" నేర్చుకొంటినని చెప్పనేల అన్నివిద్యలను నేనే నేర్చుకొంటిని. ఎవ్వరును నాకు పరులుకారు. అందరికి నే నాత్మీయుడను (లేదా, అజ్ఞానముచే నితరులు నన్ను కాద నినను, నేనందరివాడ నౌదును) నేనొంటరివాడను. నాకు చుట్టమొక్కడును లేడు. (నేనే ఉన్నాను - అద్వితీయుడను - ఇతర మంతయు లేనిది. నాకెవ్వరియందును సంగములేదు). ఒకప్పుడు నాకు "సిరి" యుండెను. (ఇప్పుడు శ్రీదేవి నావద్దను లేదు). నా యొక్క నివాసస్థానము చెప్పెదను వినుము - నేనెల్లప్పుడును సజ్జనుల మధ్యనుందును. (ఉత్తముల హృదయమందు లేదా సజ్జన సత్సంగములయందు ఉందును). అది యట్లుండనిమ్ము -

దానవరాజా! నీ మాట సత్యము సుమా. ధర్మయుతమైనట్టిది, మీవంశమునకు తగియున్నట్టిది, కీర్తిప్రదమైనట్టిది. మీ వంశమందు, కరుణ సత్యగుణములేనివారు కలుగలేదు. యుద్ధము చేయుటకుగాని, దానమిచ్చుటకు గాని, వెనుదీయువారులేరు. దానము తీసుకొన్నవారు పొగడునప్పుడు మీ ప్రత్యర్థులు అతిశయించి తమదానశీలతను కోడివలె ప్రచారము చేసి తృప్తి చెందెదరు. కాని మీ వారట్లు చేయరు. మీ తాతలందరు గొప్ప పురుషులు. మీ వంశములో ప్రకాశించు మీ తాతగారైన ప్రహ్లాదుడు, ఆకాశముననుండు చంద్రునివలె కాంతులీనుచుండెను. ప్రసిద్ధమైన కీర్తితో మీ వంశము అతిశయించుచుండెను.

తొల్లి మీ ముత్తాతయైన హిరణ్యాక్షుడు విశ్వవిజయముచేసి, భూతలమున తనతో గదాయుద్ధము చేయుటకు సరియైన ప్రతివీరుని గానక పాతాళమున సంచరింపుచుండగ విష్ణువు వరాహరూపమున అతనితోపోరి హతమార్చెను. ఆ కారణమున అతని అన్నయైన హిరణ్యకశిపుడు హరిపై శత్రుత్వము వహించి హరిని అంతముచేయ నుద్దేశించి హరి సదనమునకు పోయెను. శూలమును ధరించి కాలునివలె వచ్చుచున్న దనుజుని గాంచి హరి యిట్లు తలచె :-ఈ రాక్షసునితో ఎదురువెళ్లి పోరి, జయింప సాధ్యపడదు. ఇంకెక్కడికి పోయినను మృత్యువువలె వెంటపడును, అని భావించి సూక్ష్మరూపమును ధరించి దైత్యుని

నిశ్వాస మార్గమున నతని హృదయములో ప్రవేశించెను. అప్పుడా దైత్యనాథుడు హరి గృహముజొచ్చి వెదకి వెదకి హరిని గానక, మిన్ను మన్ను గాలించి, మూడు లోకములు చూచి, దిశలందు జూచి, సముద్రములు, వనములు, పాతాళ లోకములను పరిశోధించి, హరిని యెందును గానక, అన్వేషణ చాలించి, యిట్లు తలంచెను. నా శత్రువైన ఆ హరి, చనిపోయి యుండవచ్చును. లేనిచో నే వెదకిన చోట్ల యందెక్కడైనను కనబడియుండును. చనిపోయిన వారితో పగపెంచుకొనరాదు గావున ఇక నన్వేషింపనేల? యని విరమించెను. అతడు మీ ముత్తాతకదా! అతనికి చాలా మంచి గుణములుండెను.

దానవరాజా! అది యట్లుండనిమ్ము. నీ తండ్రి వైరోచనుడు మాత్రము సామాన్యుడా! పురుహూతాదులు వేడినంతనె, తన ఆయువు నిచ్చివేయలేదా? నీవు మాత్రమీ లోకమున నీ తండ్రికేమాత్రము తీసిపోనివాడవు కదా! మూడు జగముల నేలినవాడవు, ఇంద్రాదులను పారద్రోలితివి. ఈ రాక్షసులను సంరక్షింపగలిగినవాడవు. ఇక దానగుణములో నీ పూర్వుల పోలియున్నవాడవు. అదీకాక,

క. రాజ్యంబు గలిగెనేనియుఁ
బూజ్యులకును యాచకులకు భూమిసురులకున్
భాజ్యముగ బ్రదుకదేనియు
ద్యాజ్యంబులు వానిజన్మధనగేహంబుల్

దానవేశ్వరా! రాజ్యము (ఐశ్వర్యము) కలిగినచో పూజ్యులకు, బీదలకు, బ్రాహ్మణులకు కొంత భాగమివ్వకుండ అంతయు తానే యనుభవించువాని జన్మయు ధనమును, గృహములన్నియును నిరర్థకములే (ఉంచుకోదగినవి కావు). దానములు కోరువారు, చిరకాలము నుండి, దానములకొఱకు పీడించుచు, త్రిభువనేశ్వరుడవైన నిన్నే దాతలలో అగ్రగణ్యునిగా నెన్నుకొందురు. అయినను, నాకేమి కావలయును?

ఆ. ఒంటివాఁడ నాకు నొకటి రెండడుగుల
మేర యిమ్ము సొమ్ము మేర యొల్ల

గోర్కి దీర బ్రహ్మకూఁకటి ముట్టెద
దానకుతుకసాంద్ర దానవేంద్ర

ఓ దానవేంద్రా! నీవు ఘనమైన దాన కాంక్షగలవాడవు. నే నొంటరివాడను. (ఎట్టి గృహస్థావరములు లేనివాడను). నా కొకటి రెండడుగుల చోటు నిమ్ము. ధనము, గౌరవము వంటివేవియు నాకు వలదు. నేకోరిన చోటు నిచ్చినచో, నేను బ్రహ్మ శిఖరమునే పొందినట్లానందించెదను. (అత్యున్నత పదమును పొందినట్లు భావించెదను) అనిన యా దివ్యయాచకునకు దొడ్డ దాత యిట్లనెను:

ఓ విప్రబాలకా! నీవు చెప్పిన మాటలన్నీ సత్యములే, పెద్దలు సమ్మతించు నట్టివే, అయినను, నాయనా! నీవు అడిగి అడిగి ఇంత స్వల్పమైనది అడిగితి వేమిటి? దాతయొక్క గొప్పతనము, దానశీలతయైన ఆలోచింపవలెను కదా!

మ. వసుధాఖండము వేఁడితో గజములన్ వాంఛించితో వాజులన్
వెస నూహించితో కోరితో యువతులన్ వీక్షించి కాంక్షించితో
పసిబాలుండవు నేర వీ వడుగ నీ భాగ్యంబు లీపాటిగా
కసురేంద్రుండు పదత్రయం బడుగ నీ యల్పంబు నీ నేర్చునే

బ్రాహ్మణకుమారా! నీవు పసిబాలుడవు. పాపం, అడగడమైనా రాదు. నీవు, రాజ్యభాగమైన అడుగుము, ఏనుగులనైన కోరుకొనుము. గుఱ్ఱములనైన కోరుకొనుము లేదా అందకత్తెలనైన ఎంచుకొని కోరుకొనుము. నీ భాగ్యము ఈ పాటిదేయని, నీవు ఈ స్వల్పమే కోరుకొంటివని, ఈ యసురేంద్రుడు ఈ కొద్దిపాటి దానము నిచ్చి తృప్తి జెందునా?

అనిన ఆ రాజుతో మేధావి బాలుడిట్లనెను :

మ. గొడుగో జన్నిదమో కమండలువొ నాకున్ ముంజియో దండమో
వడు గే నెక్కడ భూము లెక్కడ కరుల్ వామాక్షు లశ్వంబు లె
క్కడ నిత్యోచితకర్మ మెక్కడ మదాకాంక్షామితంబైన మూఁ
డడుగుల్ మేరయ త్రోవ కిచ్చుటయె బ్రహ్మాండంబు నాపాలికిన్

దానవరాజా! బ్రహ్మచారినైన నేనెక్కడ, భూములు, ఏనుగులు, అశ్వములు, అందాలభామలు, అలాంటి వన్నీ ఎక్కడ? వానితో నాకేమి పని? గొడుగో, జంధ్యమో, కమండలమో, దర్భల మొలత్రాడో, దండమో, యిలాంటివే నా నిత్యకర్మలకు పనికి వచ్చునవి. (ఇవికూడను నా వద్ద నున్నవిగాన, నాకు వలదు). నేను కోరిన మూడడుగుల మేర నిచ్చిన నా పాలికదియే బ్రహ్మాండము. అదియును గాక.

క. వ్యాప్తిం బొందక వగవక
ప్రాప్తం బగులేశమైనఁ బదివే లనుచుం
దృప్తిం జెందనిమనుజుఁడు
సప్తద్వీపముల నయినఁ జక్కంబడునే

ఏదైనను లభించినదని అతిశయింపక, స్వల్పమని కించపడక, లభించినదెంత తక్కువదైనను అదియే పదివేలని తృప్తిజెందని మనుజుడు, సప్తద్వీపములలో నెక్కడికి పోయినను బాగుపడునా?

శా. ఆశాపాశము దాఁ గడున్ నిడుపులే దంతంబు రాజేంద్ర వా
రాశిప్రావృత మేదినీవలయసామ్రాజ్యంబు సేకూడియుం
గాసిం బొందిరిగాక వైన్యగయభూకాంతాదులు స్వర్థకా
మాశం బాయఁగ నేర్చిరే మును నిజాశాంతంబులం జూచిరే

దానవేశ్వరా! ఆశాపాశము మిక్కిలి పొడుగైనది. దాని కంతమేలేదు. సముద్రముచే చుట్టబడిన భూమండలమంతయు తమదే యైయున్నను కొందరు భూమీశులు ఈ ఆశాపాశముచే కట్టబడినవారై వ్యర్థమైన యాతనలనే పొందిరిగాని, తమ యొక్క అర్థకామముల యందాశను తొలగించుకొన గల్గిరా? మఱి తమ ఆశయొక్క అంతమును చూడగల్గిరా?

సీ. సంతుష్టుఁ డీ మూఁడుజగములఁ బూజ్యుండు సంతోషి కెప్పుడు జరుగు సుఖము
సంతోషి గాకుంట సంసారహేతువు సంతసంబున ముక్తిసతియు దొరకుఁ
బూఁటపూఁటకు జగంబుల యదృచ్ఛాలాభతుష్టిని దేజంబు తోన పెరుఁగుఁ
బరితోషహీనతఁ బ్రభ సెడిపోవును జలధార ననలంబు సమయునట్లు

ఆ. నీవు రాజవనుచు నిఖిలంబు నడుగుట
దగవు గాదు నాకుఁ దగిన కొలఁది
యేను వేఁడికొనిన యీ పదత్రయమును
జాలదనక యిమ్ము చాలుఁ జాలు

అందుచేత. రాజా! మనుజునకు సంతుష్టి అత్యవసరము. ఏలనన, సంతుష్టి గలవాడు ఈ మూడు జగములందు పూజ్యుడగును. అతనికెల్లప్పుడు సుఖముండును. సంతుష్టుడు కాని వానికి సంసారబంధము పెరుగును. సంతుష్టిని పెంచుకొనువానికి ముక్తి సులభసాధ్యమగును. ఎప్పటికప్పుడు ప్రయత్నము లేకుండ ఏది లభించిన, దానితోనే సంతుష్టి జెందినచో తేజస్సు, శక్తి పెరుగును. సంతుష్టి లేకపోయినచో, జలధారచే నగ్నిహోత్ర మణగిపోవునట్లు తేజస్సు క్షీణించును. నీవు రాజువును, ప్రసిద్ధమైన దాతవును, అని సకలమును అడుగుట ఉచితము కాదు. నేను కోరుకొనిన మూడడుగుల చోటును, చాలదు అనక యిమ్ము, అదియే చాలా ఎక్కువనాకు.

అని పలికిన బ్రహ్మచారికి దానవచక్రవర్తి, దానమిచ్చుటకు సిద్ధపడగా మేధావియు, రాక్షసుల గురువునైన శుక్రాచార్యుడు రాజుతో నిట్లనియె :

సీ. దనుజేంద్ర యీతఁడు ధరణీసురుఁడు గాఁడు దేవకార్యంబు సాధించుకొఱకు
హరి విష్ణుఁ డవ్యయుం డదితిగర్భంబునఁ గశ్యపసూనుఁడై కలిగె నకట
యెఱుఁగ కీతనికోర్కి నిచ్చెద నంటివి దైత్యసంతతి కుపద్రవము వచ్చు
నీ లక్ష్మిఁ దేజంబు నెలవు నైశ్వర్యంబు వంచించి యిచ్చుఁదా వాసవునకు

ఆ. మొనసి జగములెల్ల మూఁడుపాదంబుల
నఖిల కాయుఁడగుచు నాక్రమించు
సర్వధనము విష్ణు సంసర్జనము సేసి
బడుగుపగిది నెట్టు బ్రదికె దీవు

దానవేంద్రా! ఇతడు బ్రాహ్మణ బ్రహ్మచారికాడు సుమా! దేవకార్యమును సాధించుటకు వచ్చిన హరి, అవ్యయుడైన విష్ణువు, అదితి గర్భమున కశ్యపుని పుత్రునిగ జన్మించినవాడు. అయ్యో! తెలియక, నీవతనికి కోరిన దానము

నిచ్చెదనంటివి. దీనివలన దైత్యసంతతికి తీరని ఉపద్రవమొచ్చి పడును. నీయొక్క సిరిసంపదలు తేజస్సు రాజ్యము, ఐశ్వర్యము, అన్నియును, నిన్ను వంచించి ఇతడా యింద్రుని కిచ్చివేయును. ఇతడు సామాన్యుడు కాడు. మూడు పాదములలో, విరాట్ రూపము ధరించి, అన్ని జగముల నాక్రమించగలడు. నీకున్న సర్వసంపదలను ఇతనికి దానముచేసి, శక్తిహీనుడవై నీవెట్లు బ్రతుకగలవు?

క. ఒక్కపదంబున భూమియు
నొక్కటఁ ద్రిదివంబుఁ ద్రొక్కి యున్నతమూర్తిన్
దిక్కులు గగనముఁ దానై
వెక్కసమైయున్న నెందు వెడలెదు చెపుమా

ఒక్కపాదముతో భూమిని, ఇంకొక్క పాదముతో మూడు ఊర్ధ్వలోకములను త్రొక్కి మహోన్నతమూర్తిగా నెదిగి, దిక్కులు, ఆకాశము అంతయు తానేయై ఆశ్చర్యకరముగ నాక్రమించినచో, నీవెట్లు బయటపడగలవో చెప్పుము.

సీ. ఇచ్చెదనని పల్కి యీకున్న నరకంబు ద్రోవ నీవును సమర్థుఁడవె దేవ
యే దానమున నాశ మేతెంచు నదియును దానంబుగా దండ్రు తత్త్వవిదులు
దానంబు యజ్ఞంబుఁ దపము గర్మంబులు దా విత్తవంతుఁడై తలఁపవలయుఁ
దనయింటఁ గల సర్వధనమును నైదుభాగములుగా విభజించి కామమునకు

ఆ. నర్థమునకు ధర్మయశముల కాశ్రిత
బృందములకు సమతఁ బెట్టునట్టి
పురుషుఁ డిందు బూర్ణుఁడై మోదించుఁ
దన్ను మానిచేఁత దగవు గాదు

దానవాధీశా! (ఈ దానము నిచ్చుట మిక్కిలి హానికరము గావున ఇవ్వవద్దు). ఇచ్చెదనని చెప్పి, ఇవ్వనందున ప్రాప్తమగు నరకమును తిరస్కరించుటకు నీవు సమర్థుడవే. ఏ దానము వలన నాశనము సంభవించునో యది దానము కాదని తత్త్వవిదులు చెప్పెదరు. దానము, యజ్ఞము, తపము,

కర్మములు, తాను ధనవంతుడై యున్నప్పుడే చేయవలెను. తన వద్దనున్న ధనమంతటిని ఐదు భాగములు చేసి, ఒక్కొక్క భాగమును కోర్కెలను తీర్చుకొనుటకును, నర్థసంచయమునకును, ధర్మకార్యములకొఱకును, కీర్తిని సంపాదించుకొనుటకును, ఆశ్రితజనుల కొఱకు వెచ్చించుటకును, వినియోగింపవలెను. అట్లు చేయు వ్యక్తి ఇహపరములందు పరిపూర్ణుడై సుఖించును. తన్ను మాని యేమి చేసినను యది తగినపనికాదు.

ఇంతేకాదు రాజా! బహ్వృచ గీతలోనేమున్నదో తెల్పెద వినుము.

ఇచ్చుట కంగీకరించినను, అట్లిచ్చుటవలన సర్వము పోవుచో, సిదప లేదనినను అది అసత్యమవదు (అనృతముకాదు). ఇచ్చుట వలన నష్టము, లోటు, క్షీణించుట, జరుగకుండ ఇచ్చినచో, అట్టి పురుషుడు చెడకుండును. అట్లు కాక సత్యమును పాటించెద ననుచు తన ధనము నిచ్చివేసిన వాడు ఏమియు మిగులకుండ చెడిపోవును.

రాజా! ఇంకొక విషయమున్నది తెలుసుకొనుము.

ఆ. వారిజాక్షులందు వైవాహికములందుఁ
బ్రాణవిత్తమానభంగమందు
జకితగోకులా గ్రజన్మరక్షణమందు
బొంకవచ్చు నఘము వొందఁ డధిప

స్త్రీలను ఒప్పింపవలసినప్పుడు, పరిహాసము లాడునప్పుడును, వైవాహిక వినోదవేడుకలయందు, ప్రాణాపాయ సమయమప్పుడును, ధననష్టము కలుగనున్నప్పుడును, మానభంగము (గౌరవహాని) కలుగనున్నప్పుడును, భయాతురులైన గోవులను, బ్రాహ్మణులను రక్షింపవలసి వచ్చునప్పుడును, అసత్యమాడినను పాపమంటదు. (ఇది రాక్షసులకు వర్తించు శుక్రనీతి యని కొందరి అభిప్రాయము).

మ. కులమున్ రాజ్యముఁ దేజమున్ నిలుపుమీ కుబ్జుండు విశ్వంభరుం
డలఁతిం బోఁడు త్రివిక్రమస్ఫురణవాఁడై నిండు బ్రహ్మాండముం
గలఁడే మాన్ప నొకండు నా పలుకు లాకర్ణింపు కర్ణంబులన్
వల దీ దానము గీనముం బనుపుమా వర్ణిన్ వదాన్యోత్తమా

ఓ మహారాజా! నీ యొక్క దైత్యకులమును, రాజ్యమును, తేజమును కాపాడుకొనుము. ఈ గుజ్జువాడు సామాన్యుడుకాడు. అంతనులువుగా (మూడడుగులనేలతో) విడిచిపోడు. విశ్వమంతయు నిండిపోగలవాడు. త్రివిక్రమునివలె బ్రహ్మాండ మంతయు నిండి పోగలవాడు. ఇతని నెవ్వడును ఆపలేడు. నీ చెవులార నామాటల నాలకింపుము. ఈ దానము గీనము ఇవ్వవలదు. ఈ బ్రహ్మచారిని పంపించివేయుము.

అని పలికిన గురుదేవుని మాటలు విని క్షణమాలోచించి కీర్తిమంతుడైన బలి యిట్లనెను.

సీ. నిజమానతిచ్చితి నీవు మహాత్మక మహిని గృహస్థ ధర్మంబు నిదియ
యర్థంబుఁగామంబు యశమును వృత్తియు నెయ్యది ప్రార్థింపనిత్తుననియు
నర్థలోభంబున నర్థిఁ బొమ్మనుటెట్లు పలికి లేదనుకంటెఁబాపమెద్ది
యెట్టి దుష్కర్ముని నే భరించెదఁ గాని సత్య హీనుని మోవఁ జాలననుచు

తే. బలుకదే తొల్లి భూదేవి బ్రహ్మతోడ
సమరమందడ్గు తిరుగక చచ్చుకంటె
బలికి బొంకక నిజమునఁ బరఁగుకంటె
మానధనులకు భద్రంబు మఱియుఁ గలదె

మహాత్మా! గురుదేవా! నీవు నిజమానతిచ్చితివి. ఈ భూమిపై నీవు చెప్పిన మాటలే గృహస్థులకు ఆచరణీయ ధర్మములు. కాని అర్థ కామ కీర్తి వృత్తులలో నేది కోరినను యిచ్చెదనని మాట యిచ్చి, అర్థలోభముచే నిప్పుడు అర్థిని (అడిగినవానిని) పొమ్మనుటెట్లు? ఇచ్చెదనని పలికి లేదనే కంటె ఘోరమైన పాపమేది? ఎటువంటి పాపాత్మునైనను నేను భరించెదను గాని సత్యహీనుని మాత్రము మోయజాలనని తొల్లి భూదేవి బ్రహ్మదేవునితో చెప్పలేదా? యుద్ధమందు వెనుదిరగక చచ్చుటకంటె, మాటచెప్పి అసత్యమాడకుండ సత్యమునే పాటించుట కంటె, మానధనులకు శ్రేయస్కరమింకేదియైన నున్నదా? హాలికునకు (సేద్యము చేయువానికి) మంచి క్షేత్రము, మంచి బీజములు (విత్తనాలు) ఎట్లు మంచి పంటలనిచ్చునో అట్లే దాతకు ఈవి (దానగుణము) సత్పాత్రుడైన గ్రహీత, లభించు భాగ్యమింకేమైననున్నదా?

శా. కారే రాజులు రాజ్యముల్ గలుగవే గర్వోన్నతిం బొందరే
వా రేరీ సిరి మూట గట్టికొని పోవంజాలిరే భూమిపైఁ
బేరైనం గలదే శిబిప్రముఖులుం బ్రీతిన్ యశఃకాములై
యీరే కోర్కులు వారలన్ మఱచిరే యిక్కాలమున్ భార్గవా

ఆచార్యదేవా, భార్గవా! ఆదినుండి యెందరెందరో రాజులు కాలేదా? ఎన్నెన్నో సామ్రాజ్యములు స్థాపింపబడలేదా? ఆ రాజ్యాధీశు లెంతెంత గర్వాహంకారములను జూపలేదా? మరి వారందరూ ఏరి? ఇప్పుడెక్కడ నున్నారు? ఈ భూమిపై వారి పేరైనను మిగిలియున్నవా? శిబిచక్రవర్తి వంటి మహాదాతలు కీర్తికాములై ప్రేమతో, అడిగినవారి కోర్కెలను తీర్చలేదా? వారిని నేటివరకు యెవ్వరైనను మఱచిపోగల్గిరా?

క. ఉడుగని క్రతువుల వ్రతములఁ
బొడగనఁ జననట్టిపొడవు పొడవునఁ గుఱుచై
యడిగెడి నఁట నను బోఁటికి
నిడరాదె మహానుభావ యిష్టార్థంబుల్

మహానుభావా! తెంపులేని వ్రతములు, క్రతువులు చేసినను, ఎవ్వని రూపమైనను గాంచవలను పడదో, అట్టి దొడ్డవాడు కుఱుచవాడై నా వంటి సామాన్యుని కడకు వచ్చి యడిగినచో నతని ఇష్టార్థమును (కోరికను) ఎందుల కివ్వరాదు?

ఆహా! ఇంకా వినుము:

శా. ఆదిన్ శ్రీసతికొప్పుపైఁ దనువుపై నంసోత్తరీయంబుపైఁ
బాదాబ్జంబులపైఁ గపోలతటిపైఁ బాలిండ్లపై నూత్నమ
ర్యాదం జెందుకరంబు గ్రిందగుట మీఁదై నా కరం బుంట మేల్
గాదే రాజ్యము గీజ్యమున్ సతతమే కాయంబు నాపాయమే

గురుదేవా! మొదట శ్రీదేవియొక్క కురులను సవరించుచు, శరీరము నిమురుచు పైటచెంగును లాగుచు, పాదపద్మములను పట్టుకొనుచు, చెక్కిళ్లను స్పృశించుచు, పాలిండ్లతో (స్తనములతో) నాడుచు, నిత్యమూ

ఆరాధింపబడుచుండు, ఆ శ్రీహరి చెయ్యి నన్ను యాచించుచు, క్రింది దగుటయు, దానమిచ్చు నా చెయ్యి మీదిదగుటయు, ఆహా! ఎంతటి అదృష్టమో కదా! ఎంత శ్రేయస్కరమోకదా! ఈ రాజ్యము, గీజ్యము యేమైనా శాశ్వతమైనట్టివా యేమి? ఈ శరీరము మాత్రముపోవకుండా ఉండిపోవునా? అందుచేత,

మ. నిరయంబైన నిబంధమైన ధరణీనిర్మూలనంబైన దు
ర్మరణంబైనఁ గులాంతమైన నిజమున్ రానిమ్ము కానిమ్ము పో
హరుఁడైనన్ హరియైన నీరజభవుం డభ్యాగతుండైన నాఁ
దిరుగన్ నేరదు నాదుజిహ్వ వినుమా ధీవర్య వేయేటికిన్

ధీవర్యా! నాకు నరకమే ప్రాప్తించినను, నేను బంధింపబడినను, భూమండలము నిర్మూలమైనను, నాకు దుర్మరణము సంభవించినను, కులాంతరమైనను, నిజానికేది రానున్నదో అది రానిమ్ము, ఏది జరుగనున్నదో అది జరుగనిమ్ము, ఇప్పుడభ్యాగతుడై యడుగ వచ్చినవాడు శివుడైనను, విష్ణువైనను, బ్రహ్మయైనను, యింకెవ్వడైనను, కానిమ్ముమాటయిచ్చిన నా జిహ్వ మరి వెనుకకు మరలదు. ఈ విషయమై యింక వెయ్యిమాటలేల?

ఆ. నొడివినంతవట్టు నుసలక యిచ్చుచో
నేల కట్టు విష్ణుఁడేటిమాట
గట్టెనేనిఁదాన కరుణించి విడుచును
విడువ కుండనిమ్ము విమలచరిత!

ఓ విమలచరితా! అడిగినంత మేర మాటతప్పకుండ ఇచ్చినచో విష్ణువు నన్నేల బంధించును? ఒకవేళ బంధించినను అతడే కరుణించి విడిచి పెట్టును. ఒకవేళ విడిచిపెట్టకున్నను పోనీలెమ్ము.

క. మేరువుదలక్రిందైనను
బారావారంబు లింకఁబాటిన లోలో
ధారుణి రజమైపోయినఁ
దారాధ్వముబద్ధమైనఁదప్పక యిత్తున్

మేరుపర్వతము తలక్రిందులైనను, సముద్రము లింకిపోయినను, భూమండలము లోలోపలనే చూర్ణమైపోయినను, మిన్నువిరిగి మీదపడినను నేనీదానము నిచ్చితీరెదను. మఱియును,

మత్తకోకిల. ఎన్నఁడుంబరు వేఁడఁబోఁడఁట యేకల బఁటకన్నవా
రన్నదమ్ములునైన లేరఁట యన్ని విద్యల మూలగో
ష్ఠి న్నెఱింగిన ప్రోడగుజ్జఁట చేతులొగ్గి వసింప నీ
చిన్నిపాపనిఁద్రోసిపుచ్చఁగఁజిత్త మొల్లదు సత్తమా!

గురుశ్రేష్ఠా! ఈ చిన్నపాప డెన్నడు నితరులనెవ్వరిని అడుగలేదట. ఏకాకియుట. కన్నవారుగాని అన్నదమ్ములుగాని లేరట. అన్నివిద్యల మూలసారము నెఱింగిన నేర్పరియుట, యీ గుజ్జుబాలుడు, చేతులొగ్గి యాచించిన యీ చిన్నవాని నెట్లు కాదనగలను చెప్పుము!

ఇట్లు సత్యపదమునందనురక్తుడును, దానమిచ్చుటకు మిక్కిలి వేగిర పడువాడును, నిర్మలకీర్తిచంద్రుడును, దృఢమనస్కుడును, సత్యసంధుడును, అర్థించువారి కోర్కెలను తీర్చువాడును అయిన బలిచక్రవర్తిని చూచి, శుక్రాచార్యుడు కోపించి, తన శాసనము నుల్లంఘించుట చేత పదభ్రష్టుడవు కమ్మని శపించెను. గురుశాపతప్తుడైనను, బలి సత్యమార్గమునే అనుసరించు టకు పూనుకొనెను.

ఆ. బ్రదుకవచ్చుఁగాక బహుబంధనములైన
వచ్చుఁగాక లేమి వచ్చుఁగాక
జీవధనము లైనఁజెడుఁగాక పడుఁగాక
మాటఁ దిరుగలేరు మానధనులు

అనేకమైన బంధనములచే చుట్టబడినను బ్రతుకవచ్చును. సంపదలన్నీ పోయి, లేమివచ్చినను బ్రతుకవచ్చును. ధనము నష్టమైనను అగుగాక, జీవనము కష్టములపాలైనను అగుగాక! మానధనులు మాత్రము ఇచ్చిన మాటను తప్పలేరు.

దానవచక్రవర్తి యొక్క రాణి, వింధ్యావళి, భర్త భావము తెలుసుకొని, బ్రహ్మచారి కాళ్లగడుగుటకు బంగరు కలశముతో జలముతెచ్చెను. అప్పుడు బలి, ఆ కపట వటువుతోనిట్లనెను.

క. రమ్మా మాణవకోత్తమ!
లెమ్మా నీ వాంఛితంబు లేదన కిత్తుం
డెమ్మా యడుగుల నిటు రా
నిమ్మా కడుగంగవలయు నేఁటికిఁదడయన్

ఓ బాలకశ్రేష్ఠమా! లెమ్ము, ఇటురమ్ము నీ వాంఛితమును (కోరిన కోరికను) లేదనక యిచ్చెదను. నీ పాదములను కడుగవలెను గావున నీ యడుగుల నిటు రానిమ్ము. ఇక నాలస్యము చేయనేల?

మ. బలిదైత్యేంద్ర కరద్వయీకృత జలప్రక్షాళన వ్యాప్తికిన్
జలజాతాక్షుఁడు సాఁచె యోగిసుమన స్సంప్రార్థిత శ్రీదముం
గలితానమ్ర రమాలలాట పదవీ కస్తూరికా శాదమున్
నళినామోదము రత్ననూపురితనానావేదముం బాదమున్

బలి దైత్యేంద్రుడు తన రెండు చేతులతో జలప్రక్షాళనము చేయుటకొఱకై శ్రీహరి తన పాదములను ముందుకు చాచెను. ఆ పాదము లెట్టివనగా - యోగులు, దేవతలును, నిత్యము పూజించుచుండునట్టివి, సిరులను కురిపించునట్టివి, రమాదేవి వంగి నమస్కరించునప్పుడు, ఆమె లలాటమున పూయబడిన కస్తూరీ చందనము లంటుకొనునట్టివాస్వామి పాదములు, కలువలవలె మృదుమనోహరములై, రత్నఖచిత నూపురములతో నలంకరింప బడినట్టివి, సాక్షాత్తు వేదస్వరూపము లైనట్టివి.

క. సురలోక సముద్ధరణము
నిరత శ్రీకరణ మఖిల నిగమాంతాలం
కరణము భవసంహరణము
హరిచరణము నీటఁగడిగె నసురోత్తముఁడున్

సురలోకము నుద్ధరించునట్టివియును, మిక్కిలి కరుణాపూర్ణములును, సర్వవేదాంతాలంకృతములును, సంసార బంధచ్ఛేదకములును అయిన ఆ శ్రీహరి చరణకమలములను ఆ దానవేంద్రుడు కడిగెను.

ఇట్లు ఆ బ్రాహ్మణ వటువు దక్షిణచరణమును కడిగి, పిమ్మట వామచరణమును కడిగి, ఆ పావన జలము శిరమున జల్లుకొని, ఆచమించి, దేశకాలాది పరిగణనము చేసి,

శా. విప్రాయ ప్రకటవ్రతాయ భవతే విష్ణుస్వరూపాయ వే
దప్రామాణ్య నిదే త్రిపాదధరణీం దాస్యామి యంచుం గ్రియా
క్షిప్రుండై దనుజేశ్వరుండు వడుగుం జేసాఁచిపూజించి బ్ర
హ్మప్రీతమ్మని ధారవోసె భువనం బాశ్చర్యముం బొందఁగన్

"బ్రాహ్మణోత్తముడవు, ప్రసిద్ధమైన వ్రతనిష్ఠుడవు, విష్ణుస్వరూపుడవు, వేదములచే నిరూపింపబడిన వేదవిదుడవు, అయిన నీకిదే మూడడుగుల భూమిని దానము చేయుచున్నాను" అని దానవేశ్వరుడు వెంటనే కార్యోన్ముఖుడై, చెయ్యిచాచి, పూజించి, "పరమాత్మ ప్రీతిజెందుగాక" యని చెప్పి, భువనములన్నీ ఆశ్చర్యపోవునట్లుగా ధారపోసెను. అప్పుడు -

ఆ. నీరధారఁ బడఁగనీక యడ్డంబుగాఁ
గలశరంధ్రమాఁపఁగాను దెలిసి
హరియుఁ గావ్యునేత్ర మటుఁగుశాగ్రంబున
నడువ నేకనేత్రుండయ్యెనతఁడు

నీటిధార పడకుండ, శుక్రుడు (సూక్ష్మరూపమున కలశయందు ప్రవేశించి అడ్డుకొని) కలశరంధ్రమును మూసివేయగా, శ్రీహరి కుశాగ్రముచే కలశ రంధ్రములోనికి పొడవగా నడ్డు తొలగి జలధార వచ్చి దానము సంపూర్ణముగా సిద్ధించెను. అట్లు పొడుచుటచే శుక్రాచార్యుని ఒక కన్ను పోయెను. అంత,

మ. అమరారాతి కరాక్షతోజ్ఝిత పవిత్రాంభః కర శ్రేణికిం
గమలాధీశ్వరుఁ డొడ్డె ఖండిత దివౌకస్స్వామిజిన్మస్తముం

గమలాకర్షణ సుప్రశస్తము రమా కాంతా కుచోపా స్తమున్
విమల శ్రీకుచశాతచూచుకతటీవిన్యస్తమున్ హస్తమున్

ధారపోయునపుడు దైత్యనాథుని చేతినుండి జారుచున్న పవిత్రజలము, అక్షతలను విష్ణువు తన హస్తముతో స్వీకరించుటకు సిద్ధముగ నుండెను. ఆ హస్తమెట్టిదనగా - అనేకులైన అసురులను అంతమొందించినట్టిది, లక్ష్మీదేవి కుచములను లాలించునట్టిది. అట్టి హస్తమును వామనుడు చాచగా, బలిచక్రవర్తి పవిత్రజలాక్షతలను విడిచి ధారపోసెను. శ్రీహరి స్వీకరించెను.

ఆ. కమలనాభు నెఱిఁగి కాలంబు దేశంబు
నెఱిఁగి శుక్రు మాట లెఱింగి నాశ
మెఱిఁగి పాత్ర మనుచు నిచ్చె దానము బలి
మహి వదాన్యుఁడొరుఁడు మఱియుఁగలడె

రాక్షస శత్రువైన విష్ణువే దానమడుగ వచ్చెనని తెలిసి, తనకు కష్టకాలము రానున్నదని తెలిసి, ఇక నీ దేశము తనది కాదని తెలిసి గురుదేవుడైన శుక్రాచార్యుడు చేసిన హెచ్చరిక నెఱిగి, సర్వనాశనమగునని యెఱింగి, దానమిచ్చుటయే శ్రేష్ఠమని దలంచి దానమిచ్చెను బలి. ఈ పృథివిలో నిట్టి దాతశ్రేష్ఠు డింకెవ్వడైన గలడా?

క. క్షితి దానమిచ్చు నతఁడును
నతికాంక్షఁ బరిగ్రహించు నతఁడును దురిత
చ్యుతులై శతవత్సరములు
శతమఖ లోకమునఁ గ్రీడ సలుపుదు రెలమిన్

భూమిని దానము చేయువాడును, భూదానమును మిక్కిలి యాసక్తితో స్వీకరించువాడును, పాపమోచనులై శతవర్షములు ఇంద్రలోకమందు భోగము లనుభవించుదురు అని చెప్పి వామనుడిట్లనెను:

ఏ దానమైనను, భూమిదానమునకు సరితూగదు. గావున భూమిదానమిచ్చి ఉభయలోకములలోను కీర్తి సుకృతములను పొందుము. మఱియు,

క. ఇది యేమి వేఁడి తని నీ
మది వగవక ధారవోయుమా, సత్యము పెం
పొదవఁగఁ గోరిన యర్థం
బిది యిచ్చుట ముజ్జగంబు లిచ్చుట మాకున్

దానవేంద్రా! నేనింత చిన్న దానమును కోరితినని నీవు కించపడకుండ ధారపోయుము, సత్యమతిశయింపగ నేను కోరిన కానుక యిది. దీనిని నీవిచ్చుట మూడు జగముల నిచ్చినట్లు నేను భావించెదను.

అని పలికిన పలుకులకు బలిచక్రవర్తి మిక్కిలి సంతసించినవాడై యిట్లనెను:

ఆ. పుట్టి నేర్చు కొనెనొ పుట్టకనేర్చెనో
చిట్టి బుద్ధు లిట్టి పొట్టి వడుగు
బొట్టనున్న వెల్ల బూమెలు నని నవ్వి
యెలమి ధరణిదాన మిచ్చెనపుడు

ఈ పొట్టి బుడుతడు ఇటువంటి చిట్టిబుద్ధులను పుట్టి నేర్చుకొనెనో, పుట్టకమునుపే నేర్చుకొనెనో గాని యితని పొట్టలోనున్నవన్నీ అద్భుతములే అని ఆ దానవేంద్రుడు ముసిముసిగ నవ్వుకొని సంతోషముగ భూమిదానము చేసెను.

క. బలిసేసినదానమునకు
నలినాక్షుడు నిఖిల భూతనాయకుఁడగుటం
గలకలమనె దశదిక్కులు
భళిభళియని పొగడె భూత పంచక మనఘా

బలిచేసిన దానమునకు, శ్రీహరియే సకల భూతనాయకుడగుటచేత, పంచభూతములు భళిభళీ యని పొగడినవి. దిక్కులు సంతోషముతో కలకలలాడి వెలసినవి.

గ్రహములు, మునీంద్రులు, సిద్ధులు, గంధర్వులు, కిన్నరులు, కన్నిరులు, యక్షులు, పక్షులు, దేవతలు, సర్పములు, సర్వులు, బలియొక్క గొప్పతనమును

పొగడిరి. పుష్పవర్షములు కురిసెను. దేవదుందుభులు మ్రోగెను. ఈ విధముగ దానమును గ్రహించిన వామనుడు.

శా. ఇంతింతై వటుఁడింత యై మఱియుఁ దా నింతై నభోవీథిపై
నంతై తోయద మండలా గ్రమున కల్లం తై ప్రభారాశిపై
నంతై చంద్రునికంత యై ధ్రువునిపై నంతై మహర్వాటిపై
నంతై సత్యపదోన్నతుండగుచు బ్రహ్మాండాంతసంవర్ధియై

దానమును స్వీకరించిన వామనమూర్తి, కొద్దికొద్దిగా ఎదగసాగెను. ఇంతచిన్న వాడింత వాడయ్యెను, ఇంతవా డంతవాడయ్యెను; అంతవాడు మఱీ యంతవాడై, ఆకాశవీధిపై నంతయై, మేఘమండలోపరి స్థలికల్లంతవాడై, తేజోమండలముపై మఱియంతై, చంద్రుని కంతయై, ధ్రువతారపై నంతయై, మహర్లోకము పైన నంతయై, సత్యలోకము కంటె నున్నతుడై, బ్రహ్మాండ మంతయు నిండి, తానే యై పెరిగిపోయెను.

మ. రవిబింబం బుపమింపఁ బాత్ర మగు ఛత్త్రం బై శిరోరత్నమై
శ్రవణాలంకృతమై గళాభరణమై సౌవర్ణ కేయూర మై
ఛవిమత్కంకణ మై కటిస్థలి నుదంచద్ఘంట యైనూపుర
ప్రవరం బై పదపీఠ మై వటుఁడు దా బ్రహ్మాండమున్ నిండుచోన్

స్థిరముగ నిలిచియున్న సూర్యబింబముతో పోల్చిచూడ, నెదిగిపోవుచున్న ఆ వామనమూర్తికి సూర్యబింబము, మొదట సరియైన ఛత్రమువలెను, పిమ్మట కంఠాభరణము వలెను, అటుపిమ్మట సువర్ణభుజకీర్తిగను, తరువాత కాంతులీను కంకణముగను, పిమ్మట మొలకు కట్టబడిన గంటగను, పిదప మేలైన కాలియందె వలెను, చివరకు పాదపీఠమువలెను కనిపించెను. (క్రిందినుంచి యెదుగుచున్న వామనమూర్తియొక్క పెరుగుదలను ఆకాశమున స్థిరముగ నిలిచియున్న సూర్యబింబముతో కలిపి చూడగ సూర్యబింబమే క్రిందికి దిగివచ్చుచున్నట్లు కనిపించుటను, అద్భుతముగ చిత్రింపబడినది.) ఈ విధముగ వామనుడు త్రివిక్రముడై బ్రహ్మాండమంతయు నిండెను.

అది యెట్లనిన :-

ఆ ఆదివిష్ణువు త్రిగుణాత్మకమైన విశ్వరూపమును ధరించి, భూమి ఆకాశ స్వర్గములును, చరాచర అఖిలభూత సమూహములును, తానేయై, క్రమక్రమముగ భూలోకమును మించి, భువర్లోకము నతిక్రమించి, సువర్లోకమును దాటి, మహర్లోకమును మించి, జనోలోకమునకు మీదై తపోలోకంబునకు ఎదిగినవాడై సత్యలోకముకంటె నున్నతుడై, ఏ మాత్రము సందులేకుండ నిండినవాడై, మహాదేహుడై, పాదతలమున రసాతలమును పాదములపైన భూమియు, పిక్కల స్థానమున పర్వతములును, తొడల స్థలమున ఇంద్రసేన, మరుత్తులు, ఆసన స్థలమున సంధ్యయు, గుహ్యమున (రహస్యస్థలమున) ప్రజాపతులును, పిఱుదుల కడ దనుజాలు (అసురులు)ను, నాభిస్థలమున అభ్రమును, ఉదరమున సప్తసముద్రములును, రొమ్ము స్థలమున తారకలును, స్తనభాగమున ఋతము, సత్యములును, హృదయమున ధర్మమును, మనస్సున చంద్రుడును, వక్షమున లక్ష్మీదేవియు, కంఠమున వేదములును, భుజములందు ఇంద్రాదిదేవతలును, చెవులందు దిశలును, శిరమున ఆకాశమును, శిరోజములందు మేఘములును, నాసికయందు వాయువులును, కండ్లయందు సూర్యుడును, వదనమున అగ్నియు, వాక్కునందు సకలఛ్ఛంద సముదాయమును, రసనమునందు (జిహ్వ) జలాధిపతియును, కనుబొమలకడ విధినిషేధములును, కనురెప్పలకడ రాత్రింబవళ్లను, లలాటమున కోపమును, అధరమున లోభమును, స్పర్శయందు కామమును, రేతస్సునందు జలమును, పృష్ఠమున అధర్మమును, నడకయందు యజ్ఞమును, ఛాయవలన మృత్యువును, నవ్వువలన మాయావిశేషములును, రోమములందు ఓషధులును, నాడీ ప్రదేశమున నదులును, నఖములందు శిలలును, బుద్ధియందు బ్రహ్మయు, ప్రాణములలోన దేవర్షి గణములును, శరీరమున స్థావర జంగమ సమూహములును, గలవాడై శంఖ, సారంగ, సుదర్శన, గదాదండ, ఖడ్గ, అక్షయ, బాణ, తూణీరములను ధరించినవాడై, మకర కుండల, కిరీట, కేయూర, హార, కటక, కంకణ, కౌస్తుభ, మణిమేఖల, అంబర, వనమాలికా, అలంకృతుడును,

సునంద, నంద, జయ, విజయ, ప్రముఖ పరిచర పరివృతుడును, అసమాన తేజోవిలాసుడును, బ్రహ్మాండ మంతయు నిండి, విజృంభించి,

మ. ఒకపాదంబున భూమిఁగప్పి దివి వేఱొంటన్ విరోధించి యొం
డొకటన్ మీఁద జగంబు లెల్లఁదొడి నొండొంటిన్ విలంఘించి ప
ట్టక బ్రహ్మాండకటాహముం బగిలి వేంద్రం బై పరుల్ గానరా
కొకఁడై వాగ్మనగలభ్యుఁడై హరి విభుం డొప్పారె విశ్వాకృతిన్

ఒక పాదముతో భూమినంతటిని ఆక్రమించి, రెండవ పాదముచే మీదిలోకములన్నింటిని నొక్కొక్కటిగ నాక్రమించును, ఇంకను పట్టక (చోటుచాలక) బ్రహ్మాండ కటాహము (పైకప్పు)ను ఛేదించుకొని, పైకెగసి, వాక్కుకు, చూడ్కులకు అతీతుడైన హరి, విభువుడై విశ్వరూపముతో విలసిల్లెను.

అప్పుడు ఆ త్రివిక్రముని ఒక పాదముక్రింద భూమి, పద్మమునకు అంటుకున్న ఒక చిన్న మట్టిముద్దవలెను, ఇంకొక పాదము క్రింద, ఆకాశము (ఊర్ధ్వలోకములు) పద్మముపై వ్రాలిన తేనెటీగలవలె వెలసినవి. అప్పుడు, అన్ని జగములను దాటివెళ్లిన త్రివిక్రముని పాదముయొక్క నఖముల తేజస్సుకు సత్యలోకమునగల బ్రహ్మ తేజస్సు సూర్యునిముందు దీపమువలె వెలవెలపోయెను.

సీ. భవబంధములఁ బాసి బ్రహ్మలోకంబునఁ గాఁపురంబులుసేయు ఘనులు రాజు
లా మరీచ్యాదులు నా సనందాదులు నా దివ్యయోగీంద్రు లచట నెపుడు
మూర్తి మంతంబు లై మ్రోయు పురాణ తర్కామ్నాయ నియమేతిహాస ధర్మ
సంహితాదులు గురు జ్ఞానాగ్ని నిర్దగ్ధ కర్ములై మఱియును గలుగునట్టి

ఆ. వారలెల్లఁజొచ్చి వచ్చి సర్వాధిపు
సంఘ్రిఁజూచి మ్రొక్కి రధికభక్తి
దమ మనంబులందుఁ దలఁచు నిధానంబుఁ
గంటి మనుచు నేఁడు మంటి మనుచు

సంసార బంధములను తొలగించుకొని బ్రహ్మలోకమునందు కాపురము చేయు పుణ్యాత్ములు, ఘనులునైన, ఆ మరీచ్యాదులు, సనకసనందాదులు,